RNI No.: TELTEL2015/62825

# తెలంగాణ సేన

TELANGANA SENA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ,ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో

తెలంగాణ సేన దినపత్రికలో పనిచేయుటకు

విలేకరులు కావలెను

జిల్లా రిపోర్టర్ లు, నియోజకవర్గ రిపోర్టర్ లు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ లు కావలెను.

9959236324 9951247932

PUBLISHED FROM : HYDERABAD | సంపుటి : 10 సంచిక : 203 మంగళవారం 18 - 02 - 2025 ఎడిటర్ : బొమ్మరబోయిన వెంకన్న ముదిరాజ్ అసోసియేట్ ఎడిటర్ : కే రాజేంద్ర ప్రసాద్ పేజీలు : 08 వెల : 2 రూ/-

### ముగ్గురు మంత్రులు ఉండి కూడా వేస్ట్...

## రాజీనామా చేయాలి



- ఖమ్మం జిల్లాలోని ముగ్గురు మంత్రులు రాజీనామా చేయాలన్న కవిత
- అభివృద్ధిలో వీరు చేసిందేమీ లేదని విమర్శ
- టీడీపీ, బీజేపీ పొత్తు వల్ల ఏపీకి అన్ని అనుమతులు వస్తున్నాయని వ్యాఖ్య

ఖమ్మంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన సంత్ సేవాలాల్ జయంతి వేడుకల్లో ఆ పార్టీ మిగతా 2లో

### నాడు ఎవరెస్ట్..

## నేడు అన్నమో రామచంద్ర

**రేవంత్.. 50 మంది విద్యార్థులు చనిపోయినా చలనం లేదా?**

పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాలు.. ఏడాది కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తమై అధ్వాన్న స్థితికి చేరాయని బీఆర్ఎస్ ని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆం ఆరోపించారు.

ఈ మేరకు ఆదివారం జాగో తెలంగాణ జాగో అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా గురుకులాల పరిస్థితిపై ట్వీట్ చేశారు.

నాడు డాక్టర్లు, ఇంజనీర్ వంటి ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు, నేడు సరైన దిశానిర్దేశం లేక దీన పరిస్థితి ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.



హైదరాబాద్: పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాలు.. ఏడాది కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తమై అధ్వాన్న స్థితికి చేరాయని మిగతా 2లో

### ప్రజలకు మెరుగైన

## రవాణా సౌకర్యం కల్పిస్తాం



- పజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తగు చర్యలు తీసుకుంటున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ అన్నారు.
- ఆదివారం 132- జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జయరామ్ నగర్‌లో రూ.90 లక్షల వ్యయంతో పూర్తిచేసిన సీసీ రోడ్లను ప్రారంభించారు

కుత్బుల్లాపూర్ : ప్రజలకు మెరుగైన మిగతా 2లో

## కుంభమేళాలో అగ్ని ప్రమాదం... దగ్ధమైన ఏడు టెంట్లు

దగ్ధమైన దుస్తులు, ఆహార సామాగ్రి

ఎవరికీ ఏమీ కాలేదని అధికారులు వెల్లడి

సెక్టార్ 19లోని క్యాంపులో సాయంత్రం అగ్ని ప్రమాదం



ఉత్తరప్రదేశ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. మిగతా 2లో

## సునీత,విల్మోర్‌లకు 'గ్రావిటీ' భయం..!

నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్,బుచ్ విల్మోర్‌లు అంతరిక్షం నుంచి మార్చి 19న భూమి మీదకు బయలుదేరనున్నారు.




వాషింగ్టన్: నాసా వ్యోమగాములు సునీతా విలియమ్స్,బుచ్ విల్మోర్‌లు అంతరిక్షం నుంచి మిగతా 2లో

### అమెరికా నుంచి అమృత్‌సర్‌కు..

## 116మంది భారత అక్రమ వలసదారుల రాక

అమెరికా నుంచి భారత అక్రమ వలసదారులతో కూడిన రెండో విమానం రాత్రి 11.30 గంటల సమయంలో అమృత్‌సర్ విమానాశ్రయంలో ల్యాండయింది.




అమృత్‌సర్: అమెరికా నుంచి భారత అక్రమ వలసదారులతో కూడిన రెండో విమానం మిగతా 2లో

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

## రాజబాబు మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి



- నటి కృష్ణవేణి మృతి పట్ల వైఎస్ జగన్ సంతాపం
- ద్వారకాతిరుమల మండలంలోని సీహెచ్ పోతేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజమోహన్‌రావు(రాజబాబు) మృతిపై ఆ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు,
- సుధీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు.

తాడేపల్లి: ద్వారకాతిరుమల మండలంలోని సీహెచ్ పోతేపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ మిగతా 2లో

### ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే

## పేదల ముఖంలో చిరునవ్వు

**తలసేమియా బాధితుల కోసం నిధుల సేకరణ**

ఎన్టీఆర్ ట్రస్ట్ సారథ్యంలో యుఫోరియా మ్యూజికల్ నైట్


విజయవాడలో సంగీత విభావరి

ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదవారి ముఖంలో చిరునవ్వు, ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే భరోసా, ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే నమ్మకం. విశ్వ విఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ ఎన్టీఆర్ గారి స్ఫూర్తి, చంద్రబాబు గారి ఆలోచన, భువనేశ్వరి గారి ఆచరణే ఎన్టీఆర్ ట్రస్ట్ అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు.

ఉత్తరాఖండ్ వరదలు, హుద్ హుద్ తుఫాన్, తిత్లీ, గత ఏడాది విజయవాడ వరదలు, కర్నూలు వరదలు, గోదావరి వరదల సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ బాధితులకు అండగా నిలచింది.

అన్నమయ్య డ్యామ్ కొట్టుకపోయిన సమయంలో 48 బాధిత కుటుంబాలకు లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు.

ప్రపంచాన్ని వణికించిన కోవిడ్-19 మహమ్మారి బాధితులను ఆదుకోవడాన్ని ఎన్టీఆర్ ట్రస్ట్ సవాలుగా స్వీకరించింది.



ఫ్యాక్షన్ హింసకు గురైన అనేక కుటుంబాలకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆశాజ్యోతిగా నిలిచింది, వారికి విద్య, ఆర్థిక మద్దతును అందిస్తోంది. నా పాదయాత్రలో, ట్రస్ట్ చాలా మంది చిన్న పిల్లల జీవితాలను ట్రస్ట్ ఎలా మార్చేసిందో నేను ప్రత్యక్షంగా చూశాను. అనంతపురానికి చెందిన శ్రావణి అనే యువతి నన్ను కలిసింది. వీరి తండ్రి తగరకుంట ప్రభాకర్ ఫ్యాక్షన్ హింసలో మృతి చెందారు. శ్రావణి, ఆమె ఐదుగురు తోబుట్టువులు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ నుండి విద్యను అభ్యసించారు, వారిలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అయ్యారు. చిన్నవారైన శ్రావణి ఇప్పుడు బెంగుళూరులో పని చేస్తోంది, ఇది ట్రస్ట్ యొక్క సానుకూల ప్రభావానికి నిదర్శనం.

ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదవారి ముఖంలో చిరునవ్వు, ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే భరోసా, ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే నమ్మకం. విశ్వ విఖ్యాత నటసార్వభౌమ స్వర్గీయ శ్రీ ఎన్టీఆర్ గారి స్ఫూర్తి, చంద్రబాబు గారి ఆలోచన, భువనేశ్వరి గారి ఆచరణే ఎన్టీఆర్ ట్రస్ట్ అని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ అన్నారు. మిగతా 2లో

### వారికి రాజకీయాల్లో

## ఉండే అర్హత లేదు



- మహిళలపై నోరు జారడం నీచం
- జగన్ రాజకీయ చరిత్ర ముగిసింది
- ఇప్పటికైనా ఆయన మనిషిలా బతకడం నేర్చుకోవాలి
- 'ఇంటిలో ఆడవారిని తిట్టించి పైశాచిక ఆనందం పొందినవారికి రాజకీయాల్లో ఉండేందుకు కనీస అర్హత కూడా లేదు.
- అన్నం తినేవాడు ఎవరైనా ఇంటిలో ఆడవారిని తిట్టిస్తాడా? జగన్ వంటి నీచుడు మాత్రమే అలా చేస్తాడు. మిగతా 2లో

### '11 సీట్లు వచ్చినా

## వారి బుద్ధి మారట్లేదు'

**ఏపీలో ప్రభుత్వ కొలువుల జాతర షురూ..**

వైసీపీ నేత వల్లభనేని వంశీ అంటేనే అరాచకత్వం అవినీతికి మారుపేరు అని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు.

వంశీని సమర్థిస్తున్న వైఎస్ జగన్ కూడా ఒక అరాచక శక్తి అని మండిపడ్డారు.

దేశంలో ఎక్కడా ఏ పార్టీ ఆఫీస్లపై దాడి జరగలేదు. కానీ టీడీపీ ఆఫీస్ పై వంశీ దాడి చేశారు.



పశ్చిమగోదావరి జిల్లా (పాలకొల్లు) : వైసీపీ నేత వల్లభనేని వంశీ అంటేనే అరాచకత్వం అవినీతికి మారుపేరు అని మంత్రి నిమ్మల రామానాయుడు ఆరోపించారు. మిగతా 2లో

### తెలుగు సినీ చరిత్రలో

## కృష్ణవేణిది ఓ ప్రత్యేక అధ్యాయం



నటి కృష్ణవేణి మృతి వ్యక్తిగతంగా తమకు తీరని లోటని వ్యాఖ్య

ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నట్లు వెల్లడి

కృష్ణవేణి కుటుంబానికి సానుభూతి తెలియజేసిన బాలకృష్ణ

నటిగా, నిర్మాతగా, స్టూడియో అధినేతగా తెలుగు సినీ చరిత్రలో కృష్ణవేణిది ఓ ప్రత్యేక అధ్యాయమని మిగతా 2లో

### నాతో పాటు సీఎం రేవంత్

## ఆలోచన కూడా అదే

**దేశ భవిష్యత్ రాహుల్ గాంధీ దే**

రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గట్టుపల్లిలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైనింగ్ క్యాంప్‌ను టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు.

యూత్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జాతీయ గీతం ఆలపించారు.

ఎన్నికలు ఎప్పుడు వస్తే అప్పుడు రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు.



రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం గట్టుపల్లిలో తెలంగాణ యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ట్రైనింగ్ క్యాంప్‌ను టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు.ఈ సందర్భంగా.. మిగతా 2లో

## కుంభమేళాలో అగ్ని ప్రమాదం... దగ్ధమైన ఏడు టెంట్లు

కుంభమేళా ప్రాంతంలోని ఓ స్టోర్ రూంలో ఈరోజు సాయంత్రం మంటలు ఎగిసిపడ్డాయి. దీంతో ఏడు టెంట్లు దగ్ధమయ్యాయి. అక్కడే ఉన్న దుప్పట్లు, ఆహార సామగ్రి కూడా దగ్ధమైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదని తెలిపారు. కుంభమేళా చీఫ్ ఫైర్ ఆఫీసర్ ప్రమోద్ శర్మ మాట్లాడుతూ, మహా కుంభమేళాలోని సెక్టార్ 19లోని క్యాంపులో మంటలు చెలరేగాయని తెలిపారు. ఏడు టెంట్లకు మంటలు అంటుకున్నాయని వెల్లడించారు. తమకు సమాచారం అందగానే రెండు నిమిషాల్లో సంఘటనా స్థలానికి చేరుకున్నామని తెలిపారు. మహా కుంభ్ డీఐజీ వైభవ్ కృష్ణ మాట్లాడుతూ, సాయంత్రం 6.15 గంటలకు అగ్నిప్రమాదం సంభవించిందని తెలిపారు. పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది స్పందించి ఐదు నిమిషాల్లోనే మంటలను అదుపులోకి తెచ్చారని వెల్లడించారు. ఆ గుడారాల్లో భక్తులు కూడా ఉన్నారని, కానీ ఎవరికీ ఏమీ కాలేదని ఆయన అన్నారు.

## సునీత,విల్మోర్‌లకు 'గ్రావిటీ' భయం..!

మార్చి 19న భూమి మీదకు బయలుదేరనున్నారు. గతేడాది జూన్‌లో అంతర్జాతీయ స్పేస్‌స్టేషన్(ఐఎస్ఎస్)కు వెళ్లిన వారిద్దరు అనుకోని పరిస్థితుల్లో ఎనిమిది నెలలపాటు అక్కడే ఉండిపోయారు. అయితే వ్యోమగాములిద్దరు భూమి మీదకు వచ్చిన తర్వాత పలు రకాల సమస్యలను ఎదుర్కోనున్నట్లు తెలుస్తోంది. జీరో గ్రావిటీ నుంచి భారీ గురుత్వాకర్షణ కలిగిన భూమి వాతావరణంలోకి 8 నెలల తర్వాత వారు రానుండడమే ఇందుకు కారణం. తాము భూమి మీదకు వచ్చిన తర్వాత చిన్న పెన్సిల్‌ను లేపినా పెద్ద బరువులు ఎత్తి వ్యాయామం చేసిన ఫీలింగే ఉంటుందని విల్మోర్ మీడియాకు తెలిపారు.'ఇక్కడి నుంచి భూమి మీదకు వచ్చిన తర్వాత గ్రావిటీలో చాలా ఇబ్బందిగా అనిపిస్తుంది. భూమిపై పరిస్థితులకు అలవాటుపడే దాకా ఇబ్బందిగానే ఉంటుంది.శరీరం బరువెక్కిన ఫీలింగ్ కలుగుతుంది' అని విల్మోర్ వెల్లడించారు. స్పేస్‌లో తేలియాడుతూ ఉండే వ్యోమగాములు..భూమి మీదకు వచ్చిన తర్వాత ఆ ప్రత్యేక అనుభూతికి దూరమవుతారు. అంతరిక్షంలో ఎక్కువ కాలం ఉంటే వ్యోమగాముల ఆరోగ్య పరిస్థితిపై ప్రభావం చూపిస్తుంది.ఒక వ్యోమగామి అంతరిక్షంలోకి వెళ్లాక వారి శరీరం ఎర్రరక్తకణాలను నాశనం చేయడం ప్రారంభిస్తుంది.ఎర్రరక్తకణాల సంఖ్య తగ్గించుకోవడం ద్వారా మైక్రోగ్రావిటీ పరిస్థితుల్లో శరీరం ఆక్సిజన్ అవసరాలను తగ్గించుకుంటుంది.గుండె పనితీరుపైనా అంతరిక్షం ప్రభావం చూపిస్తుంది.బోయింగ్ వ్యోమనౌకలో భాగంగా నాసా గత జూన్‌లో సునీత,విల్మోర్‌లను ఐఎస్ఎస్‌కు పంపించింది. వ్యోమనౌకలో లోపాలు తలెత్తడంతో వారం రోజుల కోసం వెళ్లిన ఇద్దరు ఏకంగా 8 నెలలు అక్కడే ఉండిపోవాల్సి వచ్చింది.

## అమెరికా నుంచి అమృత్‌సర్‌కు..
## 116మంది భారత అక్రమ వలసదారుల రాక

రాత్రి 11.30 గంటల సమయంలో అమృత్‌సర్ విమానాశ్రయంలో ల్యాండయింది. రాత్రి 10 గంటలకు రావాల్సిన ఈ విమానం ఆలస్యమైంది. ఈ విమానంలో 119 మంది వలసదారులను పంపుతామని అమెరికా అధికారులు ప్రకటించినా, 116 మంది మాత్రం వచ్చినట్లు అధికారులు తెలిపారు. వీరిలో అత్యధికంగా పంజాబ్‌కు చెందిన 65 మంది ఉన్నారు. ఆ తర్వాత హర్యానాకు చెందిన 33 మంది, గుజరాత్ నుంచి 8 మంది, యూపీ, గోవా, మహారాష్ట్ర, రాజస్తాన్‌ల నుంచి ఇద్దరు చొప్పున, హిమాచల్ ప్రదేశ్, జమ్మూకశ్మీర్ నుంచి ఒక్కొక్కరు చొప్పున ఉన్నారు. వీరంతా 18-30 ఏళ్ల మధ్య వారేనని అధికార వర్గాలు తెలిపాయి. అమెరికా నుంచి మొదటి విడతలో ఈ నెల 5న 104 మంది అక్రమ వలసదారులు భారత్‌కు రావడం తెలిసిందే.

## వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
## రాజబాబు మృతిపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చెలికాని రాజమోహన్‌రావు(రాజబాబు) మృతిపై ఆ పార్టీ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు, సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన నాయకుడిని కోల్పోవడం బాధాకరమన్నారు. రాజబాబు మరణం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి తీరని లోటు అన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా రాజబాబుతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.రాజబాబు శనివారం రాత్రి మృతి చెందారు. ఇటీవల బాత్‌రూమ్‌లో కాలుజారి పడిపోవడంతో ఆయన ఎడమ కాలికి తీవ్ర గాయమైంది. కొద్దిరోజుల పాటు లక్ష్మీపురంలోని విర్డ్ ఆస్పత్రిలో చికిత్స పొందిన ఆయన, శస్త్రచికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని సిటీ న్యూరో ఆస్పత్రిలో చేరారు. అక్కడ వైద్యులు వారం రోజుల క్రితం ఆయన కాలికి శస్త్రచికిత్స చేశారు.ఈ నెల 12న ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అవ్వాల్సి ఉండగా, అదే రోజు ఉదయం 11.30 గంటల సమయంలో ఆయనకు బ్రెయిన్ స్ట్రోక్ వచ్చింది. అప్పటి నుంచి వైద్యులు ఆయనకు వెంటిలేటర్ సాయంతో వైద్యం చేస్తూ వచ్చారు. పరిస్థితి విషమించడంతో తుదిశ్వాస విడిచారు. రాజబాబు మృతి చెందడంతో మండలంలోని పార్టీ శ్రేణులు, ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.సినీ నటి, నిర్మాత, నేపథ్య గాయని కృష్ణవేణి మృతిపై వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. నటిగా తనదైన ముద్ర వేసిన కృష్ణవేణి మృతి సినీ రంగానికి తీరని లోటు అని అన్నారు. కృష్ణవేణి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.సినీ నటి కృష్ణవేణి మృతి పట్ల వైఎస్ జగన్ స్పందించారు. వైఎస్ జగన్..? ఈ సందర్భంగా సంతాపం తెలిపారు. అనేక భాషల్లో నటించి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరొందారు. నటిగా తనదైన ముద్ర వేసిన కృష్ణవేణి మృతి సినీ రంగానికి తీరని లోటు. అనేక గొప్ప చిత్రాలు తీసి నిండు నూరేళ్లు సంపూర్ణంగా జీవించి పరమపదించిన ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నాను. కృష్ణవేణి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నానని అన్నారు.

## వారికి రాజకీయాల్లో ఉండే అర్హత లేదు

విజయవాడ : 'ఇంటిలో ఆడవారిని తిట్టించి పైశాచిక ఆనందం పొందినవారికి రాజకీయాల్లో ఉండేందుకు కనీస అర్హత కూడా లేదు. అన్నం తినేవాడు ఎవరైనా ఇంటిలో ఆడవారిని తిట్టిస్తాడా? జగన్ వంటి నీచుడు మాత్రమే అలా చేస్తాడు. చంద్రబాబు తన కార్యకర్తలు ఎవరైనా నోరు జారినా ఊరుకోరు. వంశీ, కొడాలి నానితో మాట్లాడించిన జగన్ రాజకీయ చరిత్ర ముగిసింది. మొన్న ప్రజలు ఛీకొట్టి 11 సీట్లు ఇచ్చారు. ఈసారి అవికూడా రావు. ఇప్పటికైనా మనిషిగా బతకడం నేర్చుకోవాలి' అని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 'పిల్ల సైకో వంశీ అరెస్టును ఖండిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టిన జగన్ నీచుడు. ఎన్టీఆర్ కుమార్తెగా, చంద్రబాబు సతీమణిగా భువనేశ్వరికి సమాజంలో గుర్తింపు, గౌరవం ఉంది. తండ్రి, భర్త సీఎంలుగా ఉన్నప్పటికీ సొంతంగా పారిశ్రామికవేత్తగా ఎదిగి వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నారు. అటువంటి ఆమెను అవమానిస్తే, నీచంగా మాట్లాడితే జగన్ సైకోలాగా ఆనందాన్ని పొందాడు. తల్లిని, చెల్లిని గౌరవించని జగన్‌కు ఇంతకన్నా సంస్కారం ఉంటుందని అనుకోనక్కర్లేదు. విజయసాయిరెడ్డి వంటి వారే జగన్ అరాచకాలను భరించలేక బయటికి వచ్చారు. కొడాలి నాని, వంశీ, అంబటి రాంబాబు, అనిల్ యాదవ్, వెలంపల్లి శ్రీనివాసరావు, రోజాలకు శిక్షణ ఇచ్చి జగనే మాట్లాడించాడు. వంశీ అవినీతిపై 2019లోనే తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో విచారణ జరిగింది.బ్రహ్మలింగయ్య చెరువు భూములు, ఇళ్ల స్థలాల కేటాయింపులో దోచుకున్నాడు. అప్పుడే అనేకసార్లు వంశీకి చంద్రబాబు హెచ్చరికలు జారీ చేశారు. వైసీపీ ప్రభుత్వం రాగానే తన తప్పులను ఒప్పులుగా మార్చుకునేందుకు ఆ పార్టీలోకి వెళ్లాడన్నారు. ఉచ్ఛ నీచాలు మరచి వ్యాఖ్యలు చేసిన వంశీని అరెస్టు చేస్తే... ప్రజలు హర్షిస్తున్నారు' అని బుద్దా అన్నారు.

## ముగ్గురు మంత్రులు ఉండి కూడా వేస్ట్... రాజీనామా చేయాలి

ఎమ్మెల్సీ కవిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సేవాలాల్ జయంతి వేడుకలు అధికారికంగా జరుగుతుండటం కేసీఆర్ చలవేనని చెప్పారు. గిరిజనులకు 10 శాతం రిజర్వేషన్ ఇచ్చిన ఘనత కేసీఆర్ దేనని అన్నారు. కేసీఆర్ రాకముందు పేద ఇంటి ఆడపిల్లకు పెళ్లి చేయాలంటే ఎంతో ఇబ్బంది పడేవారని... కేసీఆర్ వచ్చిన తర్వాత కళ్యాణలక్ష్మి పథకంతో పేదింటి ఆడపిల్లల పెళ్లిళ్లను సులభతరం చేశారని చెప్పారు. ఖమ్మంలో పేరుకే ముగ్గురు మంత్రులు ఉన్నారని... అభివృద్ధిలో మాత్రం వీరు చేసిందేమీ లేదని కవిత విమర్శించారు. అభివృద్ధి చేయలేని ఈ ముగ్గురు మంత్రులు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం చిల్లర రాజకీయాలు చేస్తోందని అన్నారు. ప్రజల అంచనాలకు మించి కేసీఆర్ ప్రభుత్వం పని చేసిందని చెప్పారు. టీడీపీ, బీజేపీ పొత్తులో ఉండటం వల్ల ఏపీకి అన్ని అనుమతులు వస్తున్నాయని కవిత అన్నారు. బనకచర్ల ప్రాజెక్ట్ కు అనుమతి వస్తే తెలంగాణకు చాలా నష్టమని చెప్పారు. కేంద్రం అనుమతి లేకుండానే ఏపీలో ప్రాజెక్టులు కడుతున్నారని అన్నారు. కళ్ల ముందే నీళ్లు వెళ్లిపోతున్నా... సీఎం సొంత జిల్లాలో ఒక్క తట్ట మట్టి కూడా ఎత్తిపోయలేదని విమర్శించారు. పోలవం ఏడు మండలాల కోసం తాము ఎంతో పోరాటం చేశామని చెప్పారు.

## ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పిస్తాం

రవాణా సౌకర్యం కల్పించడమే లక్ష్యంగా తగు చర్యలు తీసుకుంటున్నామని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకనంద్ అన్నారు. ఆదివారం 132- జీడిమెట్ల డివిజన్ పరిధిలోని జయరామ్ నగర్‌లో రూ.90 లక్షల వ్యయంతో పూర్తిచేసిన సీసీ రోడ్లను ప్రారంభించారుఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఏ ప్రభుత్వమైనా ప్రజా సంక్షేమం కోసమే కృషి చేయాలన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి బలమైన రహదారులను నిర్మించి ప్రజలకు మెరుగైన రవాణా సదుపాయాలు అందించడమే లక్ష్యంగా నిరంతరం అభివృద్ధి పనులను చేపడుతామన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రా రెడ్డి, సంక్షేమ సంఘం అధ్యక్షులు కుంటి మల్లేష్, ప్రధాన కార్యదర్శి మన్నే హరినాథ్, ఉపాధ్యక్షుడు లింగ భిక్షపతి, చైర్మన్ ఆర్ నరసింహ, కోశాధికారి ఎన్ చంద్రయ్య, సభ్యులు రాములు ఉపేందర్, నరేష్, అజయ్, కుమార్, యాది, రమేష్, ఈశ్వర్, సత్యనారాయణ, మల్లేష్, సత్తిబాబు, మహేష్, క్రాంతి, కుంట సిద్ధిరాములు, సంపత్ మాధవరెడ్డి, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, పోలే శ్రీకాంత్, విజయ హరీష్, రాములు యాదవ్, పాల్గొన్నారు.

### కమనీయం.. కడురమణీయం

132 - జీడిమెట్ల డివిజన్ దండమూడి ఎంక్లేవ్‌లో వైభవోపేతంగా నిర్వహించిన వెంకటేశ్వర స్వామి

## ఎన్టీఆర్ ట్రస్ట్ అంటే పేదల ముఖంలో చిరునవ్వు



ఎన్టీఆర్ ట్రస్ట్ 28వవార్షికోత్సవం సందర్భంగా తలసేమియా బాధితుల కోసం విజయవాడ ఇందిరాగాంధీ స్టేడియంలో నిర్వహించిన యుఫోరియా మ్యూజికల్ నైట్ లో మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... "తలసీమియా బాధితులకు సహాయం చెయ్యడానికి ముందుకు వచ్చిన అందరికీ శిరస్సు వంచి నమస్కరిస్తున్నాను. మీరు ఇచ్చిన ప్రతి రూపాయి ఒక ప్రాణాన్ని కాపాడుతుంది. 1997లో ఒక్క అడుగుతో ఎన్టీఆర్ ట్రస్ట్ ప్రయాణం ప్రారంభమైంది. 28 ఏళ్ల ప్రస్థానంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించింది ఎన్టీఆర్ ట్రస్ట్. విద్య, వైద్యం, స్వయం ఉపాధి, సురక్షిత త్రాగునీరు ఇలా అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ తెలుగు ప్రజల మనస్సు గెలుచుకుంది ఎన్టీఆర్ ట్రస్ట్. ప్రకృతి వైపరీత్యాలు వస్తే ప్రజల్ని అందరి కంటే ముందు పలకరించేది, సాయం అందించేది ఎన్టీఆర్ ట్రస్ట్. స్త్రీ శక్తి తో మహిళలు సొంత కాళ్ళ పై నిలబడే శక్తిని ఇచ్చింది ఎన్టీఆర్ ట్రస్ట్" అని వివరించారు.

ఫ్యాక్షన్ బాధిత కుటుంబాలకు అండగా...

ఫ్యాక్షన్ హింసకు గురైన అనేక కుటుంబాలకు ఎన్టీఆర్ ట్రస్ట్ ఆశాజ్యోతిగా నిలిచింది, వారికి విద్య, ఆర్థిక మద్దతును అందిస్తోంది. నా పాదయాత్రలో, ట్రస్ట్ చాలా మంది చిన్న పిల్లల జీవితాలను ట్రస్ట్ ఎలా మార్చేసిందో నేను ప్రత్యక్షంగా చూశాను. అనంతపురానికి చెందిన శ్రావణి అనే యువతి నన్ను కలిసింది. వీరి తండ్రి తగరకుంట ప్రభాకర్ ఫ్యాక్షన్ హింసలో మృతి చెందారు. శ్రావణి, ఆమె ఐదుగురు తోబుట్టువులు ఎన్టీఆర్ మోడల్ స్కూల్ నుండి విద్యను అభ్యసించారు, వారిలో నలుగురు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు అయ్యారు. చిన్నవారైన శ్రావణి ఇప్పుడు బెంగుళూరులో పని చేస్తోంది, ఇది ట్రస్ట్ యొక్క సానుకూల ప్రభావానికి నిదర్శనం. మౌనిక అనే యువతి నన్ను అనంతపురంలో కలిసింది. ఫ్యాక్షన్ హింసలో ఆమె తండ్రి శ్రీనివాస్ గౌడ్ చనిపోయారు. మౌనిక, ఆమె సోదరి, నాగమణి, ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌లో చదువుకున్నారు, నాగమణి హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా మారింది. మౌనిక వ్యవసాయ శాస్త్రంలో ఎంఎస్సీ పూర్తి చేసింది. అధికారంతో సంబంధం లేకుండా ఎన్టీఆర్ ట్రస్ట్ చేపడుతున్న కార్యక్రమాలు ప్రశంసనీయం.

వరదబాధితులకు ఆపన్నహస్తం

ఉత్తరాఖండ్ వరదలు, హుద్ హుద్ తుఫాన్, తిత్లీ, గత ఏడాది విజయవాడ వరదలు, కర్నూలు వరదలు, గోదావరి వరదల సమయంలో ఎన్టీఆర్ ట్రస్ట్ బాధితులకు అండగా నిలచింది. అన్నమయ్య డ్యామ్ కొట్టుకపోయిన సమయంలో 48 బాధిత కుటుంబాలకు లక్ష చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఆపన్నులకు అండగా నిలుస్తూ సహాయక చర్యల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ ఎల్లప్పుడూ ముందుంటుంది. అవసరమైన వారికి సకాలంలో సమర్థవంతమైన సేవలను అందిస్తోంది.

ఆరోగ్యసేవల్లో మేటి ఎన్టీఆర్ ట్రస్ట్

ప్రపంచాన్ని వణికించిన కోవిడ్-19 మహమ్మారి బాధితులను ఆదుకోవడాన్ని ఎన్టీఆర్ ట్రస్ట్ సవాలుగా స్వీకరించింది. క్లిష్టమైన సమయంలో అవసరమైన వారికి అండగా నిలచింది. మాస్కులు, మందులు, ఆక్సిజన్‌ను పంపిణీ చేశాం. మా ప్రయత్నాలు అక్కడితో ఆగలేదు. కోవిడ్-19 కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారి అంత్యక్రియల కోసం కూడా మేము సాయం అందించాం. ఇప్పటివరకు 8.70 లక్షల మంది రోగులకు రక్తాన్ని అందించడం ద్వారా ట్రస్ట్ లక్షలాది బాధితల ప్రాణాలను కాపాడింది. తలసేమియా, జన్యుపరమైన రుగ్మతతో బాధపడుతున్న 200 మంది పిల్లలు ట్రస్ట్ నుండి రక్తాన్ని పొందుతున్నారు. 2,020 మంది అనాథలు పూర్తిగా ఉచిత వసతి, విద్యను ఎన్టీఆర్ ట్రస్ట్ అందిస్తోంది.నిరంతరం ప్రజాసేవే లక్ష్యంగా పనిచేస్తున్న ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ భువనేశ్వరిగారు, ట్రస్ట్ టీమ్, సంగీత దర్శకుడు తమన్, హాజరైన వారందరికీ మంత్రి లోకేశ్ ధన్యవాదాలు తెలిపారు.

పార్టీ మారిన ఎమ్మెల్యేల గురించి ప్రస్తావిస్తూ, గతంలో సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్ ఏ పార్టీ బీఫారంపై గెలిచారో, ఆ తర్వాత ఏ పార్టీలో చేరారో చెప్పాలని ఆయన ప్రశ్నించారు. వారు ఎవరి హయాంలో మంత్రులయ్యారో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చెప్పాలని ఆయన నిలదీశారు. మంత్రివర్గ విస్తరణ తన ఒక్కడి నిర్ణయం కాదని ఆయన స్పష్టం చేశారు.రాష్ట్రంలోని స్థానిక సంస్థల్లో ఇప్పటికిప్పుడు బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ల అమలుకు పార్లమెంట్ ఆమోదం తప్పనిసరని, వచ్చే నెల తొలివారంలో అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని తెలిపారు. పార్లమెంట్‌లో బీసీ రిజర్వేషన్లకు చట్టబద్ధత కల్పించే బాధ్యతను రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు జి.కిషన్‌రెడ్డి, బండి సంజయ్ బాధ్యత తీసుకోవాలని సవాల్ చేశారు.రాష్ట్రంలో సమగ్రంగా కులగణన చేపట్టామని, అది దేశానికే ఒక రోడ్ మ్యాప్‌గా నిలుస్తుందని పేర్కొన్నారు. కులగణనలో సేకరించిన వివరాల ఆధారంగానే కమిషన్ లేదా అధికారులతో కమిటీ వేసి భవిష్యత్తులో ప్రజలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తామన్నారు. శనివారం ఢిల్లీలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో భేటీ అయిన సీఎం రేవంత్‌రెడ్డి.. అనంతరం అక్కడి తుగ్లక్‌రోడ్డులోని తన నివాసంలో మీడియాతో చిట్‌చాట్ చేశారు. వివరాలు ఆయన మాటల్లోనే... "మేం చేపట్టిన కులగణనలో బీసీలు ఆరు శాతం పెరిగారు. కేసీఆర్ సమగ్ర కుటుంబ సర్వేలో 4 కేటగిరీలు మాత్రమే చూపారు.

## '11 సీట్లు వచ్చినా వారి బుద్ధి మారట్లేదు'

వంశీని సమర్థిస్తున్న వైఎస్ జగన్ కూడా ఒక అరాచక శక్తి అని మండిపడ్డారు. దేశంలో ఎక్కడా ఏ పార్టీ ఆఫీస్లపై దాడి జరగలేదు. కానీ టీడీపీ ఆఫీస్ పై వంశీ దాడి చేశారు. దీనిపై ఫిర్యాదు చేసిన దళితుడిని కిడ్నాప్ చేసిన ఘనుడు అంటూ ఫైరయ్యారు. మహిళలు, దళితులు అంటే మాజీ సీఎం జగన్ కు చిన్నచూపు ఉందని.. వారికంటే వంశీ లాంటి రౌడీలు ఆయనకు ఎక్కువయ్యారా? అని ప్రశ్నించారు. ఈ క్రమంలో దళిత యువకుడిని బెదిరించి సాక్ష్యాలను తారుమారు చేయడానికి వంశీ కుట్ర చేశారని మంత్రి నిమ్మల ఆరోపించారు. ఇలాంటి వ్యక్తిని వైఎస్ జగన్ ఎలా సమర్థిస్తారు అని మంత్రి నిమ్మల రామానాయుడు ప్రశ్నించారు. తప్పును ఖండించాల్సింది పోయి.. వెనకేసుకొస్తున్నారు అంటూ విమర్శలు గుప్పించారు. ఈ క్రమంలో గత వైసీపీ హయాంలో జరిగిన అరాచకాలు పునరావృతం కానివ్వబోమని మంత్రి నిమ్మల హామీ ఇచ్చారు. '11 సీట్లు వచ్చినా వైసీపీ నేతలు, వైఎస్ జగన్‌కు ఇంకా బుద్ధి రాలేదు' అని మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు.

వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని నీటిపారుదల శాఖా మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు తెలిపారు. చంద్రబాబు అధికారం చేపట్టిన వెంటనే 16 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి డీఎస్సీపై తొలి సంతకం చేశారని గుర్తుచేశారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ముగియగానే మంత్రి నారా లోకేష్ ఆధ్వర్యంలో డీఎస్సీ విడుదల చేసి, వచ్చే విద్యా సంవత్సరానికి ముందుగానే ఉపాధ్యాయ పోస్టుల నియమకాలు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

నిరుద్యోగులను మోసం చేసిన జగన్..

ఆదివారం పాలకొల్లులో ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖరం విజయాన్ని కోరుతూ మంత్రి రామానాయుడు ప్రచారం నిర్వహించారు. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కూటమి అభ్యర్థి పేరాబత్తుల రాజశేఖర్ విజయం కోసం అంతా కృషి చేయాలని కోరారు. శాసనమండలిలో ఎన్డీఏ కూటమికి స్పష్టమైన మెజార్టీ ఇవ్వాలని పట్టభద్రులకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా మంత్రి నిమ్మల రామానాయుడు మీడియాతో మాట్లాడుతూ...ప్రతి జనవరిలో జాబ్ క్యాలెండర్, మెగా డీఎస్సీ అంటూ జగన్ నిరుద్యోగులను మోసం, దగా చేశారని మంత్రి రామానాయుడు విమర్శించారు.

మత్స్యకారులకు వరం..

వైసీపీ హయాంలో ఉపాధ్యాయులను మద్యం షాపుల దగ్గర విధులకు పెట్టారని ధ్వజమెత్తారు. సముద్రంలో చేపల వేట నిషేధిత రోజుల్లో ఏప్రిల్ మాసం నుంచి మత్స్యకారులకు జీవన భృతి నిమిత్తం రూ.20 వేలు అందజేస్తామని ప్రకటించారు. మే నెలలో రైతులకు రూ.20 వేలు చొప్పున అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయబోతున్నామని అన్నారు. జూన్ నెల విద్యా సంవత్సరానికి ముందు నుంచే తల్లికి వందనం కార్యక్రమం ఏపీలో అమలు చేస్తామని మంత్రి రామానాయుడు హామీ ఇచ్చారు.

జగన్ అరాచక శక్తి ..

రాజధాని అమరావతి, పోలవరం వంటి ముఖ్య ప్రాజెక్టుల పునర్నిర్మాణం, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ నిలుపుదల వంటివి కూటమి ప్రభుత్వ ఎనిమిది నెలల పాలనలో జరిగాయని గుర్తుచేశారు. వల్లభనేని వంశీ అంటేనే అరాచకత్వం, అవినీతి, గుండాయిజం అలాంటి వ్యక్తిని సమర్థిస్తున్న జగన్ కూడా ఒక అరాచక శక్తి అని విమర్శించారు. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఏ పార్టీ క్షార్యాలయంపైన దాడి జరిగిన ఘటన లేదని.. కానీ వల్లభనేని వంశీ జాతీయ రహదారి పక్కన ఉన్న తెలుగుదేశం ఆఫీసును ఐదు గంటల పాటు తగులబెట్టారని మండిపడ్డారు.

## నాడు ఎవరెస్ట్.. నేడు అన్నమో రామచంద్ర



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆం ఆరోపించారు.ఈ మేరకు ఆదివారం జాగో తెలంగాణ జాగో అంటూ కేటీఆర్ ఎక్స్ వేదికగా గురుకులాల పరిస్థితిపై ట్వీట్ చేశారు. నాడు డాక్టర్లు, ఇంజనీర్ వంటి ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు, నేడు సరైన దిశానిర్దేశం లేక దీన పరిస్థితి ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. నాడు గురుకులాల్లో సీటు కోసం పోటీ పడిన విద్యార్థులు.. నేడు గురుకులం పేరు చెబితే డీలా పడిపోతున్నారని తెలిపారు. నాడు కడుపునిండా అన్నం తిని-అనుకున్న లక్ష్యాలను సాధిస్తే.. నేడు అన్నమో రామచంద్ర అనే రోజులొచ్చాయన్నారు. నాడు 41 వేల సీట్లకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాసేందుకు లక్ష 68 వేల దరఖాస్తులు వస్తే.. నేడు 51 వేల సీట్లకు . గాను 80 వేల దరఖాస్తులే వచ్చాయని లెక్కలు వివరించారు.ఏడాది పాలనలో 50 కి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో మరణించినా కాంగ్రెస్ సర్కారులో కనీస చలనం లేదని ఆరోపించారు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కనీస పరామర్శ లేకపోగా అంత్యక్రియలకు, పరామర్శకు వెళ్లే ప్రతిపక్షం మీద ఈ ప్రభుత్వం నిర్భంధం ప్రయోగిస్తుందని తెలిపారు. ఈ సర్కారు నిర్లక్ష్యం తెలంగాణ భవిష్యత్తు అయిన భావితరాలకు శాపంగా మారిందని వెల్లడించారు.తెలంగాణలో కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం భవిష్యత్ తరాలకు శాపంగా మారిందని ఆరోపించారు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్. పదేళ్ల కేసీఆర్ పాలనలో ఎవరెస్ట్ శిఖరమంత ఎత్తు ఎదిగిన గురుకులాలు.. కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తమై అధ్వాన్న స్థితికి చేరాయన్నారు. ఏడాది పాలనలో 50 మందికి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో మరణించినా కాంగ్రెస్ సర్కారులో కనీస చలనం లేదని ఘాటు విమర్శలు చేశారు.తెలంగాణలో గురుకులాల పరిస్థితిపై మాజీ మంత్రి కేటీఆర్ స్పందించారు. ఈ క్రమంలో ట్విట్టర్ వేదికగా కేటీఆర్..'ఏడాది కాంగ్రెస్ పాలనలో అస్తవ్యస్తమై అధ్వాన్న స్థితికి చేరాయి. నాడు డాక్టర్లు, ఇంజనీర్ వంటి ఉన్నత చదువులు చదివిన విద్యార్థులు.. నేడు సరైన దిశానిర్దేశం లేక దీన పరిస్థితి ఎదుర్కొంటున్నారు. నాడు గురుకులాల్లో సీటు కోసం పోటీ పడిన విద్యార్థులు.. నేడు గురుకులం పేరు చెబితే డీలా పడిపోతున్నారు. నాడు కడుపునిండా అన్నం తిని-అనుకున్న లక్ష్యాలను సాధిస్తే.. నేడు అన్నమో రామచంద్ర అనే రోజులొచ్చాయి. నాడు 41 వేల సీట్లకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష రాసేందుకు లక్ష 68 వేల దరఖాస్తులు వస్తే.. నేడు 51 వేల సీట్లకు గాను 80 వేల దరఖాస్తులే వచ్చాయి.ఏడాది పాలనలో 50 మందికి పైగా విద్యార్థులు ఫుడ్ పాయిజన్, ఇతర కారణాలతో మరణించినా కాంగ్రెస్ సర్కారులో కనీస చలనం లేదు. చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు కనీస పరామర్శ లేకపోగా అంత్యక్రియలకు, పరామర్శకు వెళ్లే ప్రతిపక్షం మీద ఈ ప్రభుత్వం నిర్భందం ప్రయోగిస్తోంది. ఈ సర్కారు నిర్లక్ష్యం తెలంగాణ భవిష్యత్తు అయిన భావితరాలకు శాపం. జాగో తెలంగాణ జాగో!' అంటూ కామెంట్స్ చేశారు.

## నాతో పాటు సీఎం రేవంత్
## ఆలోచన కూడా అదే



యూత్ కాంగ్రెస్ శ్రేణులతో కలిసి జాతీయ గీతం ఆలపించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. దేశ భవిష్యత్ రాహుల్ గాంధీ దే అన్నారు. ఎన్నికలు ఎప్పుడు వస్తే అప్పుడు రాహుల్ గాంధీ ప్రధాని కావడం ఖాయమని జోస్యం చెప్పారు. కాంగ్రెస్లో సభ్యత్వం దొరకడం చాలా కష్టమని అన్నారు. యూత్ కాంగ్రెస్ ప్రపంచంలోనే పెద్దదని చెప్పారు. పార్టీలో సీనియర్ కాంగ్రెస్ నేతలు ఎంత మంది ఉన్నా.. యూత్ కాంగ్రెస్ కార్యకర్తలకు గుర్తింపు ఉంటుందని భరోసా ఇచ్చారు. రాజీవ్ గాంధీ లాగే రాహుల్ గాంధీ కూడా యూత్ను ప్రొత్సహిస్తున్నారని అన్నారు.ఏఐసీసీలో ముఖ్య నేతలంతా యూత్ కాంగ్రెస్ నుంచి వచ్చినవారే అని తెలిపారు. హిమాచల్ సీఎం, అరుణాచల్ మాజీ ముఖ్యమంత్రి వంటి నేతలు నుంచి వచ్చిన వారే అని అన్నారు. ఓపిక.. నిబద్ధత.. క్రమశిక్షణ ఉన్న కార్యకర్తలకు కాంగ్రెస్ పార్టీలో పదవులు వస్తాయని తెలిపారు. రాజకీయాల్లో కాంప్రమైజ్ కంపల్సరీ.. పరిస్థితులకు తగ్గట్టు సమయానుసారం నడుచుకోవాలని చెప్పారు. వెనక్కి తిరిగి చూడకుండా నిరంతరం కష్టపడాలి.. ఇదే యూత్ కాంగ్రెస్ నేతలకు తానిచ్చే సలహా అని అన్నారు. ప్రజలతో యూత్ కాంగ్రెస్ నేతలు సంబంధాలు కొనసాగించాలని సూచించారు.పీసీసీ కార్యవర్గంలో యంగ్ బ్లడ్ ఉండాలని నాతో పాటు సీఎం రేవంత్ ఆలోచన అని చెప్పారు. ప్రభుత్వ చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్ళే బాధ్యత యూత్ కాంగ్రెస్ నేతలపై ఉందని గుర్తుచేశారు. యూత్ కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు సోషల్ మీడియాపై ఫోకస్ చేయాలి.. ప్రభుత్వ కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని అన్నారు. మొత్తంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వానికి యూత్ కాంగ్రెస్ రక్షణ కవచంలా ఉండాలని అన్నారు. కాంగ్రెస్‌లో ప్రతీ కార్యకర్తకు స్వేచ్ఛ ఉంటుంది.. రాష్ట్ర ముఖ్యమంత్రిని సైతం ప్రశ్నించే హక్కు ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ కార్పొరేషన్ చైర్మన్ శివసేన రెడ్డి, తెలంగాణ యువజన కాంగ్రెస్ ఇంచార్జ్ సురభి, అధ్యక్షుడు శివ చరణ్ రెడ్డి పాల్గొన్నారు.

## తెలుగు సినీ చరిత్రలో
## కృష్ణవేణిది ఓ ప్రత్యేక అధ్యాయం

నందమూరి బాలకృష్ణ పేర్కొన్నారు. కృష్ణవేణి బహుముఖ ప్రజ్ఞాశాలి అని చెప్పారు. విశ్వ విఖ్యాత నట సార్వభౌమ నందమూరి తారక రామారావు గారి నటజీవితానికి బాట వేసిన కృష్ణవేణి శివైక్యం చెందడం బాధాకరమని అన్నారు. 'మన దేశం' లాంటి గొప్ప చిత్రాలు నిర్మించి సమాజంలో ఉన్నత విలువలను పెంచడానికి ఆమె కృషి చేశారని చెప్పారు. ప్రభుత్వ పరంగా ఎన్నో అవార్డులు అందుకున్నారని తెలిపారు.ఇటీవల నిర్వహించిన ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలలో, అంతకుముందు ఎన్టీఆర్ శతజయంతి వేడుకలలో కృష్ణవేణిని ఘనంగా సత్కరించామని గుర్తుచేశారు. కృష్ణవేణి మృతి వ్యక్తిగతంగా తమకు తీరని లోటు అని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ఆ భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా కృష్ణవేణి కుటుంబ సభ్యులకు నందమూరి బాలకృష్ణ సానుభూతి తెలిపారు.ప్రతిపక్షాల తీరు పార్లమెంటు లో విచిత్రంగా ఉందని ప్రజానీకం అంతా ఒకటే భావనతో అన్నారని మల్కాజ్ గిరి బీజేపీ ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఆదివారం సిద్దిపేట జిల్లా, గజ్వేల్ పట్టణంలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. దేశం సుభిక్షంగా ఉండాలన్నా, ఆర్థికంగా, బలంగా ఉండాలన్నా, ప్రపంచంలో దేశం సగౌరవంగా ఉండాలంటే మోదీ ప్రధానిగా ఉండాలనేది ప్రజలకు తెలుసునని అన్నారు. ఇటీవల జరిగిన తెలంగాణ ఎన్నికల్లో కాంగ్రెస్ కు 44 శాతం వస్తే.. బీజేపీకి 30 శాతం ఓట్లు వచ్చాయన్నారు.ఇప్పుడు తెలంగాణలో జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు మోదీని ఆశీర్వదించే విధంగా కనిపిస్తోందని ఈటల రాజేందర్ అన్నారు. ఉపాధ్యాయులకు అండగా కొట్లాడిన పార్టీ బీజేపీ అని, టీచర్ల విషయంలో, మధ్యతరగతి వారి విషయంలో బీజేపీ కృషిచేసిందని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య దేశంలో నే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా తాండవిస్తోందని, ప్రపంచం లో 11 వ ఆర్థిక వ్యవస్థలో ఉన్న భారత్ మోదీ కృషితో 5 వ స్థానానికి వచ్చిందన్నారు. నిరుద్యోగ సమస్యను సంపూర్ణంగా నిర్మూలించే విధంగా బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో రూ. 4 లక్షల కోట్లు పెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ పరంగా నిరుద్యోగ యువతకు మేలు జరుగుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు. ప్రపంచాన్నే శాసించే అమెరికా అధ్యక్షుడు, అమెరికాలో మోదీని సన్మానించిన విషయం చూసామన్నారు.

తెలంగాణ సేన
TELANGANA SENA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
మంగళవారం 18 - 02 - 2025

# రంగరాజన్ పై మతోన్మాద మూక దాడిని ముక్తకంఠంతో ఖండించాలి

రామరాజ్యం అంటే హింసాత్మక దాడులా ?
త్రిశూల్ పేరుతో యువతరం చేతుల్లో మారణాయుధాలు
జైభారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణమూర్తి
అసమానతలపై ధర్మపోరాటం చేయాలి
అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకరస్వామి
మతోన్మాదుల నుండి రాష్ట్రాన్ని రక్షించుకోవాలి
కేవీపీఎస్ రౌండ్ టేబుల్ సమావేశంలో ప్రజాసంఘాల నేతలు



**హైదరాబాద్, తెలంగాణ సేన న్యూస్ :** చిలుకూరు బాలాజీ టెంపుల్ ప్రధాన అర్చకుడు రంగరాజన్ పై రామరాజ్య స్థాపన ఆర్మీ పేరిట వీర రాఘవరెడ్డి అనే మతోన్మాది 20 మందితో కలిసి మూకుమ్మడిగా దాడి చేయడాన్ని ప్రతీ పౌరుడు ఖండించాలని జై భారత్ జాతీయ ప్రధాన కార్యదర్శి రమణ మూర్తి అన్నారు.సోమవారం హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం షోయబ్ హాల్ లో కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు అధ్యక్షత వహించి తీర్మాణం ప్రవేశపెట్టారు.ముఖ్యఅతిథిగా హాజరైన జై భారత్ జాతీయ కార్యదర్శి రమణమూర్తి మాట్లాడుతూ రంగరాజన్ ను బెదిరించడమే కాకుండా భయభ్రాంతులకు గురి చేశారని అడ్డువచ్చిన తన కుమారుడిపై కూడా దాడికి పాల్పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు వీర రాఘవరెడ్డి అనే మతోన్మాది దుష్ట శిక్షణ శిష్ట రక్షణ అనే పేరుతో రామ రాజ్యాన్ని స్థాపించడానికి సైన్యం కావాలని ,అందుకు ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో 27,800 గ్రామాల్లో ప్రతి టెంపుల్ నుంచి ఒక యువ సైనికుడు తమ ఆర్మీలో చేర్పించే బాధ్యత అర్చకులదేనని,తాను ఇక్ష్వాక వంశం శ్రీరాముడి వంశీయుడిని కాబట్టి ఇక్కడి దేవాలయ భూములు తమకు అప్పగించాలని, సైన్యం నిర్వహణ కోసం నిధులు ఇవ్వాలని బెదిరిస్తున్నాడని చెప్పారు.హిందూ ధర్మం కోసం చంపడానికైనా చావడానికైనా సిద్ధమని చెప్పడం అంటే ప్రజల ప్రాణాలతో చేలగాటమేనని చెప్పారు.విరుద్ధ భావాలు కలిగిన విపక్షం పాలకపక్షం వామపక్షాలు ఖండించడాన్ని ఆయన స్వాగతించారు .రామరాజ్య ఆర్మీ రాజ్యాంగేతర శక్తిగా అవతరిస్తుందన్నారు .హిందూ ధర్మం పేరిట యువకులు నిధులు,భూములు విశ్వాసాలు పేరుతో బహిరంగంగా దాడులు చేయటం ఒక సంస్కృతిగా మారిందన్నారు దీనిని మతసామరస్యం కోరే ప్రతీ ఒక్కరు ఖండించాలన్నారు వీరరాఘవరెడ్డి గతంలో ఒక జిల్లా కలెక్టర్ ను 43 సి ఆర్ పి సి ప్రకారంగా నేను అదుపులోకి తీసుకున్నానని సిఐతోనే ఫోన్ లో మాట్లాడిన పరిస్థితి ఉందన్నారు చట్టాన్ని తన చేతుల్లోకి తీసుకొని తమ అభిప్రాయాలను ఏకీభవించని వారిపైన భౌతిక దాడులు చేయడం వెనుక ఉన్న శక్తులను బయటపెట్టాలన్నారు.కేరళలో సిపిఎం నాయకత్వంలోని వామపక్ష ప్రభుత్వం దళితులను పూజారులుగా నియమించిందన్నారు. రంగరాజన్ పరస్త్రీ అనే దళితుడిని భుజాల ఎత్తుకొని ఊరేగింపు చేశారని ఆ తర్వాత అర్చకుడిగా మార్చారని దీనిని జీర్ణించుకోలేక మతోన్మాద శక్తులు ఆయన పై దాడులకు ఒడిగడుతున్నారని చెప్పారు త్రిశూల్ పేరుతో భావి యువతరానికి మారణాయుధాలు కత్తులు తుపాకులు ఇచ్చి దేశాన్ని మతోన్మాద హింస వైపు నడిపించడానికి మతోన్మాద శక్తులు చేస్తున్న కుట్రలను ప్రతిఘటించాలన్నారు. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయశంకర స్వామి మాట్లాడుతూ ఉన్మాదం తలకెక్కిన వీర రాఘవరెడ్డి లాంటి వ్యక్తులు రాష్ట్రంలో దేశంలో అనేక మంది ఉన్నారని అలాంటి వారిని పౌర సమాజం ఏరివేయాలని కోరారు.వీర రాఘవరెడ్డి స్థానంలో ఒక సెక్యులర్ వాది ఓ నాస్తికుడు మాట్లాడితే గతంలో ఎన్నో దాడులు దౌర్జన్యాలు చేశారో రాష్ట్రం కళ్లారా చూసిందన్నారు.రాష్ట్రంలో 128 కుల దురహంకార హత్యలు జరిగితే ఏ ఒక్క హత్య పైన స్పందించని ఆర్ఎస్ఎస్ బిజెపి విహెచ్పి హిందూ వాహిని బజరంగ్దళ్ సంస్థలు కేవలం నాగరాజు అనే హిందువుని ముస్లింలు మత దురహంకార హత్యకు పాల్పడితే ఆ ఒక్కదానిపైనే బండి సంజయ్ ,రాజాసింగ్ లు మునేళ్ల పై లేచి రోడ్లపై కొచ్చి పెద్ద ఎత్తున విద్వేషం రెచ్చగొట్టారు. మరీ మిగతా 127 మందివి ప్రాణాలు కాదా ?వాళ్ళ తరఫున ఎందుకు మాట్లాడలేదు? పైగా మిర్యాలగూడలో పెరుమాండ్ల ప్రణయ్ ని 1కోటి రూపాయలు సుఫారీ ఇచ్చి చంపించిన హంతకుడు మారుతిరావు కు మద్దతుగా భజరంగ్ దళ్ నల్గొండలోర్యాలీ చేసిందన్నారు ఒక హిందూ మరో హిందువుని చంపితే మాట్లాడని వారు ఒక హిందువులు ముస్లిం చంపితే మాత్రమే మాట్లాడుతారా? మత ఘర్షణలు పెంచడానికి ముందుకు వస్తారని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు.భిన్నత్వంలో ఏకత్వం కలిగిన భారత దేశంలో తమ అభిప్రాయాలతో ఏకీభవించని వారిపైన భౌతిక దాడులకు సిద్ధపడటం అంటే రాజ్యాంగాన్ని పౌరుల ప్రాథమిక హక్కుల్ని పాతాళంలోకి తొక్కడమేనన్నారు.టి పీఎస్ కె రాష్ట్ర నాయకులు జి రాములు ఎస్వీకే కార్యదర్శి ఎస్ వినాయకుమార్ లు మాట్లాడుతూ రామరాజ్యం జైశ్రీరామ్ ఇలాంటి పదాలు భౌతిక దాడులు దౌర్జన్యాలు అత్యాచారాలు చేయడానికి ఉపయోగిస్తున్న పదాలుగా ఉండటం శోచనీయమన్నారు హత్యలను దాడులను హిందూ ధర్మం అంగీకరిస్తుందా? వారి సిద్ధాంతీలు సెలవివ్వాలన్నారు ప్రముఖ జర్నలిస్ట్ గౌరీ లంకేష్ ను హత్య చేసిన తర్వాత హంతకులు జైశ్రీరామ్ అంటూ నినాదాలు చేస్తూ పరారయ్యారని చెప్పారు శ్రీరాముడు ఇండ్లపై పడి దౌర్జన్యం చేయమని భూములు లాక్కోమ్మని తనకు రాజ్యం కావాలని దానికి సైన్యం కావాలని సైన్యం ఏర్పాటు చేయండని కోరుకున్నాడా? ఆ సైన్యం కోసం డబ్బులు ఇవ్వమని ఇవ్వకపోతే చంపమని శ్రీరాముడు ఏమైనా ఆదేశించాడ అని ప్రశ్నించారు.అవాజ్ రాష్ట్ర కార్యదర్శి ఎం డి అబ్బాస్ తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ లు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న ఆర్ ఎస్ ఎస్ కనుసన్నల్లోని బీజేపీ అండదండలతోటి దేశంలో మతవిద్వేషాలు హింసాత్మక మతోన్మాద దాడులు పెట్రేగి పోతున్నాయని చెప్పారు .పొద్దున లేస్తే హిందూ మతం ప్రమాదం లో ఉందని చెబుతున్న వారు ఆ మతాన్ని విశ్వసిస్తున్న మెజార్టీ ప్రజలకు ఆ మతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయం చేస్తున్నారని చెప్పారు హిందూమతంలోని సాధారణ ప్రజలకు ముస్లింలతోనూ క్రైస్తవులతోనూ ఏమాత్రం ప్రమాదం లేదన్నారు ఎవరి మత విశ్వాసాలతో వాళ్లు జీవన విధానం సాగిస్తున్నారని హిందూ మతంలోని మత ఉన్మాదుల వల్లే హిందూ మతం ప్రమాదంలో ఉందన్నారు.కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్ బాబు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రంగరాజన్ పై జరిగిన దాడిని స్వయంగా సీఎం ఫోన్లో మాట్లాడి ఖండించినట్లుగానే రాష్ట్రంలో జరిగిన కుల దురహంకారుల హత్యలసందర్భంగా బాధితులకు అండగా నిలబడగలిగితే ప్రభుత్వం పట్ల పేదలకు ఒక మేరకు నమ్మకం కలుగుతుందన్నారు కానీ ఆ పాత్ర ప్రభుత్వం నిర్వహించటం లేదన్నారు దీంతో ప్రభుత్వ స్వభావం కూడా విదితమవుతుంది రంగరాజన్ పై భౌతిక దాడికి పాల్పడిన ఏ ఒక్కరిని వదిలిపెట్టకుండా జీవితాంతం జైలులో ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలి రాష్ట్రంలో మతోన్మాద ఘటనలు జరగకుండా రాష్ట్ర ప్రభుత్వం పౌర సమాజం అడ్డుకోవాలి ప్రతిఘటించాలి.ఈ రౌండ్ టేబుల్ సమావేశంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు జనవిజ్ఞాన వేదిక జాతీయ కార్యదర్శి కృష్ణాజీ ,డిబి ఎఫ్ జాతీయ కార్యదర్శి పి శంకర్ డిహెచ్పిఎస్ రాష్ట్ర కార్యదర్శి మారుపాక అనిల్ కుమార్ సిఐటియు రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ శ్రీరామ్ నాయక్ ఎన్పిఆర్డి రాష్ట్ర అధ్యక్షులు కే వెంకట్ డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకులు బుర్రి ప్రసాద్, బొప్పని పద్మ తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ చినుకు సంస్థ డైరెక్టర్ పి ఎన్ మూర్తి కెవిపిఎస్ నగర అధ్యక్ష కార్యదర్శులు ఎం దశరథ్ బి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా కెసిఆర్ జన్మదిన వేడుకలు



**చండూరు, ఫిబ్రవరి 17, తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర సాధకులు, రాష్ట్ర తొలి ముఖ్యమంత్రివర్యులు, బిఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు జన్మదిన వేడుకలు చండూరు లో ఘనంగా నిర్వహించారు. చండూరు బిఆర్ఎస్ పార్టీ పట్టణ అధ్యక్షులు కొత్తపాటి సతీష్ ఆధ్వర్యంలో చండూరు మున్సిపాలిటీ పరిధిలో గల చౌరస్తాలో కేక్ కట్ చేసి ఘనంగా వేడుకలు నిర్వహించారు, అనంతరం ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ చేశారు.కేసీఆర్ గారు ఆయురారోగ్యాలతో మరెన్నో ప్రజాసేవ కార్యక్రమాలు చేపట్టాలని కేసీఆర్ గారి నాయకత్వంలో తెలంగాణ అభివృద్ధి పథంలో ముందుకు సాగుతోందని, ప్రజలకు నూతన ఆశలు, ఆకాంక్షలు నెరవేరేలా ఆయన నిరంతరం కృషి చేస్తున్నారని మాజీ ఎంపీపీ తోకల వెంకన్న అభిప్రాయపడ్డారు.జలకళ నింపిన మిషన్ భగీరథ ద్వారా గతంలో ఫ్లోరైడ్ మాయదారి నుంచి చండూరు ప్రజల కష్టాలను కేసీఆర్ ప్రభుత్వం పూర్తిగా తొలగించింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన తాగునీరు అందజేయడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని ప్రజలకు అందించామన్నారు.ప్రజా సంక్షేమానికి మార్గదర్శకుడు కేసీఆర్ కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాక, సమాజ సేవకుడిగా ప్రజా సంక్షేమాన్ని తన ధ్యేయంగా తీసుకుని అనేక పథకాలను అమలు చేశారని ప్రసంగంలో స్పష్టం చేశారు. పింఛన్లు, కల్యాణ లక్ష్మి, రేషన్ కార్డు, రైతు బంధు వంటి పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచారన్నారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావానికి కేసీఆర్ గారి నేతృత్వమే ప్రధాన బలం. ఉద్యమ సమయాల్లో చూపిన తెగువ, త్యాగం, ప్రజల కోసం ఎప్పుడూ ముందుండే ధృఢతను ప్రశంసిస్తూ, కేసీఆర్ నాయకత్వం అభివృద్ధి, సమగ్ర సంక్షేమానికి మార్గదర్శిగా నిలిచిందని మాజీ ఎంపీపీ తోకల వెంకన్న అన్నారు.కేసీఆర్ మరిన్ని సంవత్సరాలు ప్రజా జీవితంలో కొనసాగి, ఇంకా గొప్ప సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజలకు అండగా ఉండాలని ఆకాంక్షించారు. ఆయన ఆశయాలు సాఫల్యం చెందాలని, రాష్ట్రం మరింత ముందుకు సాగాలని కోరుతూ జన్మదిన వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు కోడి వెంకన్న, గుంటి వెంకటేశం,బారాసా పట్టణ అధ్యక్షులు కొత్తపాటి సతీష్, అధికార ప్రతినిధి బొడ్డు సతీష్ గౌడ్, యువజన అధ్యక్షులు ఉజ్జిని అనిల్ రావు, మాజీ మండల పార్టీ అధ్యక్షులు పెద్దగోని వెంకన్న గౌడ్, నకరికంటి రామలిగం, మాదగోని వెంకటేశం, సువర్ణ, నాగరాజు,గురునాథం, రామన్న, రామకృష్ణ, నగేష్, సత్తయ్య, శ్రీనివాస్, నర్సిరెడ్డి, శంకర్, దశరథ, సైదులు, శివ, వెంకన్న, శ్రీను, శ్రవణ్, సుధాకర్ రెడ్డి, గిరి, శ్రీకాంత్, లోకేష్, నరేష్, కరుణాకర్ రెడ్డి,మాజీ సర్పంచులు, మాజీ ఎంపీటీసీలు, బారాసా ముఖ్య నాయకులు, కార్యకర్తలు, వివిధ అనుబంధ సంఘాల నాయకులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## సీఎంను విమర్శించే అర్హత రామకృష్ణకు లేదు.. బోయిన్పల్లి మార్కెట్ వైస్ చైర్మన్ డి బి దేవేందర్



**కంటోన్మెంట్ తెలంగాణ సేనా న్యూస్ 17 :** రాష్ట్ర ప్రభుత్వం కంటోన్మెంట్ బోర్డ్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయడం లేదని తరచూ అదే పనిగా కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యులు జె రామకృష్ణ రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి పై ఆరోపణలు చేయడం మానుకోవాలని బోయిన్పల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ డిబి దేవేందర్ అన్నారు సోమవారం పికెట్ లక్ష్మీ నగర్ లోని కాంగ్రెస్ పార్టీ క్యాంపు కార్యాలయంలో ఆయన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వము నుంచి టిపిటి చార్జినిధులు బకాయిలు కంటోన్మెంటు బోర్డు కు రాకపోవడంతో కోర్టును ఆశ్రయించి రాబట్టామని రామకృష్ణ తరచు అదేపనిగా చెప్పుకోవడం మానుకోవాలని సూచించారు. రక్షణ శాఖ నుంచి కంటోన్మెంట్ కు రావలసిన బకాయిలు రాబట్టే విషయంలో బిజెపి అధినాయకులు అశ్రద్ధ చూపుతున్నారని ఆయన ఆరోపించారు .రక్షణ శాఖ నుండి కంటోన్మెంట్ బోర్డు కు సర్వీస్ టాక్స్ ల కింద 700 కూడా కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని వాటిని రాబట్టే విషయంలో రక్షణ శాఖ ఉన్నత అధికారుల, రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తాము కోర్టును ఆశ్రయించి రాబట్టుకుంటామని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లో కంటోన్మెంట్ బోర్డ్ అభివృద్ధి పై కాంగ్రెస్ కృతనిచ్ఛేయంతో పని చేస్తుందని ఆయన తెలిపారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయం లో అనేక సంక్షేమ పథకాలు కంటోన్మెంట్ కు అందించిన ఘనత తమ పార్టీకి దక్కిందని ఆయన అన్నారు . మరొకసారి రాష్ట్ర ముఖ్యమంత్రి, స్థానిక ఎమ్మెల్యే శ్రీ గణేష్ పై లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేస్తే ఇక ఊరుకునేది లేదని అన్నారు . తన పదవిని కాపాడుకోవడం కోసం ఢిల్లీకి పది చెక్కర్లు కొడుతున్న నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణ ఓటు అభివృద్ధి విషయంలో పెద్ద తీసుకోవడంలో పూర్తిగా విఫలమ య్యాడని అన్నారు. ఈ కార్యక్రమంలో బోయిన్పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్ బాబు, డైరెక్టర్లు యాజాస్ సన ,అస్లాం సోఫీ, ఎన్ రాజేందర్ ఆకాష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎం కేసీఆర్ కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** ఏటూరునాగారం ఫిబ్రవరి 17 నేడు 71వ ఏడాదిలోకి అడుగుపెడుతున్న గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లో భాగంగా పార్టీ అధినేత ఉద్యమ నాయకులు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మ దినాన్ని పురస్కరించుకొని ములుగు జిల్లా పార్టీ అధ్యక్షులు శ్రీ,కాకులమర్రి లక్ష్మీనరసింహారావు, ములుగు నియోజకవర్గ ఇంచార్జి బడే నాగజ్యోతి ఆదేశాల మేరకు పార్టీ మండల, పట్టణ కమిటీల ఆధ్వర్యంలో కేసీఆర్?కు బిఆర్ఎస్ రాజకీయ నాయకులు, ప్రముఖులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఏటూరునాగారం మండల కేంద్రంలోని జడ్పీ హై స్కూల్ గ్రౌండ్ లో మండల కమిటీ అధ్యక్షుడు గడదాసు. సునీల్ కుమార్, పట్టణ కమిటీ అధ్యక్షుడు ఎండి.ఖాజాపాషా ఆధ్వర్యంలో చెట్లు నాటే కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. కాగా మరోవైపు, విదేశాలలోనూ కేసీఆర్ పుట్టినరోజు వేడు కలు ఘనంగా నిర్వహిస్తు న్నారు. ఆస్ట్రేలియాలోని సిడ్నీ, మెల్బోర్న్, అడిలైడ్, బ్రిస్బేన్, ఆస్ట్రేలియా కేసీఆర్ బర్త్డే వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు తుమ్మ మల్లారెడ్డి, రేడియో షాప్ రమేష్, దొడ్డ కృష్ణ, నూక ప్రభాకర్, జాడి బోజారావు, కాళ్ల రామకృష్ణ, గండే పెల్లి నర్సయ్య, పెంచికల లక్ష్మీనారాయణ, ఎస్.కె అరిప్ బూర వెంకన్న, మాదరి రాంబాబు, ఏం పెల్లి రాజు, దేపాక సాగర్, తిరుపతి లాలు హసేన్, చారి తదితరులు పాల్గొనడం జరిగింది ఈ వేడుకలు కేసీఆర్ ప్రజా సేవలు, ఆలోచనలను గమనించి, ఆయనకు ప్రేమను, గౌరవాన్ని తెలుపు తున్న అభిమానులు కార్యకర్తలు వేడుకలు జరుపుతున్నారు.

## ఎలక్ట్రిక్ ఆటోను విరాళంగా అందజేసిన బ్యాంక్ ఆఫ్ బరోడా







**తెలంగాణ సేన న్యూస్ :** గాంధీ ఆస్పత్రి లోని రోగి సహాయకుల విశ్రాంతి కేంద్రంలో ఉచిత భోజనం సమకూర్చ డానికి ఆహార సరఫరా కోసం జనహిత సేవా ట్రస్ట్ కు బ్యాంక్ ఆఫ్ బరోడా సీఎస్ఆర్ లో భాగంగా రూ.ఐదు లక్షల వ్యయంతో కొనుగోలు చేసిన మూడు చక్రాల ఎలక్ట్రిక్ ఆటో వ్యాన్ విరాళంగా అందజేశారు.బ్యాంక్ ఆఫ్ బరోడా జనరల్ మేనేజర్, జోనల్ హెడ్ రితేష్ కుమార్, హైదరాబాదు జోన్ డిజీఎం సుధాకర్, మెట్రో రీజియన్ డిజీఎం కే. ఆదిత్య లు సోమవారం జనహిత సేవా ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ లు నర్సింహా మూర్తి, పాలపర్తి రమేష్ లకు వ్యాన్ తాళాలను అందజేశారు. గాంధీ ఆస్పత్రి లో రోగి సహాయకులకు ఉచిత భోజనం సమకూర్చడానికి రూ.55 వేల చెక్కును అందజేశారు.

## యువ క్రాంతి బునియాధ్ ట్రైనింగ్ క్యాంప్లో పాల్గొన్న పొన్నం



**మహేశ్వరం,తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర యువ క్రాంతి బునియాధ్ ట్రైనింగ్ క్యాంప్ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర మినిస్టర్ పొన్నం ప్రభాకర్ గౌడ్ కి ఘన స్వాగతం పలికిన మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కిచెన్న లక్ష్మారెడ్డి, టీపీసీసీ సభ్యులు భాస్కర్ రెడ్డి, మహేశ్వరం మండలం కార్మిక శాఖ అధ్యాక్షులు నడికుడ శివ, బొక్క జంగారెడ్డి, మహేశ్వరం నియోజకవర్గం మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణ నాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సిహెచ్ యాదయ్య, రాజరాజేశ్వరి దేవాలయం చైర్మన్ అల్లే కుమార్, మంత్రి బాలరాజ్, ప్రశాంత్ రెడ్డి, లాజర్,కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నర్సింగాపూర్ పాఠశాలలో ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

విద్యార్థులు ఉపాధ్యాయుల శ్రమ విలువను గుర్తించాలి
ప్రధానోపాధ్యాయులు ఎండి సర్వర్ అహ్మద్



**ములుగు జిల్లా ప్రతినిధి : తెలంగాణ సేన న్యూస్ :** వెంకటాపూర్ మండలంలోని లక్ష్మీదేవి పేట స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోగల నర్సింగాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు ఎండి సర్వర్ ఆధ్వర్యంలో సోమవారం స్వయం పరిపాలన దినోత్సవం ఘనంగా జరిగింది. పాఠశాల విద్యార్థులే ఉపాధ్యాయులై ఒకరోజు పాఠశాల నిర్వహణను సమర్ధవంతంగా నిర్వహించడం అభినందనీయమన్నారు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సర్వర్ అహ్మద్ విద్యార్థులలో సృజనాత్మకత వెలికి తీయాలని సంకల్పంతో చిన్న విద్యార్థులను విద్యార్థులతో విద్య బోధన చేయడం జరిగింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమం లో ప్రధానోపాధ్యాయులు ఎండి సర్వర్ మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయుల బోధన శ్రమను గుర్తించాలని ఒకరోజు పాఠశాల నిర్వహణ చేసిన విద్యార్థులు అభినందనీయులని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి ఈ ఓ గా పొలం రిషి, ఎం ఈ ఓ గా సహజ్, కోట సంజన, అక్షిత, సాంబలక్ష్మి , పార్థివ్ , సర్వేష్ మని, రితిక , విద్యార్థులు, ఉపాధ్యాయులు ఎం సుమన్, అంగన్వాడి టీచర్ ఎర్రబెల్లి సరోజన తదితరులు పాల్గొన్నారు.

## టిపిఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షులుగా పాకాల వెంకన్న



**జనగామ, తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ ప్రజా ఫ్రంట్ జనగామ జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. టీపిఎఫ్ రాష్ట్ర కన్వీనర్ నాగ భూషణం సమక్షంలో ఈ కమిటీ ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా పాకాల వెంకన్న, ప్రధాన కార్యదర్శి కడమంచి యాకన్న, ఉపాధ్యక్షులుగా ఇల్లందు విజయ్, మేడ రంజిత, సహాయ కార్యదర్శులుగు వై శ్రీనివాసులు, ఎర్రపోతుల సాంబయ్య, కార్యవర్గ సభ్యులు గా ఇల్లందు అనిత, చెప్యాల భీమా, మల్లేష్, రమేష్ లను ఎన్నుకున్నారు.ఈ నూతన జిల్లా అధ్యక్షులు పాకాల వెంకన్న మాట్లాడుతూ.. ప్రజా ఫ్రంట్ బలోపేతానికి కృషి చేస్తూ ప్రజల పక్షం ఉంటూ వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమిస్తామని తెలిపారు.

## బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు జన్మదిన వేడుకలు



**తెలంగాణ సేన న్యూస్ :** రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ , తెలంగాణ భవన్ లో భారీ కేక్ నీ కేటీఆర్, హరీష్ రావ్ కట్ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ కార్యకర్తలు పాల్గొని, కేసిఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. అలాగే పలుచోట్ల అన్నదానం కార్యక్రమాలు, నిర్వహించడం తో పాటు రక్త దాన శిబిరాలు ఏర్పాటు చేసి , కేసీఆర్ పుట్టిన రోజు శుభ్హాంక్షలు తెలిపారు. ఈ పుట్టిన రోజు వేడుకను పురస్కారించుకొని పీపుల్ మీడియా పాయింట్ న్యూస్ చానల్ లో కేక్ కట్ చేసి , మీడియా తరపున కెసిఆర్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఛానల్, సిఇఓ పట్నల రాంబాబు, వీడియో జర్నలిస్ట్ వజనల అశోక్ ,ఎడిటర్ బలాగని వినయ,యాంకర్ పద్మ,వాణీ, తాళ్లపెల్లి శేఖర్ సీనియర్ జర్నలిస్ట్ ఖమ్మం బాబు, పాల్గొన్నారు.


## వడపర్తి గ్రామంలో మల్లన్న పండగ వేడుకలు



**భువనగిరి, తెలంగాణ సేన న్యూస్ :** భువనగిరి మండలంలోని వడపర్తి గ్రామంలో మల్లన్న ఎల్లమ్మ జాతర పండుగకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన భువనగిరి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాజీ సర్పంచ్ ఎలిమినేట్ కృష్ణారెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి శాలువాతో సన్మానించారు.వడపర్తి గ్రామంలో మల్లన్న జాతరలో అన్నదాత బరిగే బిక్షపతి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అంగరంగ వైభవంగా మల్లన్న జాతరలో పూజలు చేసి శివసత్తులుతో ఊగుతూ ఒగ్గోలు డప్పుసప్పులతో నాట్యం చేసుకుంటూ అగ్నిగుండం నడుచుకుంటూ దేవాలయం చుట్టూ ప్రదక్షణలు చేసి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఉడుత ధనకోటి, సంకూరి శ్రీకాంత్, బండి వెంకటేష్, మేడబోయిన వెంకటేష్, రాజు, ఉడుత జంగయ్య, ఐలయ్య మేడబోయినబాలయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## గుంజేడు ముసలమ్మ సన్నిధిలో మాజీ సీఎం కేసీఆర్ జన్మదిన వేడుకలు

ఘనంగా నిర్వహించిన టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు



**కొత్తగూడ తెలంగాణ సేన :** తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావు వారి జన్మదిన వేడుకలను మహబూబాద్ జిల్లా కొత్తగూడ మండలం గుంజేడు లోని ముసలమ్మ దేవాలయంలో కొత్తగూడ మండల కార్యకర్తలు ప్రత్యేకంగా పూజలు నిర్వహించి కేక్ కట్ చేసి తెలంగాణ ఉద్యమకారులు తెలంగాణ రాష్ట్ర తొలి మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర రావుకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం వారి ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారు వారి సంక్షేమ పథకాలు ప్రజల మదిలో చెదరని ముద్రల ఉండిపోతాయని అమ్మవారి అనుగ్రహంతో వారి ఆశీస్సులతో నిండు నూరేళ్లు వారు ఆరోగ్యంగా సుభిక్షంగా ఉండాలని టిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు వేణు. అధికార ప్రతినిధి నెహ్రూ రామన్నగూడెం మాజీ సర్పంచ్ సుగుణ కిషన్. గంగ ఎద్దుల సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్. జిమ్మిడి శ్రీనివాస్ కాసర్ల సాంబయ్య శిరబోయిన శ్రీను. పాల్గొన్నారు.


## ఘనంగా మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ జన్మదిన వేడుకలు



**తెలంగాణ సేన న్యూస్ :** తెలంగాణ సాధకులు బంగారు తెలంగాణ నిర్మాత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావ్ జన్మదిన సందర్భంగా మిడ్జిల్ మండలం కేంద్రం బస్టాండ్ లో కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించడం జరిగింది మండలంలోని వివిధ గ్రామాల పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు భారీగా తరలివచ్చారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సుధా బాల్ రెడ్డి, మాజీ ఎంపీపీ సుదర్శన్ సర్పంచుల సంగం మాజీ అధ్యక్షులు జంగారెడ్డి,రైతు సమన్వయ సమితి మాజీ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, మాజీ సర్పంచ్ లు సంయుక్త జైపాల్ రెడ్డి, రాధికా వెంకట్ రెడ్డి, నారాయణ్ రెడ్డి,రాధికా ప్రతాప్ రెడ్డి, మంజుల భాస్కర్, మంగమ్మ శ్రీనివాస్ లు,యూత్ వింగ్ అధ్యక్షులు బంగారు,మండల నాయకులు సుకుమార్, నవీన్ చారి,వెంకటయ్య,కరుణాకర్ రెడ్డి, ఆచారి,జగన్ గౌడ్ రాఘవేందర్ ,భాస్కర్ చారి, మాజీ వార్డు సభ్యులు గోపాల్ ముదిరాజ్, చంద్రశేఖర్ ,రవీంద్ర, సురేష్ కుమార్ రవీందర్,శ్రీశైలం,మోహన్ యాదవ్ నర్సింహా,వరుణ్, జగన్ గౌడ్, లక్ష్మణ్. పవర్ జైపాల్ రెడ్డి, మధు, జగన్ గౌడ్,తిరుపతి నాయక్ భాస్కర్,నరేష్ గౌడ్,శ్రీనివాస్ చారి, భాస్కర్ చారి,మహేష్, మల్లేష్,రాము వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పికెట్ చౌరస్తాలో ఘనంగా రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు


కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఏఎల్ ఆనంద్ బీఆర్ఎస్ నాయకులు




**కంటోన్మెంట్ తెలంగాణ సేన న్యూస్ 17 :** తెలంగాణ రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎ ఎల్ ఆనంద్ ఆధ్వర్యంలో సోమవారం పికెట్ చౌరస్తాలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకుడు ఆనంద్ నాయకులు కార్యకర్తలతో కలిసి కేక్ కట్ చేసి అందరికీ పంచి పెట్టారు. అనంతరం ఏఎల్ ఆనంద్ మాట్లాడుతూ... పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కోసం సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేశారని అన్నారు. రేవంత్ రెడ్డి పాలనలో ప్రజలందరూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ముఖ్యంగా రైతులు, నగర ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంలో చాలా సమస్యలు ఎదుర్కొంటున్నారని వెల్లడించారు. రానున్న రోజుల్లో తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని, మళ్లీ ముఖ్యమంత్రిగా కేసీఆర్ పదవి బాధ్యతలు చేపట్టడం వంద శాతం నిజమన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు గంగారాం, పెంట శ్రీహరి,సానాది శ్రీనివాస్,శత్రువు,శంకర్,సాయి, మోహన్, కుమార్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.


## కంటోన్మెంట్ అభివృద్దే మా ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్యే శ్రీ గణేష్, బోర్డు సభ్యుడు జే. రామకృష్ణలు
టెంపుల్ రాక్ ఎన్ క్లేవ్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన
చేసిన ఎమ్మెల్యే, బోర్డు నామినేటెడ్ సభ్యుడు



**కంటోన్మెంట్ ,తెలంగాణ సేన న్యూస్ 17 :** కంటోన్మెంట్ నియోజకవర్గం ఆరవ వార్డ్ పరిధి లోని టెంపుల్ రాక్ ఎన్ క్లేవ్ కాలనీలో 37.6 లక్షల రూపాయలతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పైప్ లైన్ పనులకు ఎమ్మెల్యే శ్రీగణేష్ గారితో కలిసి కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు జే. రామకృష్ణతో కలిసి భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ మాట్లాడుతూ... ఎన్నికల సమయంలో పార్టీ పరంగా ఆరోపణలు చేసుకున్నప్పటికి ప్రజలు అధికారం ఇచ్చినప్పుడు పార్టీలకు అతీతంగా నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తామని అన్నారు. కంటోన్మెంట్ అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని తెలిపారు. అనంతరం బోర్డ్ నామినేటెడ్ సభ్యుడు జే రామకృష్ణ మాట్లాడుతూ కంటోన్మెంట్ లో నెలకొన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ ముందుకు వెళుతున్నామని, ప్రతీ వార్డు లో రోజు ఏదో ఒక అభివృద్ధి పని జరుగుతుందని చెప్పారు.కంటోన్మెంట్ నియోజక వర్గ అభివృద్ధి కోసం నిధులు తీసుకు రావడం కోసం నిరంతరం పోరాడుతున్నామని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి వేణుగోపాల చారి, కాలనీ ప్రెసిడెంట్ మురుగేషన్, మాజీ కంటోన్మెంట్ బోర్డ్ సభ్యులు, బిజెపి నాయకులు,కాంగ్రెస్ నాయకులు మరియు స్థానికులు పాల్గొన్నారు.

# ఆడవాళ్లలోనే ఆ ముప్పు



పురుషులతో పోలిస్తే మహిళల్లో గుండెపోటు వచ్చే అవకాశం ఎక్కువని అనేక అధ్యయనాలు తేల్చాయి. అమెరికన్ హార్ట్ అసోసియేషన్‌తోపాటు యురోపియన్ సొసైటీ ఆఫ్ కార్డియాలజీ సంస్థ కూడా.. ఈ విషయాన్ని బలపరుస్తున్నాయి. ఆధునిక జీవనశైలి, చెడు ఆహారపు అలవాట్ల కారణంగా.. మహిళల్లో ఈ హృద్రోగ కేసులు పెరుగుతున్నాయి. వయసు పైబడటం, హార్మోన్ల ప్రభావం అతివల గుండెను బలహీనపరుస్తున్నాయి. అధిక రక్తపోటు, డయాబెటిస్ లాంటి దీర్ఘకాలిక రుగ్మతలు.. మహిళల్లో గుండెపోటు ప్రమాదాన్ని పెంచుతున్నదట. రక్తంలో చక్కెర స్థాయులు పెరగడం వల్ల రక్త నాళాలు దెబ్బతింటాయి. ఫలితంగా రక్త సరఫరాలో ఆటంకం ఏర్పడి స్ట్రోక్ వచ్చే అవకాశం పెరుగుతుంది. 55 ఏళ్లు దాటినవాళ్లలో గుండెజబ్బుల ముప్పు ఎక్కువగా ఉంటున్నదట. మెనోపాజ్ సమయంలో వచ్చే హార్మోన్ మార్పుల వల్ల.. రక్తంలో చక్కెర స్థాయులు పెరుగుతాయి. ఈస్ట్రోజన్ హార్మోన్ లెవెల్స్ తగ్గడం కూడా.. రక్తనాళాల్లో వాపు, అధిక రక్తపోటుకు కారణం అవుతుంది. ఇక.. పురుషులతో పోలిస్తే మహిళల రక్త ధమనులు ఇరుకుగా ఉంటాయట. ఫలితంగా వారిలో బీపీ పెరిగి.. గుండెపోటుకు దారి తీస్తుంది. వీటితోపాటు ఊబకాయం, మానసిక ఒత్తిడి, నిరాశ వంటివి కూడా ఆడవాళ్లలో హార్ట్ ఎటాక్స్ రావడానికి కారణం అవుతున్నాయి. అలాగే బ్రోకెన్ హార్ట్ సింట్రోమ్, గర్భధారణ సమస్యలు లాంటి పరిస్థితులు కూడా.. గుండె జబ్బుల ప్రమాదానికి దోహదం చేస్తున్నాయి.

**లక్షణాలు వేరుగా..**

పురుషులతో పోలిస్తే.. మహిళల్లో గుండెపోటు లక్షణాలు వేరుగా ఉంటున్నాయని హృద్రోగ నిపుణులు అంటున్నారు. సాధారణంగా ఛాతీలో నొప్పి, శ్వాస ఆడకపోవడం, వికారం, తల తిరగడం, చలి చెమటలు పట్టడం.. కామన్‌గా కనిపించే లక్షణాలు. వీటితోపాటు ఆడవాళ్లలో మెడ, దవడ, గొంతు, కడుపుతోపాటు వీపుసహా వివిధ భాగాల్లో నొప్పిలాంటి లక్షణాలు ఉంటున్నాయట. వాంతులు, వికారం వంటివీ కనిపిస్తున్నాయట. అందుకే, ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు.

# అధిక బరువును తగ్గించే సూపర్ ఫుడ్స్ ఇవి తప్పక తినండి




అధిక బరువును తగ్గించుకునేందుకు చాలా మంది అనేక రకాలుగా ప్రయత్నిస్తుంటారు. కానీ బరువు తగ్గలేకపోతుంటారు. బరువు తగ్గడం కోసం డైట్ పాటించడం, యోగా లేదా వ్యాయామం చేయడం వంటివి చేస్తుంటారు. అయితే కొందరు ఎంత చేసినా బరువు తగ్గడం లేదని వాపోతుంటారు. కానీ అలాంటి వారు ఇప్పుడు చెప్పబోయే పలు ఆహారాలను తరచూ తింటుంటే దాంతో బరువు తగ్గడం తేలికవుతుంది. ఈ ఆహారాలు మీ శరీర మెటబాలిజంను పెంచుతాయి. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చవుతాయి. ఫలితంగా శరీరంలో ఉండే కొవ్వు కరుగుతుంది. ఇక అధిక బరువును తగ్గించే ఆ ఆహారాలు ఏమిటో ఇప్పుడు తెలుసుకుందాం. రాత్రి పూట నీటిలో ఖర్జూరాలను నానబెట్టాలి. గుప్పెడు మోతాదులో తీసుకుని నానబెట్టి మరుసటి రోజు ఉదయం బ్రేక్‌ఫాస్ట్‌లో తినాలి. ఇలా ఖర్జూరాలను ఉదయమే తింటుంటే శక్తి లభించడమే కాదు మెటబాలిజం కూడా పెరుగుతుంది. దీంతో క్యాలరీలు వేగంగా ఖర్చయి బరువు తగ్గుతారు. ఉదయం ఖర్జూరాలను తినడం వల్ల బరువు తగ్గవచ్చు. అధిక బరువు తగ్గాలనుకునే వారికి ఖర్జూరాలు ఎంతో మేలు చేస్తాయి. అలాగే ఇవి శరీరంలో వేడిని పెంచుతాయి కనుక చలికాలం తింటే శరీరాన్ని వెచ్చగా ఉంచుకోవచ్చు. అధిక బరువును తగ్గించడంలో బాదంపప్పు, వాల్ నట్స్ కూడా ఎంతో మేలు చేస్తాయి. బాదంపప్పు, వాల్ నట్స్‌లో ఒమెగా 3 ఫ్యాటీ యాసిడ్లు ఉంటాయి. ఇవి అనేక రకాలుగా మనకు ఉపయోగపడుతాయి. శరీర మెటబాలిజంను పెంచి అధిక బరువును తగ్గిస్తాయి. కంటి చూపును మెరుగు పరుస్తాయి. కనుక బాదం పప్పు లేదా వాల్ నట్స్‌ను గుప్పెడు మోతాదులో తీసుకుని రాత్రి పూట నానబెట్టి మరుసటి రోజు ఉదయం తినాలి. ఇలా రోజూ తింటుంటే ఎంతగానో ప్రయోజనం ఉంటుంది. ఈ సీజన్‌లో మనకు చిలగడదుంపలు కూడా అధికంగానే లభిస్తాయి. ఇతర దుంపలకు ఇది పూర్తిగా భిన్నమైందని చెప్పవచ్చు. ఇతర దుంపలు బరువును పెంచుతాయి. కానీ చిలగడదుంపలు బరువును తగ్గిస్తాయి. ఎందుకంటే ఈ దుంపల్లో ఫైబర్ సమృద్ధిగా ఉంటుంది. ఇది బరువును తగ్గించడంలో సహాయం చేస్తుంది. అలాగే అటుకులతో చేసిన ఆహారం తింటున్నా కూడా బరువు తగ్గవచ్చు. ఇవి తేలిగ్గా జీర్ణమవుతాయి. వీటిల్లో ఉండే ఫైబర్ బరువును తగ్గించేందుకు సహాయం చేస్తుంది. నిమ్మజాతికి చెందిన పండ్లను తినడం వల్ల కూడా అధిక బరువును తగ్గించుకోవచ్చు. ఇలా పలు రకాల ఆహారాలను ఈ సీజన్‌లో తీసుకుంటే బరువును తగ్గించుకోవడం ఎంత మాత్రం కష్టం కాదు. చాలా సులభంగానే కొవ్వును కరిగించుకోవచ్చు.

# విద్యార్థుల మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు ఓ పెట్టుబడిః రేవంత్ రెడ్డి





తెలంగాణ వ్యాప్తంగా ప్రభుత్వ స్కూళ్లతోపాటు సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో కామన్ డైట్ మెనూ ప్రారంభించారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి. రంగారెడ్డి జిల్లా చిలుకూరులో స్కూళ్లు, హాస్టల్స్‌లో కామన్ డైట్ ప్రారంభించిన తెలంగాణ సీఎం కీలక వ్యాఖ్యలు చేశారు. గురుకులాల్లో విద్యార్థులకు సరికొత్త డైట్ ప్లాన్ అమలు చేస్తున్నట్లు సీఎం రేవంత్ ప్రకటించారు. ఇప్పటివరకు ప్రైవేట్ స్కూల్స్‌లో చదివితేనే విద్యార్థులు రాణిస్తారనే అపోహ ఉండేదని, సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థుల్లో విశ్వాసం పెంచేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మాజీ ప్రధాని పీవీ నరసింహారావు తొలిసారి సర్వేల్‌లో సంక్షేమ పాఠశాలను ప్రారంభించారని సీఎం గుర్తు చేశారు. సర్వేల్‌లో చదివిన అనేక మంది కీలక పదవులు నిర్వహిస్తున్నారు. గత ప్రభుత్వం 8 ఏళ్లుగా డైట్ ఛార్జీలు పెంచలేదన్న సీఎం రేవంత్, డైట్ ఛార్జీలు పెంచి విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందిస్తున్నామన్నారు. కాస్మోటిక్ ఛార్జీలు కూడా పెంచి విద్యార్థులకు అండగా ఉన్నామని భరోసా ఇచ్చారు. ఎక్కువ ఫీజులు ఉన్న ప్రైవేట్ స్కూల్స్‌లో ఎక్కువ మంది చదువుతున్నారు. ఇలా ఎందుకు జరుగుతుందో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆలోచించాలి. విద్యార్థుల మీద ప్రభుత్వం పెట్టేది ఖర్చు కాదు.. ఓ పెట్టుబడి అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలోనే సంక్షేమ హాస్టల్స్‌పై ఫోకస్ పెట్టింది తెలంగాణ ప్రభుత్వం. తనిఖీల పేరుతో ఇవాళ హాస్టల్స్ బాటపట్టింది. ముఖ్యమంత్రి, మంత్రులతోపాటు ప్రభుత్వ యంత్రాంగం అంతా హాస్టల్స్, గురుకులాల్లో తనిఖీలు చేపట్టారు. విద్యార్థులతో మాట్లాడి.. వాళ్లతో కలిసి భోజనాలు చేశారు. రంగారెడ్డి జిల్లా చిల్కూర్‌లో సోషల్? వెల్ఫేర్ ?రెసిడెన్షియల్ ?స్కూల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి పరిశీలించారు. అక్కడి నుంచే రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ హాస్టళ్లు, గురుకులాల్లో కామన్ డైట్ ప్లాన్ ప్రారంభించారు. అనంతరం, విద్యార్థులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. ఇక నుంచి ప్రతినెల 10న గురుకులాలు,హాస్టల్స్ బకాయిల చెల్లింపు జరుపుతామని ముఖ్యమంత్రి ప్రకటించారు. గ్రీన్‌ఛానల్ ద్వారా నేరుగా అకౌంట్లలో జమ చేస్తామన్నారు. ఇకపై ప్రతినెలా కలెక్టర్లు, ఎమ్మెల్యేలు, మంత్రులు గురుకులాలు, హాస్టల్స్‌ను విధిగా పరిశీలిస్తారని సీఎం స్పష్టం చేశారు. గురుకులాలు, సంక్షేమ హాస్టల్స్‌కు ఉచిత విద్యుత్ అందించాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి తెలిపారు. అలాగే, విద్యార్థుల్లో స్కిల్స్ కోసం టాటాగ్రూప్‌తో ఒప్పందం కుదుర్చుకున్నామని, ఇందులో భాగంగానే 75 ఐటీఐలను ఏటీసీలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని సీఎం ప్రకటించారు. ఐటీఐలో చేరితే ఉద్యోగం వస్తుందనే నమ్మకం కల్పిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అటు ఉమ్మడి ఖమ్మం జిల్లా బోనకల్‌లో బీసీ గురుకుల పాఠశాలను సందర్శించారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. విద్యార్థులతో మాట్లాడి సమస్యల్ని అడిగి తెలుసుకున్నారు. నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లోని గిరిజన వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాలలో పిల్లలతో కలిసి భోజనం చేశారు మంత్రి సీతక్క. అనంతరం, మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. భోజనాల్లో క్వాలిటీ తగ్గితే సహించేది లేదని.. నిర్లక్ష్యంగా వ్యవహరించే ఉద్యోగులను సర్వీస్ నుంచి తొలగిస్తామని హెచ్చరించారు.

# నమ్మిన ప్రజలను నట్టేట ముంచి పండుగలా!



ఓ ఊరిలో పాముకాటుతో ఒకాయన చనిపోయాడట. కొందరు సావు కాడికిపోయి.. 'పాము ఏడ కరిచింది? కన్ను కింద కరిచిందా.. ఇంకా నయం కన్ను మీద కరవలేదు. కన్నుపోతుండె' అని వారు అన్నరట. మనిషే సచ్చిపోయిండు. ఇక పాము ఏడ కరిస్తే ఏంది? ఆడ కరిస్తే కన్ను పోతుండె.. ఈడ కరిస్తే కాలుపోతుండె అనడంలో అర్థం ఉందా? కేసీఆర్ అప్పట్లో చెప్పే ఈ కథ లెక్కనే ఉన్నది కాంగ్రెస్ పాలకుల పనితీరు. ఇంకా చెప్పాలంటే సంపినోడే సావుకాడికి పోయి సావు డప్పు కొట్టినట్టు ఉంది. మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటినుంచీ పాలమూరును నిర్లక్ష్యం చేసిందే కాంగ్రెస్ పార్టీ. పక్కనే కృష్ణా నది ప్రవహిస్తున్నా సాగు నీళ్లు అందించలేని అసమర్థత కాంగ్రెస్ పాలకులది. ఉమ్మడి ఏపీని 40 ఏండ్లకు పైగా పాలించిన కాంగ్రెస్ పార్టీ.. ప్రాజెక్టులు నిర్మించి పాలమూరుకు నీళ్లివ్వలేకపోయింది. ఏటికేడు ప్రాజెక్టుల నిర్మాణాన్ని సాగదీసే చరిత్ర ఉన్న హస్తం పాలకులు నేడు పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు నిర్మాణంలో మిగిలిన 10 శాతం పనులను కూడా పూర్తి చేయలేకపోతున్నారు. నాటి కాంగ్రెస్ పాలకుల చేతకాని పాలనే పాలమూరుకు వలసల జిల్లా అనే పేరు తెచ్చిపెట్టింది. నేటి పాలకులు కూడా అదే బాటలో నడుస్తున్నారు. అంతేకాదు, 'పాలమూరు మాదిగలు డప్పులు కొట్టాలె.. మనది మాదిగల జిల్లా' అంటూ ముఖ్యమంత్రి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీస్తున్నారు. ఇదిలా ఉంటే.. ఎన్ని జన్మలెత్తినా కాంగ్రెస్ పార్టీ పాలమూరుకు చేసిన అన్యాయానికి ప్రాయశ్చిత్తం లభించదు. సకలజనుల వనరులను సర్వనాశనం చేసి, జలహారతులిచ్చి 'మా నీళ్లు తీసుకుపోండి' అని నీళ్ల దోపిడీకి సహకరించిన పార్టీ మళ్లీ అందలమెక్కడం మన ఖర్మ. నాటి పరాయి పాలనలో జరిగిన విధ్వంసాన్ని రూపుమాపి, జల వనరులు సృష్టించిన మనీషి కేసీఆర్. సాగు, తాగునీరు అందించడమే కాకుండా రైతుబంధు ఇచ్చి రైతన్నల మోములో చిరునవ్వులు పూయించింది కేసీఆర్ సర్కార్. కేసీఆర్ హయాంలో పాలమూరు జిల్లా వ్యాప్తంగా ప్రతీ గ్రామంలో గ్రామ దేవతలను కొలుస్తూ దాదాపు 40 ఏండ్ల తర్వాత పెద్దావర పండుగను రైతాంగం ఘనంగా జరుపుకొన్నది. ఆ సంబరాలు ఎంతో కాలం ఉండవంటూ మార్పు అనే పేరుతో వచ్చిన కాంగ్రెస్ సకల విధ్వంసాలు సృష్టిస్తున్నది. ఆనాటి రోజులు తెస్తామని చెప్పినట్టే నాటి నిర్లక్ష్యపు పాలన మళ్లీ తీసుకొచ్చింది నయవంచక కాంగ్రెస్. తాను పాలమూరు బిడ్డనని, పాలమూరు- రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా తెస్తానని చెప్పి ఉన్న ప్రాజెక్టును పడావు పెట్టిన్రు. అంతేకాదు, నారాయణపేట- కొడంగల్ ప్రాజెక్టు పేరుతో సగం పాలమూరును మళ్లీ ఎడారి చేసే ప్రయత్నం చేస్తున్నారు. రైతాంగాన్ని సకల విధాలుగా ధ్వంసం చేసి రైతు పండుగలంటూ హడావుడి చేస్తున్నారు. అసలెందుకు రైతు పండుగలు జరుపుతున్నట్టు? పచ్చబడ్డ పాలమూరును ఎండబెట్టినందుకా? జాతీయ హోదా తీసుకొస్తానని చెప్పి ప్రాజెక్టును పడావు పెట్టినందుకా? రైతు భరోసా ఇస్తనని చెప్పి కనీసం రైతుబంధు ఇవ్వలేకపోతున్నందుకా? బోనస్‌ను బోగస్ చేసినందుకా? పాలమూరు బిడ్డకు ఒకింత ప్రేమ ఎక్కువ ఉంటదని నమ్మిన ప్రజలను నట్టేట ముంచినందుకా? పండుగలను దండుగ చేసి ప్రచార ఆర్భాటాల కోసం పండుగలు చేస్తే నమ్మే పరిస్థితిలో ప్రజలు లేరు. పుట్టిన గడ్డకు సేవ చేసే అవకాశం కోసం చాలామంది ఎదురుచూస్తుంటారు. కానీ, పాలమూరు బిడ్డ మాత్రం వచ్చిన అవకాశాన్ని కృష్ణానది పాల్జేశారు. ఈ ఏడాదికాలంలో పాలమూరుకు ఒరిగిందేమిటి? ఇప్పటికైనా ప్రచార ఆర్భాటాలు మానుకొని, పాలనపై దృష్టిపెడితే కనీసం పాలమూరు ఆత్మగౌరవాన్ని నిలబెట్టినవారు అవుతారు.

# నచ్చినోళ్లపైనే దోమల దాడి



రాజమౌళి సినిమాలో.. విలన్‌ను టార్గెట్ చేసిన 'ఈగ'ను తెగ ఎంజాయ్ చేశాం! ఆ 'ఈగ'కు మేమేం తక్కువ కాదంటున్నాయి దోమలు. నలుగురిలో ఒకరిని టార్గెట్ చేయడం వాటికి సరదా! రక్తం రుచి నచ్చితే.. ఎంత అదరగొట్టినా అవి బెదరవు. మన శరీరం నుంచి వెలువడే వాసనలు దోమలకు స్వాగత గీతికలు అవుతాయి. అపరిశుభ్రతే వాటికి మన శరీరంపై దాడిచేసేలా ప్రోత్సహిస్తాయి. అందుకే, ఒకేచోట నలుగురు ఉన్నా.. దోమలు అందరినీ ఒకేలా కుట్టవు. ఒకరిద్దరిపైనే తెగ దాడి చేస్తుంటాయి.

**వాసనలు పసిగట్టి..**

ఒక్కొక్కరి నుంచి వచ్చే చెమటను బట్టి వారి చర్మం వాసన ఒక్కోరకంగా ఉంటుంది. వీటిని బట్టికూడా దోమలు ఆకర్షితమవుతాయి. శరీరం ఎక్కువగా చెమట పడితే.. చర్మంపై ఉండే బ్యాక్టీరియా యాక్టివేట్ అవుతుంది. అది కార్బాక్సిలిక్ యాసిడ్‌ను విడుదల చేస్తుంది. ఈ యాసిడ్ దోమలను ఎక్కువగా ఆకర్షిస్తుందని పలు అధ్యయనాల్లో తేలింది. కాబట్టి, వ్యాయామం, శారీరక శ్రమ ఎక్కువగా చేసిన తర్వాత స్నానం చేయడం అవసరం. దీనివల్ల శరీరం శుభ్రపడి, చెమట వాసన తగ్గి.. దోమలు దరిచేరే అవకాశాలు తగ్గుతాయి.

**బ్లడ్ గ్రూప్‌ను బట్టి..**

వాటికి నచ్చిన బ్లడ్‌గ్రూప్ ఉన్నవారినే దోమలు ఎక్కువగా కుడతాయని అమెరికన్ జర్నల్ ఆఫ్ ఎంటమాలజీ నిర్వహించిన ఓ అధ్యయనం తేల్చింది. ఓ పాజిటివ్, ఓ నెగటివ్ బ్లడ్‌గ్రూప్ వ్యక్తులనే దోమలు ఎక్కువగా కుడతాయట. ఆ తర్వాతి స్థానం.. ఏ బ్లడ్ గ్రూప్ వ్యక్తులది. ఈ మూడు బ్లడ్ గ్రూప్‌లు ఉన్నవారితో పోలిస్తే.. మిగతా వారికి దోమల బెడద కాస్త తక్కువగానే ఉంటుందట. అందుకే.. ఓ, ఏ బ్లడ్ గ్రూప్ ఉన్నవారు దోమల నుంచి తప్పించుకోవడానికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలి. 'చలి'తోపాటే దోమలూ విజృంభిస్తాయి. చర్మాన్ని సూదుల్లా గుచ్చి.. రక్తాన్ని పీల్చేస్తుంటాయి. లేనిపోని అనారోగ్యాలకు గురిచేస్తుంటాయి. దోమల్లో 3,500 కన్నా ఎక్కువ జాతులున్నా.. కేవలం ఆడ దోమలు మాత్రమే మనిషిని కుడతాయి. ఎందుకంటే.. ఆడ దోమల్లో గుడ్లు ఎదగాలంటే.. ప్రోటీన్లు అవసరం అవుతాయి. అవి మనిషి రక్తం నుంచే లభిస్తాయి. ఇక్కడ గమనించాల్సిన విషయం ఏమిటంటే.. దోమలు కొందరినే టార్గెట్ చేసి వారినే ఎక్కువగా కుడుతుంటాయి. ఇందుకు ప్రత్యేక కారణాలు ఉన్నాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

**కాక్‌టెయిల్ రుచి మరిగి..**

మనిషి మనిషికీ శరీరతత్వంలో కొన్నిమార్పులు కనిపిస్తాయి. శరీరం నుంచి వెలువడే వాసనలు, ఉష్ణోగ్రతలు వేర్వేరుగా ఉంటాయి. వీటితోపాటు వాళ్లు వేసుకునే దుస్తుల రంగులను బట్టికూడా దోమలు మనుషులను టార్గెట్‌గా చేసుకుంటాయని సెయింట్ లూయిస్ (అమెరికా)లోని ట్రైసన్ రీసెర్చ్ సెంటర్ పరిశోధకులు చెబుతున్నారు. కొన్నిజాతుల దోమలు ఈ విషయంలో ఆచితూచి వ్యవహరిస్తాయట! వాటి ప్రవర్తన కూడా చాలా వింతగా ఉంటుందని పరిశోధకులు తేల్చారు. మనిషి చర్మం.. కొన్ని రసాయనాలతో కూడిన ప్రత్యేకమైన కాక్‌టెయిల్‌ను వాయు రూపంలో అతి స్వల్పంగా బయటికి విడుదల చేస్తుందట. ఈ కాక్‌టెయిల్ వాసన భిన్నంగా ఉన్నవారి వైపు దోమలు ఎక్కువగా ఆకర్షితం అవుతుంటాయట.

**కార్బన్ డయాక్సైడ్‌తో జాడ..**

మనిషి శ్వాస ద్వారా బయటికి వదిలే కార్బన్ డయాక్సైడ్ కణాలు.. దోమలను ఎక్కువగా ఆకర్షిస్తాయి. వీటిద్వారా 30 అడుగుల దూరం నుంచే.. దోమలు మనిషి జాడను గుర్తిస్తాయి. అంతేకాదు.. కార్బన్ డయాక్సైడ్ విడుదలయ్యే రేటును బట్టికూడా ఆకర్షణ ఆధారపడి ఉంటుందట. గర్భిణులు, వ్యాయామాలు ఎక్కువగా చేసేవారు, జీవక్రియ రేట్లు అధికంగా ఉండేవారి నుంచి ఎక్కువ మొత్తంలో కార్బన్ డయాక్సైడ్ విడుదల అవుతుంటుంది. అందుకే.. వారిని దోమలు ఎక్కువగా కుట్టే అవకాశం ఉంటుంది.

**ముదురు రంగులేస్తే.. మూడినట్టే!**

ఓ అధ్యయనం ప్రకారం.. నారింజ, ఎరుపు రంగుల తరంగ దైర్ఘ్యాలకు దోమలు ఎక్కువ ఆకర్షితం అవుతుంటాయని తేలింది. దోమలకు స్పష్టమైన చూపు ఉండదనీ, అందుకే కొన్ని ప్రత్యేక రంగులను మాత్రమే అవి గుర్తించగలుగుతాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే, లేత రంగుల దుస్తులను ధరిస్తే.. దోమల బెడద నుంచి తప్పించు కోవచ్చని సూచిస్తున్నారు

**వేడివేడిగా..**

దోమలు వేడి వాతావరణాన్ని ఇష్టపడతాయి. మనిషి శరీర ఉష్ణోగ్రతను బట్టికూడా వారిని కుట్టాలా? వద్దా? అనేది దోమలు నిర్ణయించుకుంటాయట. ఇక సువాసనలు వెదజల్లే సబ్బులు వాడేవాళ్లను కూడా దోమలు ఎక్కువగా కుడుతాయి. ఆ సబ్బుల్లోని సువాసనల ప్రభావం.. చర్మంపై చాలాసేపటి వరకు ఉంటుంది. అది దోమలను ఎక్కువగా ఆకర్షిస్తుంది. అందుకే.. చలికాలంలో అలాంటి సబ్బులను వాడకుండా ఉంటే మంచిదని ఆరోగ్య నిపుణులు సలహా ఇస్తున్నారు.

# రాజస్థాన్?లో ఈ ప్రదేశాలు ఔరా అనిపిస్తాయి ఒక్కసారైన చూడాలి



దేశంలో అత్యధిక వేడి ప్రాంతం రాజస్థాన్.. థార్ ఎడారి లో ఉన్న ఈ ప్రాంతం అత్యంత ఉష్ణోగ్రత కలిగి అయినప్పటికీ.. రాజస్థాన్ సహజ సౌందర్యం చాలా మంది ప్రయాణికులను ఆకర్షిస్తుంది. రాజస్థాన్‌లోని కొన్ని ప్రదేశాలు వర్షాకాలం లేదా శీతాకాలంలో మరింత అందంగా మారుతాయి. వాటి గురించి ఇప్పుడు తెలుసుకుందాం రండి. మౌంట్ అబూ: రాజస్థాన్‌లోని మౌంట్ అబూ రాష్ట్రంలోని ఆకర్షణీయమైన ప్రదేశం. ఈ ప్రదేశము హనీమూన్ డెస్టినేషన్‌గా కూడా పరిగణించబడుతుంది. ఈ ప్రదేశం ఎల్లవేళలా పచ్చదనం ఉన్నప్పటికీ, వర్షాకాలంలో ఈ ప్రదేశం మరింత అందంగా కనిపిస్తుంది.

మౌంట్ అబూ: రాజస్థాన్‌లోని మౌంట్ అబూ రాష్ట్రంలోని ఆకర్షణీయమైన ప్రదేశం. ఈ ప్రదేశము హనీమూన్ డెస్టినేషన్‌గా కూడా పరిగణించబడుతుంది. ఈ ప్రదేశం ఎల్లవేళలా పచ్చదనం ఉన్నప్పటికీ, వర్షాకాలంలో ఈ ప్రదేశం మరింత అందంగా కనిపిస్తుంది.

1 / 5

భంగర్ కోట: చిన్న పర్వతాల మధ్య ఉన్న భంగర్ కోట వర్షం కారణంగా పచ్చదనంతో కనుల విందు చేస్తుంది. దెయ్యాల కోటగా గుర్తింపు పొందిన ఈ కోట అందాలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.

భంగర్ కోట: చిన్న పర్వతాల మధ్య ఉన్న భంగర్ కోట వర్షం కారణంగా పచ్చదనంతో కనుల విందు చేస్తుంది. దెయ్యాల కోటగా గుర్తింపు పొందిన ఈ కోట అందాలు చాలా ఆకర్షణీయంగా ఉంటాయి.

2 / 5

ఉదయపూర్ సిటీ: అనేక చారిత్రాత్మక కట్టడాలు ఉన్న ఉదయపూర్ రాచరిక శైలికే కాకుండా పచ్చదనానికి కూడా పేరుగాంచింది. ఉదయపూర్‌లో అనేక పర్వతాలు ఉన్నాయి. వర్షాకాలం తర్వాత వాటి అందం మరింత పెరుగుతుంది.

ఉదయపూర్ సిటీ: అనేక చారిత్రాత్మక కట్టడాలు ఉన్న ఉదయపూర్ రాచరిక శైలికే కాకుండా పచ్చదనానికి కూడా పేరుగాంచింది. ఉదయపూర్‌లో అనేక పర్వతాలు ఉన్నాయి. వర్షాకాలం తర్వాత వాటి అందం మరింత పెరుగుతుంది.

3 / 5


జైపూర్ సిటీ: రాజస్థాన్‌లో చూడదగ్గ ప్రదేశాల విషయానికి వస్తే, జైపూర్ నగరాన్ని బెస్ట్ ఎంపిక. దీనిని పింక్ సిటీ అని కూడా పిలుస్తారు. జైపూర్‌లోని అంబర్ ఫోర్ట్‌తో సహా అనేక చారిత్రక ప్రదేశాల అందాలను పర్యాటకులు ఇష్టపడతారు.


జైపూర్ సిటీ: రాజస్థాన్‌లో చూడదగ్గ ప్రదేశాల విషయానికి వస్తే, జైపూర్ నగరాన్ని బెస్ట్ ఎంపిక. దీనిని పింక్ సిటీ అని కూడా పిలుస్తారు. జైపూర్‌లోని అంబర్ ఫోర్ట్‌తో సహా అనేక చారిత్రక ప్రదేశాల అందాలను పర్యాటకులు ఇష్టపడతారు.

4 / 5

జాలోర్: దీన్ని సిటీ అఫ్ గ్రానైట్ అండ్ గ్రాండ్యుర్ అని పిలుస్తారు. జలోర్ కోటలోని 'టోప్ ఖానా' లేదా ఫిరంగి ఫౌండ్రీ జలోర్‌లోని ప్రముఖ పర్యాటక ఆకర్షణ. ఈ నగరం దాదాపు 900 సంవత్సరాల క్రితం నిర్మించబడిన సుంధ మాత ఆలయానికి కూడా ప్రసిద్ధి చెందింది మరియు దేవత చాముండ దేవి భక్తులకు పవిత్రమైనది.

జాలోర్: దీన్ని సిటీ అఫ్ గ్రానైట్ అండ్ గ్రాండ్యుర్ అని పిలుస్తారు. జలోర్ కోటలోని 'టోప్ ఖానా' లేదా ఫిరంగి ఫౌండ్రీ జలోర్‌లోని ప్రముఖ పర్యాటక ఆకర్షణ. ఈ నగరం దాదాపు 900 సంవత్సరాల క్రితం నిర్మించబడిన సుంధ మాత ఆలయానికి కూడా ప్రసిద్ధి చెందింది మరియు దేవత చాముండ దేవి భక్తులకు పవిత్రమైనది.







# మనసు.. కవిత్వం



కట్టుబాట్లను వదిలేసినప్పుడు సంతోషంగా ఉన్నా, తర్వాత సమాజం నుంచి వచ్చే విమర్శల వల్ల దుఃఖమూ కలుగుతుంది. మనసు ఒక్కోసారి ఆకాశంలో విహరిస్తున్నట్టుగా, ఒక్కోసారి దుఃఖపడుతూ, ఒక్కోసారి నిస్తేజంగానూ, నిరుత్సాహంగానూ ఉంటుంది. మన మనసు ఎలా ఉంటే, ఆ భావం ముఖంలో ప్రతిఫలిస్తూ ఉంటుంది. ఒక మనిషి చెడ్డవాడా, మంచివాడా అనే నిర్ణయం మనసును బట్టే ఉంటుంది. అందుకే, ఎందరో వాగ్గేయకారులు, గేయ రచయితలు ఎంతో అనుభవంతో, మనసును సంబోధిస్తూ రచనలు చేశారు. భారతీయ సంగీతంలో, వివిధ సాహిత్య రీతుల్లో మనసును సంబోధిస్తూ అనేక రచనలు చోటుచేసుకున్నాయి. మనసుకు ఒక రూపం అంటూ లేదు. కానీ, మన ఇంద్రియాలకు మాత్రం అధికారి మనస్సే. మనం ఏ పనిచేసినా, అది మనసుతో ముడిపడి ఉంటుంది. మనిషి పురోగతికి, తిరోగతికీ మనసే కారణం. అందుకే అది స్వేచ్ఛగా తిరగాలని, కట్టుబాట్లను వదిలేయాలని చూస్తుంది. మనసు, దాని స్వరూప స్వభావాలు, జీవితంలో ఎదురయ్యే వివిధ సందర్భాల్లో మనసు తీరుతెన్నులు ఎలా ఉంటాయో అనుభవపూర్వక రచనల సాహిత్యాలను పరిశీలించి తెలుసుకుం దాం. భారతీయ సంగీతంలో మనసును సంబోధిస్తూ వెలువడిన వివిధ రీతులైన శాస్త్రీయ, భక్తి, లలిత, జానపద, చలనచిత్ర సంగీతాలు ఎలా ఉన్నాయో, ఆయా రచనల భావం, ఆ రచనల్లో గల సాహిత్య విలువలను ఒకసారి సింహావలోకనం చేద్దాం.

### మొదటగా శాస్త్రీయ సంగీతం...

సామవేద జనితమైన శాస్త్రీయ సంగీతం హిందుస్తా నీ, కర్ణాటక సంగీత బాణీలుగా ఉన్నది. వీటిలో కర్ణాటక సంగీతం, మన దక్షిణ భారతానికి చెందిన ది. ఈ సంగీత రీతిలో మనసు మీద రచనలు ఎక్కువగా తెలుగులో తర్వాత సంస్కృతం, హిందీ, తమి ళం, కన్నడం వంటి ప్రాంతీయ భాషల్లో వచ్చాయి. 18వ శతాబ్దానికి చెందిన వాగ్గేయకారులైన త్యాగ య్య, శ్యామశాస్త్రి, ముత్తుస్వామి దీక్షితులు కర్ణాటక సం గీతానికి త్రిమూర్తులు. వీరికృతులు, కీర్తనలు, రచనలు, నేటి శాస్త్రీయ సంగీతం అనేంతగా సంగీత ప్రపంచాన్ని ప్రభావితం చేశాయి. ఈ ముగ్గురిలో త్యాగరాజ స్వామి రచనలు అప్పటి సామాజిక పరిస్థితులకు దగ్గరగా ఉం డటం వల్ల విశేష ఆదరణ పొందాయి. త్యాగరాజు రామభక్తుడు. వూంఛవృత్తి చేస్తూ జీవనం గడిపేవాడు. ఐహిక సుఖములను వదిలి రాముని పరబ్రహ్మగా భావించి నాదోపాసన ద్వారా తరించాడు. ఆయన కృతులలో మనసును సంబోధిస్తూ, మనసుకు వివిధ విషయాల గురించి బోధిస్తూ సాగే రచనలుఎక్కువగా ఉన్నాయి. 'మనసా ఎటులోర్తునే, నా మనవిని చేకొనవే/ దినకరకుల భూషణుని' అంటూ మనసును చెడు స్నేహాలు చేయకుండా, తరింపజేసే మార్గం తెలుపమంటూ వేడుకుంటున్నట్టుగా సాగుతుందీ పాట. 'అలాగే, ఉండేది రాముడొకడు/ ఊరక చెడిపోకే మనసా/ ధర్మాత్ముడు, సర్వసముడు క్షేమకరుడు త్యాగరాజ చిత్తహితుడు/ జగము నిండి' అనే ఈ కీర్తనలో సగుణ రూపుడైన రాముడికి, నిర్గుణమైన పరబ్రహ్మ తత్వాన్ని ఆపాదించి మనసుకు బోధించడం కనపడుతుంది. ఈ కీర్తన 28వ మేళకర్త హరి కాంభోజి రాగంలో ఉన్నది. ఈ రచనలు శాస్త్రీయ సంగీతంలో మచ్చు తునకలు.

### భక్తి సంగీతంలో..

మన భారతీయ జీవనశైలిలో దేవునిపై భక్తి చాలా ఉంటుంది. అయితే, మనిషి ఏ మార్గంలో నడవాలన్నా దానికి మనసు సహకరించాల్సిందే. చిన్నప్పటి నుంచి రామభక్తుడైన త్యాగయ్య 'మనసు స్వాధీనమైన/ ఆ ఘనునికి/ మరి మంత్రతంత్రములేల?' అన్నాడు. అంటే, మనసు సహకారం మనిషికి ఎంత ప్రధానమైనదో దీని ద్వారా తెలుస్తున్నది.

### రామదాసు కీర్తనల్లో!

తెలుగునాట భజనల్లో తప్పకుండా వినవచ్చేవి రామదాసు కీర్తనలు. కంచర్ల గోపన్న తన భక్తి రచనల ద్వారా భక్త రామదాసుగా పేరుగాంచారు. అయితే రామదాసు తన మనసుకు, కేవలం రామునిపై భక్తి, వైరాగ్యాలనే కాకుండా, సామాజిక బాధ్యతను కూడా బోధించాడు. 'శ్రీరాముల దివ్య నామ స్మరణ చేయుచున్న చాలు ఘోరమైన తపములను / కోరనేటికే మనసా భాగవతుల పాదజలము/ పైన చల్లుకొన్న చాలు భగీరథికి పోయ్యేననే భ్రాంతి ఏటికే ' అంటూ ఒక చరణంలో, మరో చరణంలో సామాజిక బాధ్యతగా%ొ% 'పరుల హింస చేయకున్న /పరమ ధర్మమంతె చాలు/ పరుల రక్షింతునని/పల్క నేటికే దొరకాని పరుల ధనముల దోచక ఉండితె చాలు గురుతుగాను గోపురము, కట్టనేటికే మనసా' అంటూ ఘోరమైన తపస్సులు చేయవలసిన అవసరం లేదని, మహాభక్తుల పాద జలము చాలు, గంగానది వద్దకు వెళ్లనవసరం లేదనీ చాలా చక్కగా చెప్పారు. అలాగే పరాయివాళ్ల ధనం మీద ఆశపడి వాటిని దోచి పేరు రావడానికి గుడి గోపురాలు కట్టించినా నిష్ఫలమని సామాజికపరంగా అందరికీ కనువిప్పు కలిగించే విధంగా కీర్తనలు చేశారు. మనసుకీ, మనిషికీ మార్గనిర్దేశనం చేయగల ఈ కీర్తన, సాహిత్యపరంగా రామదాసుచే కావించబడిన ఒక గొప్ప మానస సంబోధన.

### లలిత సంగీతం...

గ్రామ ఫోన్ రికార్డులు, రేడియోల ద్వారా జనంలోకి చేరిన సంగీత రీతి లలిత సంగీతం. శాస్త్రీయ సంగీతానికి భిన్నంగా నూతనంగా ఉండే ఈ లలితగీతాలు సంగీతం, ప్రకృతి, ప్రేమా, భక్తి వైరాగ్యం దాకా స్పృశించని అంశం లేదు. శాస్త్రీయ సంగీతంలోని కృతుల లాగా పాండిత్యమే ప్రధానంగా కాకుండా, సాహిత్య రస భావానుగుణమైన రాగ రచనతో ఆధునిక గేయ రచనలను పాడే సంగీతం తొలి రోజుల్లో గీతావళి అని, ఆ తర్వాత లలిత సంగీతం అనీ వాడుకలోకి వచ్చింది. లలిత సంగీత లక్షణాన్ని బాలాంతరపు రజనీకాంతరావు ఆంధ్ర వాగ్గేయకార చరిత్ర రెండవ భాగంలో చెప్పారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి, దాశరథి, ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి, బసవరాజు అప్పారావు, నండూరి వెం కట సుబ్బారావు, బాపిరాజు, బాలాంతపు రజనీకాంతరావు వంటి రచయితలు.. విశ్వనాథ, సాలూరి రాజేశ్వరరావు, చిత్తరంజన్ వంటి స్వరకర్తలు.. ఘంటసాల, బాలమురళికృష్ణ, బాల సరస్వతి, అనసూయ, సుశీల, శ్రీరంగం గోపాలరత్నం వంటి గాయక శిఖామణులు లలిత సంగీతానికి పరిపుష్టిని చేకూర్చారు. మల్లవరపు విశ్వేశ్వర రావు రచించిన ఒక మానస బోధగేయం%ొ% 'మరపురాని కలలు కని, మరుదినమ్ము మేలుకొని నిరాశలే/ మిగులునని తెలుసుకొంటివా మనసా/ అలసి యుంటివా మనసా ప్రేమ నిన్న రోజుదని/ నేడు కరిగిపోయెననీ/ వేదనయే రేపటనీ తెల్ల మాయెనా! గుండెలు తల్లడిల్లెనా! మనసా! అలసటా యెనా మనసా!' అంటూ ప్రేమలో విఫలమైనప్పుడు మనసు పడే బాధను చక్కగా వివరిస్తుంది. ఒకరిపై ప్రేమ కలగాలన్నా లేదా ఏ విధమైన భావన కలగాలన్నా మనసుదే కీలకపాత్ర. కనుక ఈ గీతంలో ప్రేమ విఫలమైనప్పుడు కలిగే బాధను మనసే పడుతున్నట్టు భావించి కవి ఈ గీతాన్ని రాశారు. అలాగే కృష్ణశాస్త్రి కూడా 'ఒదిగిన మనసున, పొదిగిన భావం' అన్న లలితగీతానికి ఈమని శంకరశాస్త్రి సంగీతం సమకూర్చారు.


### జానపద సాహిత్యంలో

జానపద సంగీతం, సాహిత్యం పల్లె ప్రజల్లో అసువుగా పుట్టాయి. వీటికి సాధారణంగా రచయితలుండరు. ఉన్నా తెలియదు. పల్లెల్లో బుర్రకథలు, హరిదాసులు, యాచకుల వద్ద మనకు వినిపిస్తూ ఉంటాయి. ఇటువంటి వాటిలో ఎక్కువగా మనసుకు సంబంధించిన జ్ఞాన, వైరాగ్యాలను చూపే తత్వసాహిత్యం ఉంటుంది. 'ఇల్లు వాకిలి నాది ఇల్లాలు నాదనచు ఏల భ్రమసితివయ్య మనసా! కాలుని వలలోన/కానక చిక్కితివి కడతేరుటే త్రోవమనసా ఒంటరిగ యాగంటి దాసుని మదిలోన జంట బాయక వుండు మనసా' అంటూ సాగిన జానపద గేయం యాగంటి లక్ష్మప్ప రాసిన గేయంగా, 'ఆంధ్రుల కీర్తన వ్మాయ కళాసేవ' అని ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గ్రంథంలో ఉన్నది. ఇటువంటి జానపద గేయాలు జ్ఞాన భాండాగారాలు. తర్వాతి తరాలవారి కోసం వీటిని భద్రపరచడం మన బాధ్యత.

### చలనచిత్ర సంగీతం..

మనసు గురించి పద్యాలతో ప్రారంభమై, నవరసాలను కురిపిస్తూ, అనేక రీతులను తనలోకి తీసుకుంటూ శాస్త్రీయ, లలిత, జానపద సంగీతాలకు దీటుగా చలనచిత్ర సంగీతం ఆవిర్భవించింది. సినీ గేయ రచయితల లో ఒకరైన ఆత్రేయకు మనసు కవి అని పేరు. మనసునే ప్రధాన కవితా వస్తువుగా తీసుకొని ఆయన ఎన్నో పాట లు రాశారు. వాటిలో మనసు స్వరూపాన్ని, స్వభావాన్నీ చక్కగా చూపిన ఈ పాట 'గుప్పెడు మనసు' లోనిది. 'మౌనమే నీ భాష ఓ మూగ మనసా తలపులు ఎన్నెన్నో కలలుగా కంటావు కల్లలు కాగానే కన్నీరు అవుతావు చీకటి గుహ నీవు చింతల చెలి నీవు నాటక రంగానివే మనసా/ ఎందుకు వలచేవో /ఎందుకు వగచేవో'.. ఎందుకు రగిలేవో మనసా' అని ఈ పాట సాగుతుంది. మంగళంపల్లి బాలమురళీకృష్ణ పాడిన ఈ పాట ప్రేక్షకుల మనసును దోచుకున్నది. నిజానికి, అనుకూల పరిస్థితుల్లో కంటే ప్రతికూల పరిస్థితుల్లోనే మనసు ఉనికిని గుర్తిస్తాం. ఇలా క్షణిక ఆనందాల వైపు తిరిగే మనసును, దాని స్వభావాన్ని ఎత్తి పొడుస్తూ, బతిమాలుతూ, ప్రేమ, ఆనందం, బాధ కలబోస్తూ, మనసు మీద రాసిన కవిత్వం, సాహితీ ప్రపంచంలో ఒక విశిష్ట స్థానం సంపాదించుకున్నది. శాస్త్రీయ సంగీతంలోని కృతుల లాగా పాండిత్యమే ప్రధానంగా కాకుండా, సాహిత్య రస భావానుగుణమైన రాగ రచనతో ఆధునిక గేయ రచనలను పాడే సంగీతం తొలి రోజుల్లో గీతావళి అని, ఆ తర్వాత లలిత సంగీతం అనీ వాడుకలోకి వచ్చింది.


# తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక




వాన వెలిశాక మట్టి వాసన, ఆరుద్ర పురుగుల సర్కస్ ఫీట్లు, పిచ్చుకల మట్టి స్నానాలు, వెన్నెల్లో ఆడిన ఆటలు, ఎండకాలం బావుల్లో ఈతలు ఈనాడేవి? మన చిన్నతనం మనకు చిన్నతనం కాదు. బాల్యం మళ్లీ రమ్మంటే వస్తుందా? 'అనుభూతులను పోగొట్టుకున్న గుండె ఎడారి. అనుభూతులను పదిలపరచుకున్న గుండె సతత హరితారణ్యం'. ఇటువంటి మధురమైన భావాల సుమమాల డాక్టర్ నలిమెల భాస్కర్ 'సుద్దముక్క'. ఈ పుస్తకంలో శ్రామిక జనజీవన చిత్రణం ఆర్ద్రంగా ఉంటుంది. శ్రామికుల రుణం తీర్చుకోవాలనిపించేలా చేస్తుంది. తమ బతుకులను బండలకేసి బాదుకుంటూ మన బట్టలను గట్టున ఆరేస్తారు రజకులు. మన బట్టలను పిండి వాళ్లు తోలు బొమ్మలవుతారు. వాళ్లుతికిన దుస్తులతో మనం మన లోపలి ముఖాన్నీ, మురికినీ చాటు చేసుకొని రోజూ నాగరికులమవుతాం. ఎవరి బట్టలను వారికి, తప్పిపోకుండా అందించే అమోఘమైన జ్ఞాపకశక్తి వారిది. 'సమాజ కల్మషాన్ని కడిగివేయడానికి/ కంకణధారులైన వ్యక్తులు సంస్కర్తలైనప్పుడు/ తరతరాలుగా మైలబట్టల్ని/ మల్లెపూలు ఉల్లిపొరలూ చేసేందుకు/ కటి బద్ధులైన వీళ్ళూ సంస్కర్తలే'. ఇలాంటివన్నీ ఒక ఎత్తు అయితే.. ఉపాధ్యాయుని గురించి, సుద్దముక్క గురించి రాసిన ఆరు కవితలు మరొకెత్తు. ఆ ఆరు కవితలలో ఉపాధ్యాయున్ని ప్రపంచాన అగ్రభాగాన నిలిపారు నలిమెల. అధ్యాపకునికి అక్షరాభిషేకం చేశారు. 'అతడు కాలుమోపడం తోటే అణువణువూ అక్షరమవుతుంది/ అతని మాటల రెక్కల మీద/ పిల్లలు అత్యంత సురక్షితంగా/ జ్ఞాన విహాయసంలో విహరించి వస్తారు' అని ఉపాధ్యాయుడి ఔన్నత్యాన్నీ, 'క్లాసులో ప్రవేశిస్తున్న ప్రతిసారీ/ అతని కుడిచేతికి ఆరో వేలు/ అదనంగా మొలుస్తుంది/ అది కచ్చితంగా జ్ఞానం ఘనీభవించిన తెల్లని సుద్దముక్కే' అని చాక్‌పీస్ ప్రాధాన్యాన్ని వెల్లడిస్తారు. సుద్దముక్క సూర్యగోళం నుంచి కోసుకొచ్చిన రశ్మి శకలం. చందమామ నుంచి తీసుకొచ్చిన వెన్నెలగడ్డ అన్నప్పుడు భాస్కర్ కవిత్వం తారస్థాయికి చేరుతుంది. సౌందర్యోపేతం అవుతుంది. చాక్‌పీస్ విద్యార్థులకు 'సమస్తమైన దిక్కులను నిర్దేశించగల చుక్కాని/ తరగతికి వెళ్లే ఉపాధ్యాయునికి ఊపిరి గుళిక/ ఉపన్యాసకులకు ఊతకర్ర'. భాస్కర్ దృష్టిలో ఈ భూమండలం మీద ఏకైక లోకైక దర్శనీయ స్థలం 'బడి'. 'సుద్దముక్క' తెలుగు కవిత్వంలో ఓ వజ్రపు తునక. ఇందులో అడుగడుగునా కవిత్వం, అణువణువునా నవత్వం, ప్రతివాక్యం ఆస్వాదయోగ్యం, అనుభవైకవేద్యం.


# ఏది తల్లీ గట్లుంటది నాటి సాహిత్యం

## ఏదీ ఎక్కడా కానరావేం మన దగ్గరనే కాదు



పొరుగునే అని కూడా కాదు, మొత్తం ప్రపంచవ్యాప్తంగా కూడా ఆ ఉధృతి తగ్గింది. వ్యక్తిగత వ్యవహారాలకే పరిమితమవుతున్న కవిత్వమే తప్ప సామాజిక పట్టింపు ఎక్కడా కానరాదేం. ముఖ్యంగా మహిళలు రాసే కవిత్వం ప్రేమ రాహిత్యం, వ్యక్తిగత వైఫల్యాలపై వస్తున్నాయే తప్ప సామాజిక, సామూహిక వైఫల్యాలపై ఎందుకు నిరసన కవిత్వం రావడం లేదు. ఆనాటి ఆవేశం నేడు ఎక్కడా కానరావడం లేదేం? ఆనాడు వచ్చిన ఫెమినిస్ట్ కవిత్వం నేడు ఎందుకు రావడం లేదు? ఆనాటి ఫెమినిస్ట్‌లు తమ తర్వాత తరానికి ఆ ఆయుధాలను ఇవ్వలేకపోవడమా లేక ఈనాటి కవయిత్రులు ఆ తరాన్ని అందుకోలేకపోవడమా అసలు కారణమేంటి? ఒకరిద్దరు మినహా మిగిలిన కవయిత్రులంతా తమ కవిత్వాన్ని వ్యక్తిగతానికే పరిమితం చేస్తున్నారు. ఆ రోజులతో పోలిస్తే నేడు కవిత్వ ప్రకటనలకు అనేకానేక వేదికలున్నాయి. ముఖ్యంగా సోషల్ మీడియాలో కవిత్వం ఏరులై పారుతున్నది. నిజానికి పత్రికలు కవిత్వానికి ఇస్తున్న స్పేస్ చాలా అంటే చాలా తగ్గిపోయింది. కొన్ని పత్రికలైతే అసలు సాహిత్యం ఓ ఆలంబన అనే విషయాన్నే వదిలేసి ఏండ్లు గడిచిపోయాయి. మిగిలిన సామాజిక మాధ్యమాల్లో కూడా సామాజిక అంశాలపై కవిత్వం రాస్తున్న వారు పెద్దగా కానరావడం లేదు. 80, 90వ దశకాల్లో మహిళలు రాసిన కవిత్వం చదివి చాలామంది ప్రేరణ పొందారు. ఆ కవిత్వాల ద్వారానే కొన్ని ఉద్యమాలు వచ్చాయంటే అతిశయోక్తి కాదు. ముఖ్యంగా నీలిమేఘాలు కవిత్వ సంపుటి తీసుకొచ్చిన తుఫాను.. అలాంటి ఇలాంటి తుఫాను కాదు. అంతవరకూ వ్యక్తులుగా ఉన్న కవయిత్రులంతా ఆ నీలిమేఘాలు అనంతరం సామూహికం అయ్యారు. అందులో ఒక్కో కవితా ఒక్కో తూటాలా మహిళలను కదిలించింది. పురుషులైతే ఇలా ఉన్నామా ఇలా బతుకుతున్నామా? అని తమని తాము ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చింది. అప్పటికింకా చదువు, సంధ్యల్లో గడుపుతున్న నాలాంటి వాళ్లకు నీలిమేఘాలు ఓ సంచలన, సంభ్రమాశ్చర్య కవిత్వ సంపుటి. ఆ సమయంలో ఓల్గా, విమల, జయప్రభ, ఘంటశాల నిర్మల, మందరపు హైమవతి, కొండేపూడి నిర్మల వంటి వారి కవిత్వం చదివి ఉప్పొంగిపోయిన సందర్భాలు ఎన్నో ఎన్నెన్నో. ఆ కవయిత్రుల్లో కొందరు పూర్తిగా కవిత్వానికి దూరమయ్యారు. మిగిలినవారు రాస్తున్నా ఆ నాటి వాడి, వేడి ఎందుకు తగ్గిందో? మహిళలందరూ.. 'ఎవరి బతుకులు వారివే. మనకెందుకు ఇదంతా' అనే ఓ నిర్లిప్త వాతావరణంలోకి వెళ్లిపోయారా? సామూహికంగా మారి ఓ ఉద్యమ స్థాయిలో కవిత్వాన్ని పండించినవారంతా ఇప్పుడు ఒక్కరుగానే మిగిలిపోతున్నారా? అప్పట్లో స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం లేదు. దానికి తోడు సమాజంలో ఓ చిన్నచూపు. కానీ, నేడు పరిస్థితులు కొంత మారాయి. ముఖ్యంగా దేశంలో గ్లోబలైజేషన్ కారణంగా వచ్చిన మార్పులు అన్నీ ఇన్నీ కావు. ఐటీ ప్రవేశంతో జీవితాలు మారిపోయాయి. స్త్రీలకు తాము చదివిన చదువులకు తగ్గట్టుగా ఉద్యోగాలు వచ్చాయి. ఆర్థిక స్వావలంబన పెరిగింది. పురుషుడితో సమానంగా తానూ ఎదిగాననే ఆత్మవిశ్వాసం వచ్చింది. లక్షల్లో జీతాలతో పాటు తన కోర్కెలను స్వేచ్ఛగా వెల్లడించే అవకాశాలు వచ్చాయి. దీని ప్రభావం సాహిత్యం మీద పడిందా? ఇవన్నీ ప్రశ్నలే. జీవితం సంతృప్త స్థాయికి చేరిందనుకోవాలా? అందుకే వ్యక్తిగత వ్యవహారాలకే నేటి కవయిత్రులు పరిమితమవుతున్నారని భావించాలా? ఇదంతా కావచ్చు కానీ నా మటుకు నాకు అనిపించింది ఏమిటంటే.. ఓ కేంద్రీకృత ఉద్యమం లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. అసలు ఉద్యమం అనేదే లేకుండాపోయింది. కథకుడు ఖదీర్‌బాబు చెప్పినట్టు 'కనీసం ఊళ్ల పట్టుకు ఊరేగడానికి ఉద్యమమూ లేదు' అన్నట్టుగా మారింది. అమ్మ నవలలో 'పావెల్ చేత మన ఆలోచనలన్నింటికీ కేంద్రం ఉద్యమమే కావాలి' అని మాక్సిం గోర్కీ చెప్పిస్తాడు. ఆ కేంద్ర స్థానాన్ని, ఆ ఉద్యమాన్ని ఇక్కడివారు పట్టించుకోకపోవడం వల్లనే ఇలా జరుగుతోందా? రాష్ట్రం విడిపోవడానికి ముందు తెలంగాణ సాధన కోసం అనేక మంది కవయిత్రులు ఉద్యమ కవిత్వాన్ని అద్భుతంగా రాశారు. దాని ప్రభావం కచ్చితంగా ఉద్యమంపై పడి అది మరింత బలపడింది. కవిత్వమో, పాటో, కథో, నవలో మొత్తానికి తెలంగాణ ఉద్యమానికి అనుకూలంగా, ప్రత్యేక రాష్ట్రం రావాల్సిన ఆవశ్యకతపై సాహిత్య సృజన జరిగింది. రాష్ట్రం సిద్ధించింది. చిరకాల కోరిక ఈడేరింది. ప్రాంతీయ ఉద్యమాలే ఆలంబనగా ఆ సాహిత్యం వచ్చింది. అయితే, ఆ తర్వాత అంతే ఉద్యమ, సామాజిక స్ఫూర్తిని ఇవ్వాల్సిన సాహిత్యం కూడా నిలిచిపోయిందా. ఇప్పుడూ కవయిత్రులు రాస్తున్నారు కదా అనే ప్రశ్న రావచ్చు. వస్తోంది. ఆ కాలంతో పోల్చుకుంటే చాలా తక్కువగానే రాస్తున్నారు. తాము స్పందించకపోతే ఎలా అనే కారణంగానే ఒకటి, రెండు రాస్తున్నారు. ఎక్కువగా మాత్రం కవయిత్రులు తమ వ్యక్తిగతానికే పరిమితం అవుతున్నారని అనిపిస్తున్నది. అంతకుముందు ఉమ్మడి ఏపీలో వచ్చిన అనేకానేక ఉద్యమాలకు స్ఫూర్తి ఆ నాటి సాహిత్యమే. ఆ తర్వాత వచ్చిన పరిణామాల ప్రభావం సాహిత్యంపై పడటమే ప్రధాన కారణంగా కనిపిస్తున్నది. ఇప్పుడు రాస్తున్న కవయిత్రుల్లో చాలామంది అద్భుత కవిత్వాన్నే రాస్తున్నారు. కానీ, ఎక్కడో ఓ వెలితి వెంటాడుతోంది.

# రోజూ ఉదయం కడుపులో మంటగా ఉంటుందా అయితే ఈ చిట్కాలను పాటించండి



సాధారణంగా చాలా మంది అప్పుడప్పుడు అసిడిటీ సమస్యతో బాధపడుతుంటారు. ఇది వచ్చేందుకు అనేక కారణాలు ఉంటాయి. కారం, మసాలాలు ఉన్న ఆహారాలను అధికంగా తినడం, వేళ తప్పించి భోజనం చేయడం, టీ, కాఫీలను అతిగా తాగడం, భోజనం ఎక్కువగా తీసుకోవడం వంటి అనేక కారణాల వల్ల అసిడిటీ వస్తుంది. దీంతో ఏం చేయాలో తోచదు. మెడికల్ షాపుకు వెళ్లి మందులను కొని తెచ్చి వేసుకుంటారు. అయితే దీర్ఘకాలంలో ఇలా చేయడం మంచిది కాదు. దీంతో పలు సైడ్ ఎఫెక్ట్స్ వస్తాయి. ఇక కొందరికి రోజంతా అసిడిటీ ఉండదు. కానీ ఉదయం పూట మాత్రం అసిడిటీ ఉంటుంది. ఇలాంటి వారు కింద చెప్పిన పలు చిట్కాలను పాటించడం వల్ల అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. దీంతో ఎంతగానో రిలీఫ్ లభిస్తుంది.

### నిమ్మరసం..

అసిడిటీ సమస్యను తగ్గించడంలో నిమ్మరసం ఎంతగానో పనిచేస్తుంది. అయితే నిమ్మరసం కూడా యాసిడ్‌ను కలిగి ఉంటుంది కదా.. అని చాలా మంది అనుకుంటారు. కానీ నిజానికి నిమ్మరసాన్ని మనం తాగితే అది మన శరీరంలో చేరాక ఆమ్లత్వాన్ని కోల్పోతుంది. దీంతో మనకు మేలు జరుగుతుంది. కనుక అసిడిటీ సమస్య ఉన్నవారు నిరభ్యంతరంగా నిమ్మరసం తాగవచ్చు. ఒక గ్లాస్ గోరు వెచ్చని నీటిలో కాస్త నిమ్మరసం కలిపి తాగితే అసిడిటీ సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది. అలాగే అజీర్ణం కూడా తగ్గుతుంది. ఇక ఉదయాన్నే పరగడుపునే 30 ఎంఎల్ మోతాదులో కలబంద రసాన్ని సేవిస్తున్నా కూడా జీర్ణ సమస్యల నుంచి బయట పడవచ్చు. జీర్ణ వ్యవస్థ పనితీరును మెరుగు పరచడంలో కలబంద ఎంతగానో పనిచేస్తుంది. కలబంద రసాన్ని సేవిస్తుంటే అసిడిటీ నుంచి తక్షణమే ఉపశమనం లభిస్తుంది. దీంతోపాటు గ్యాస్, కడుపు ఉబ్బరం కూడా తగ్గుతాయి.

### సోంపు గింజలు..

ఉదయం అసిడిటీ ఎక్కువగా ఉంటే దాన్ని తగ్గించేందుకు సోంపు గింజలు కూడా ఎంతగానో పనిచేస్తాయి. సోంపు గింజలను తీసుకుని నోట్లో వేసుకుని నమిలి తింటుంటే అసిడిటీ తగ్గుతుంది. లేదా సోంపు గింజలను నీటిలో వేసి మరిగించి ఆ నీళ్లను తాగుతుండవచ్చు. దీంతో కూడా జీర్ణ సమస్యల నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇక జీర్ణ సమస్యలను తగ్గించడంలో అల్లం కూడా అద్భుతంగానే పనిచేస్తుంది. రోజుకు రెండు సార్లు భోజనానికి ముందు అల్లం రసాన్ని ఒక టీస్పూన్ మోతాదులో సేవించాలి. అల్లం రసం కడుపులో మంటను తగ్గిస్తుంది. పొట్టను ప్రశాంతంగా ఉండేలా చూస్తుంది. పొట్టలో ఉండే అసౌకర్యాన్ని కూడా తగ్గిస్తుంది.

### చల్లని పాలు..

వేడి పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం పెరుగుతుంది. కానీ చల్లని పాలను తాగితే పొట్టలో ఆమ్లత్వం తగ్గుతుంది. దీంతో అసిడిటీ నుంచి బయట పడవచ్చు. కనుక కడుపులో మంటగా ఉన్నప్పుడు వేడి పాలను కాకుండా చల్లని పాలను తాగితే మేలు జరుగుతుంది. కడుపులో రోజంతా మంటగా ఉండేవారు కొబ్బరినీళ్లను తాగుతుండాలి. దీంతో చక్కని ఉపశమనం లభిస్తుంది. అలాగే తులసి ఆకులను నేరుగా అలాగే తింటున్నా కూడా కడుపులో మంట నుంచి ఉపశమనం పొందవచ్చు. ఇలా పలు చిట్కాలను పాటించడం వల్ల కడుపులో మంటను తగ్గించుకోవచ్చు. జీర్ణవ్యవస్థ పనితీరు మెరుగుపడుతుంది.

# కలబందను అసలు ఎలా తీసుకోవాలి



ఆయుర్వేద ప్రకారం కలబంద ఎన్నో ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుంది. కలబందలో ఎన్నో ఔషధ గుణాలు ఉంటాయి. కలబంద గుజ్జును తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. చాలా మంది ప్రస్తుతం కలబందను ఇండ్లలోనే పెంచుతున్నారు. దీంతో మనకు కలబంద ఎప్పుడు కావాలంటే అప్పుడు లభిస్తుంది. ఇక మార్కెట్‌లోనూ కలబంద జ్యూస్‌ను విక్రయిస్తున్నారు. దీన్ని కూడా మనం ఉపయోగించవచ్చు. అయితే కలబంద నిజంగా మనకు ఆరోగ్య ప్రదాయిని అనే చెప్పవచ్చు. కలబంద జ్యూస్‌ను తాగడం లేదా కలబంద గుజ్జును ఉపయోగించడం వల్ల మనకు అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. అందానికి, శిరోజాల సంరక్షణకు కూడా కలబంద ఎంతగానో ఉపయోగపడుతుంది. అయితే దీన్ని ఎలా తీసుకోవాలి అనే విషయం చాలా మందికి తెలియదు.

### ఇలా తీసుకోవాలి..

కలబంద గుజ్జు లేదా జ్యూస్‌ను నేరుగా అలాగే తీసుకోవచ్చు. అయితే కలబంద రుచి కొందరికి నచ్చకపోవచ్చు. ఇది కొందరికి చేదుగా, వగరుగా అనిపిస్తుంది. కనుక అలాంటి వారు తేనెను చేర్చి తీసుకోవచ్చు. అయితే కలబందను అలర్జీలు ఉన్నవారు తీసుకోకూడదు. కలబందను తింటే కొందరికి పడదు. దీంతో వారికి చర్మంపై దురదలు వస్తాయి. కొందరికి వాంతులు, విరేచనాలు అయ్యే అవకాశాలు ఉంటాయి. కనుక ఈ సమస్యలు ఎదుర్కొనే వారు కలబందను తినకూడదు. కలబందలో మన శరీరానికి ఉపయోగపడే అనేక ఔషధ గుణాలతోపాటు విటమిన్లు, మినరల్స్ కూడా ఉంటాయి. అందువల్ల కలబందను రోజూ తింటే అనేక లాభాలను పొందవచ్చు.

### రోగ నిరోధక శక్తికి..

కలబందను రోజూ ఒక టీస్పూన్ మోతాదులో జెల్ తినవచ్చు. అదే జ్యూస్ అయితే రోజూ 30 ఎంఎల్ మోతాదులో తాగవచ్చు. కలబందలో విటమిన్లు ఎ, సి, ఇ, పలు రకాల బి విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. కలబందలో ఉండే విటమిన్ ఎ మన శరీర రోగ నిరోధక శక్తిని పెంచుతుంది. అలాగే కంటి చూపును మెరుగు పరుస్తుంది. కలబందను రోజూ తీసుకోవడం వల్ల కంటి చూపు పెరిగి కళ్లద్దాలను తీసి పడేస్తారు. ఇక కలబందలో ఉండే విటమిన్ సి మన శరీర ఇమ్యూనిటీ పవర్‌ను పెంచుతుంది. దీంతో రోగాల నుంచి రక్షణ లభిస్తుంది. తీవ్రమైన వ్యాధులు రాకుండా ఉంటాయి.

### శిరోజాలు, ముఖానికి..

కలబంద మన జీర్ణవ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. కలబందను రోజూ తింటుంటే జీర్ణవ్యవస్థ శుభ్రంగా మారుతుంది. గ్యాస్, అసిడిటీ, మలబద్ధకం తగ్గుతాయి. జీర్ణవ్యవస్థలో ఉండే వ్యర్థాలు బయటకు పోతాయి. కలబంద శిరోజాలు, ముఖానికి కూడా ఎంతో మేలు చేస్తుంది. దీంతో తయారు చేసే ఫేస్ ప్యాక్ లేదా హెయిర్ ప్యాక్‌లను ఉపయోగించడం వల్ల ముఖం కాంతివంతంగా మారడమే కాదు, శిరోజాలు ఆరోగ్యంగా కూడా ఉంటాయి. శిరోజాలు ఒత్తుగా, దృఢంగా పెరుగుతాయి. కలబందలో యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఫ్రీ ర్యాడికల్స్‌ను నాశనం చేస్తాయి. దీంతో క్యాన్సర్ వంటి వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు. గుండె పనితీరు మెరుగు పడుతుంది. ఇలా కలబంద వల్ల మనం అనేక ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.


# రష్యాను సవాలు చెయ్యడానికి 'యూరప్ సైన్యం'



అమెరికా నుంచి యూరప్ దేశాలకు అందుతున్న ఆర్థిక, సైనిక సాయం ఇకపై అందే అవకాశం కనిపించకపోవడంతో 'యూరప్ సైన్యం' ఒకటి ఏర్పాటు చేసుకోవాలని యుక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలియెన్స్కీ పిలుపిచ్చారు.యూరప్, అమెరికా మధ్య ఉన్న చిరకాల బంధం 'ముగింపు దశకు' చేరుకుందని, ఈ విషయాన్ని యూరప్ దేశాలు అర్థం చేసుకోవాలని అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ చేసిన వ్యాఖ్యల్ని జెలియెన్స్కీ మ్యూనిచ్‌లో జరిగిన భద్రత సదస్సుల్లో గుర్తు చేశారు.అమెరికా అధ్యక్షుడు డోనల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు పుతిన్ శాంతి చర్చలు ప్రారంభించేందుకు అంగీకరించినట్లు తెలిసిన తర్వాత 'మా ప్రమేయం లేకుండా మా వెనుక జరిగే ఒప్పందాలను మేం ఎట్టి పరిస్థితుల్లో ఆమోదించే ప్రసక్తే లేదు' అని యుక్రెయిన్ అధ్యక్షుడు స్పష్టం చేశారు.ట్రంప్-పుతిన్ మధ్య ఫోన్ సంభాషణ తర్వాత అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో 'చర్చల ప్రక్రియను విస్తరించే విషయమై' రష్యా విదేశాంగమంత్రితో ఫోన్‌లో మాట్లాడారు.

ట్రంప్, పుతిన్ ఫోన్ సంభాషణ 'అమెరికా వైపు నుంచి వచ్చిన అభ్యర్థన' అని రష్యా విదేశాంగ శాఖ తెలిపింది. ఈ ప్రకటనలో యుక్రెయిన్ గురించి ఎలాంటి వివరాలు వెల్లడించలేదు.అయితే 'చర్చల విషయంలో రెండు దేశాలు నిబద్ధతతో ఉన్నాయని పునరుద్ఘాటిస్తున్నట్లు' చెప్పారు.అమెరికా అధ్యక్షుడు పుతిన్‌కు ఫోన్ చేయడంతో మూడేళ్లుగా అమెరికా, రష్యా మధ్య ఉన్న నిశ్శబ్దానికి ముగింపు పలికినట్లయింది.ట్రంప్ ప్రత్యేక దూత కీత్ కెల్లాగ్ 'అమెరికా రష్యా మధ్య చర్చల్లో యూరప్‌ను సంప్రదిస్తాం, అయితే చర్చల్లో వారికి ఎలాంటి భాగస్వామ్యం ఉండదు' అని చెప్పారు.ఆయన వ్యాఖ్యలు యుక్రెయిన్‌తో పాటు యూరప్ దేశాల్లోనూ ఆందోళన కలిగిస్తున్నాయి. 'ఎక్కువ మంది చర్చల్లో పాల్గొనడం వల్లనే గతంలో అవి విఫలం అయ్యాయి' అని ఆయన అన్నారు.'ఇది బ్లాక్ బోర్డు మీద చాక్‌పీసుతో రాసినప్పుడు అది రాలిపోతున్నట్లుగా అనిపించవచ్చు. కానీ నేను మీకు వాస్తవాలు చెబుతున్నాను' అని కీత్ కెల్లాగ్ అన్నారు.యుక్రెయిన్‌కు చెందిన విస్తృత సహజవనరులను అమెరికాకు అందుబాటులోకి తీసుకువచ్చేలా ట్రంప్ ప్రతిపాదించిన ఒప్పందాన్ని తాను అడ్డుకున్నట్లు జెలియెన్స్కీ చెప్పారు.ట్రంప్ ప్రతిపాదనలో తమకు 'భద్రత హామీలు' లేవని, అది కీయెవ్ ప్రయోజనాలను 'పరిరక్షించేలా లేదని' యుక్రెయిన్ అధ్యక్షుడు అన్నారు.అమెరికా యుక్రెయిన్‌కు అందిస్తున్న సాయానికి బదులుగా, ఆ దేశంలోని అరుదైన సహజ వనరులను తమకు అందుబాటులోకి తేవాలని ట్రంప్ ప్రతిపాదించారు. అలా కాకున్నా అమెరికా ఇప్పటికే చేసిన సాయానికి పరిహారంగానైనా ఇవ్వాలని అన్నారు.రష్యా యుక్రెయిన్ మీద పూర్తి స్థాయి యుద్ధం చెయ్యడం నేటోకు 'ఫ్యాక్టరీ రీసెట్'లాంటిదని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్‌సెత్ చెప్పారు.యుక్రెయిన్‌పై రష్యా దాడి నేటో సభ్య దేశాలు బలంగా, దూకుడుగా ఉండాలన్న సంకేతం ఇచ్చిందన్నారు.'ఒక్క విషయం నిజంగా మాట్లాడుకుందాం. యూరప్‌ను భయపెట్టే సమస్య విషయంలో అమెరికా అండగా నిలబడదనే విషయాన్ని మనమిపుడు కొట్టిపారేయలేం. అనేక మంది నాయకులు యూరప్‌కు సొంత సైన్యం ఉండాలని, అది ఆర్మీ ఆఫ్ యూరప్ కావాలని అంటున్నారు' అని జెలియెన్స్కీ చెప్పారు.అమెరికా మీద ఆధారపడడాన్ని తగ్గించేందుకు యూరోపియన్ దేశాలకు సైనిక వ్యవస్థ ఉండాలని గతంలో అనేక మంది నాయకులు ప్రతిపాదించారు. ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మేక్రాన్ కూడా ఈ ప్రతిపాదనకు మద్దతిచ్చారు.యూరోపియన్ యూనియన్ విదేశీ విధాన అధ్యక్షుడు కజ కల్లాస్ కూడా దీన్ని సమర్థించారు.'కొన్ని రోజుల క్రితం అమెరికా అధ్యక్షుడు ట్రంప్, తాను పుతిన్‌తో జరిపిన సంభాషణ గురించి నాతో చెప్పారు. ఒక్కసారి కూడా ఆయన చర్చల్లో యూరప్ ఉండాలని అనలేదు. అందులో ఎంతో అర్థం ఉంది. యూరప్‌కు అవసరమైనప్పుడల్లా అమెరికా అండగా ఉంటుందనేదిప్పుడు గతం' అని జెలియెన్స్కీ అన్నారు.రష్యా యుక్రెయిన్ మీద దాడి చేసి మూడేళ్లవుతోంది. యుక్రెయిన్‌ను నేటోలో చేర్చుకోవడం సాధ్యం కాకపోవచ్చని ట్రంప్, హెగ్‌సెత్ చెప్పారు.2014కి ముందు యుక్రెయిన్‌కున్న సరిహద్దుల్ని తిరిగి ఆ దేశానికి అప్పగించడం కుదరదని అమెరికా రక్షణ మంత్రి అన్నారు.చర్చల్లో యుక్రెయిన్‌ను పక్కన పెడితే తాను నేటో సభ్యత్వం తీసుకోనని జెలియెన్స్కీ చెప్పారు.

రష్యా యూరప్ దేశాలతో యుద్ధం చేసేందుకు సిద్ధమవుతోందని జెలియెన్స్కీ గతంలో హెచ్చరించారు. మిగతా భాగస్వాములను పక్కన పెట్టి యుక్రెయిన్ విషయంలో చర్చల ప్రక్రియ



కొనసాగించాలని ట్రంప్, పుతిన్ గత వారం జరిగిన ఫోన్ కాల్ సంభాషణలో నిర్ణయించారు."యుక్రెయిన్, యూరప్ మీద నిర్ణయాలు తీసుకునేటప్పుడు యుక్రెయిన్ మాదిరిగానే, యూరప్ కూడా చర్చల్లో భాగస్వామిగా ఉండాలని" జెలియెన్స్కీ అడుగుతున్నారు.తాను, పుతిన్ సౌదీ అరేబియాలో కలిసేందుకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు అమెరికా అధ్యక్షుడు చెప్పారు. పుతిన్‌ను తాను వాషింగ్టన్ పర్యటనకు ఆహ్వానించానని, అలాగే ఆయన తనను మాస్కోకు రావాల్సిందిగా కోరారని ట్రంప్ సోషల్ మీడియా ద్వారా తెలిపారు.ట్రంప్ మాస్కో పర్యటన ఎప్పుడనేది ఖరారు కాలేదు."ఏదో ఒక రూపంలో యుక్రెయిన్ కూడా చర్చల్లో పాల్గొంటుంది" అని రష్యా అధ్యక్ష భవనం అధికార ప్రతినిధి దిమిత్రీ పెస్కోవ్ చెప్పారు.శాంతిని బలవంతంగా రుద్దడాన్ని తాము ఎట్టి పరిస్థితుల్లో అంగీకరించేది లేదని జర్మనీ చాన్సలర్ ఓలాఫ్ షోల్జ్ అన్నారు.యుక్రెయిన్ విషయంలో యూరప్‌కు సొంత ప్రణాళిక ఉండాలని లేదా 'అంతర్జాతీయ భాగస్వాములు భవిష్యత్ గురించి నిర్ణయించాలని' పోలండ్ ప్రధానమంత్రి డోనల్డ్ టస్క్ సూచించారు.

# మూడు ట్రంకు పెట్టెల్లో తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలిత బంగారం, వజ్రాలు, నగలు

తమిళనాడుకు తరలింపు



తమిళనాడు దివంగత ముఖ్యమంత్రి జయలలితపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో గతంలో ఆమె నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు, నగదు, ఆస్తుల పత్రాలు మూడు ట్రంకు పెట్టెల్లో తమిళనాడు ప్రభుత్వానికి చేరాయి.శనివారం సాయంత్రం బెంగళూరులోని కోర్టు నుంచి ఈ ఆస్తులను ఏకే-47లతో వచ్చిన తమిళనాడు పోలీసు అధికారుల రక్షణలో చెన్నైకి తీసుకెళ్లారు.జయలలితకు చెందిన ఈ ఆస్తులను 1996లో అధికారులు స్వాధీనం చేసుకున్నారు. తాజాగా 36వ అదనపు సివిల్ అండ్ సెషన్స్ జడ్జి హెచ్.ఎస్. మోహన్ ఆదేశాల మేరకు వాటిని తమిళనాడుకు పంపారు.

**అందులో ఏం ఉన్నాయి?**

జయలలిత నుంచి స్వాధీనం చేసుకున్న వస్తువులలో 27 కిలోల బంగారు నగలు, వజ్రాలు, పచ్చలు, కెంపులు పొదిగిన నగలు, మూడు వెండి నాణేలు ఉన్నాయి.రూ. 59, 870తో పాటు మరో రూ.1,60, 514 విలువగల గల పాత కరెన్సీ నోట్లు, 2023 నాటి విలువ ప్రకారం రూ.10.18 కోట్లకు పైగా ఫిక్స్‌డ్ డిపాజిట్ ఫండ్‌ను కూడా తమిళనాడు పోలీసు బృందానికి అందజేశారు.ఈ ఆస్తులను తమిళనాడు హోం వ్యవహారాల జాయింట్ సెక్రటరీ జె. ఆన్ మేరీ స్వర్ణ నేతృత్వంలోని తమిళనాడు అధికారులు, స్పెషల్ ఇన్వెస్టిగేషన్ యూనిట్ ఎస్పీ విమలకు బెంగళూరు కోర్టు అందజేసింది.చెన్నై, కాంచీపురం, తంజావూరు, తిరుప్పత్తూరు, తూత్తుకుడిలో ఉన్న 6 కంపెనీలకు చెందిన 1526 ఎకరాల భూమికి సంబంధించిన ఆస్తి పత్రాలు ఇందులో ఉన్నాయి. ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో జయలలితను దోషిగా తేల్చుతూ బెంగళూరు కోర్టు 2014 సెప్టెంబర్ 27న తీర్పునిచ్చింది.



**ఆస్తులను ఏం చేస్తారు?**

జప్తు చేసిన ఆస్తులను ఏం చేయాలో నిర్ణయించాల్సిన బాధ్యత తమిళనాడు ప్రభుత్వానిదేనని కోర్టు పేర్కొంది. అంటే, ఆస్తులను విలువ కట్టి వేలంలో విక్రయించి సొమ్ము రాబట్టుకోవచ్చు లేదా ట్రెజరీకి పంపవచ్చని స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కిరణ్ ఎస్.జవళి విలేఖరులతో చెప్పారు.ఈ కేసులో ప్రజల మనోభావాలు ఎక్కువగా ఉన్నందున, వీటిని అక్రమ ఆస్తులుగా ప్రకటించి, తదనుగుణంగా జప్తు చేయాలని తమిళనాడు ప్రభుత్వాన్ని ఆదేశించినందున, సేకరించిన భూములను ఏం చేయాలో ఆ రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయించడం సరైనదని బెంగళూరు కోర్టు అభిప్రాయపడింది."ఈ భూములను ప్రజాప్రయోజనాల కోసం డెవలప్‌మెంట్‌కు ఇవ్వవచ్చు, లేదా భూమిలేని వారికి పంచవచ్చు. లేదంటే, ఆ భూములను అమ్మి ప్రభుత్వ నిధులుగా మార్చవచ్చు" అని కోర్టు ఉత్తర్వులు సూచించాయి.

"ఈ కేసును పరిగణనలోకి తీసుకుంటే, తమిళనాడు ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని పిల్లలకు ప్రాథమిక విద్యకు అవసరమైన



మౌలిక సదుపాయాల కోసం ఈ ఆస్తులను ఉపయోగిస్తుందని భావిస్తున్నాను" అని జస్టిస్ మోహన్ అన్నారు.జయలలిత కేసును విచారణ జరిపి, సుప్రీంకోర్టులో కూడా అప్పీల్ చేసినందుకు అయిన ఖర్చులకు కర్ణాటక ప్రభుత్వానికి, వీకే శశికళ, ఇళవరసి నుంచి వసూలు చేసిన రూ. 20 కోట్ల 20 వేల జరిమానాలో రూ. 13 కోట్లను చెల్లించాల్సిందిగా న్యాయస్థానం ఉత్తర్వులు జారీ చేసింది.

**ఏమిటీ కేసు?**

జయలలిత ముఖ్యమంత్రిగా ఉండటంతో ఆమెపై నమోదైన ఆదాయానికి మించిన ఆస్తుల కేసును తమిళనాడు నుంచి కర్ణాటకకు బదిలీ చేశారు. 18 ఏళ్ల పాటు వాదనలు సాగిన ఈ కేసులో జయలలితను దోషిగా తేలుస్తూ 2014 సెప్టెంబర్ 27న బెంగళూరు స్పెషల్ కోర్టు ఉత్తర్వులు వెల్లడించింది.జయలలితకు నాలుగేళ్ల జైలు శిక్షతో పాటు, రూ. 100 కోట్ల జరిమానా సైతం విధించింది. దీంతో జయలలిత ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేశారు. ఈ కేసుపై కర్ణాటక హైకోర్టులో ఆమె అప్పీల్ చేశారు.ఈ కేసులో జయలలితను నిర్దోషిగా ప్రకటిస్తూ కర్ణాటక హైకోర్టు 2015 మేలో తీర్పు ఇచ్చింది. దీంతో ఆమె తమిళనాడు ముఖ్యమంత్రిగా మళ్లీ బాధ్యతలు చేపట్టారు.అయితే, ఈ తీర్పును సవాలు చేస్తూ కర్ణాటక ప్రభుత్వం



అదే ఏడాది సుప్రీంకోర్టును ఆశ్రయించింది. అప్పీల్‌పై సుప్రీంకోర్టు నిర్ణయం తీసుకునేలోపు జయలలిత (2016 డిసెంబర్ 6న) మరణించారు.జయలలిత ఆస్తులను వేలం వేయడానికి లేదా విక్రయించడానికి ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించాలని కోరుతూ న్యాయవాది టి.నరసింహమూర్తి ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీంతో 2024లో స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌ను నియమించగా శనివారం తుది ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## ఏపీ పాటు తెలంగాణలో బర్డ్ ఫ్లూ విస్తరిస్తోందా, మనుషులకూ ఈ వ్యాధి సోకుతుందా?

కోళ్ల ఫారం, పౌల్ట్రీ ఫామ్, చికెన్, ఎగ్స్, గుడ్లు బర్డ్ ఫ్లూ, హెచ్ వన్ ఎన్ వన్ ఇన్‌ఫ్లూయంజా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లా



ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణలోనూ బర్డ్ ఫ్లూ ఆందోళన కలిగిస్తోంది. మూడు రోజుల కిందట గోదావరి జిల్లాల్లోని రెండు కోళ్ల ఫారాలలో బర్డ్ ఫ్లూ కేసులు బయటపడ్డాయి. తరువాత సమీప ఏలూరు జిల్లా, ఎన్టీఆర్ జిల్లాల్లోని కోళ్ల ఫారాల్లోనూ ఉన్నట్టుండి కోళ్లు చనిపోవడంతో వాటి శాంపిల్స్‌ను ల్యాబ్‌కు పంపారు.మరోవైపు ఏపీలోని కోళ్లల్లో బర్డ్ ఫ్లూ కేసులు బయటపడటంతో అప్రమత్తమైన తెలంగాణ ప్రభుత్వం ఏపీ నుంచి కోళ్లు, గుడ్లు తమ రాష్ట్రంలోకి రాకుండా రాష్ట్ర సరిహద్దుల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది.

**ఎలా బయటపడిందంటే..**

ఏపీలోని పశ్చిమ, తూర్పు గోదావరి జిల్లాల్లో సంక్రాంతి తరువాత కోళ్లు చనిపోవడం మొదలైంది. మొదట నాటుకోళ్లు, తర్వాత బాయిలర్..ఫారం కోళ్లు లక్షలసంఖ్యలోనే మృత్యువాత పడ్డాయి.ప్రధానంగా తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కానూరు అగ్రహారంలోని రామకృష్ణ కోళ్ల ఫారంలోనూ, పశ్చిమ గోదావరి జిల్లా తణుకు మండలం వేల్పూరు గ్రామంలోని కృష్ణానందం కోళ్ల ఫారంలోనూ రోజుల వ్యవధిలో వేల సంఖ్యలో కోళ్లు చనిపోయాయి.దీంతో ఆయా కోళ్ల ఫారాల యజమానులు ఈ విషయాన్ని పశు సంవర్ధకశాఖ అధికారుల దృష్టికి తీసుకువచ్చారు.దీనిపై స్పందించిన అధికారులు ఆ ఫారాల్లో చనిపోయిన కోళ్ళ శాంపిల్స్‌ను ఏలూరులోని ల్యాబ్ ద్వారా సేకరించి మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఉన్న నేషనల్ హైసెక్యూరిటీ డిసీజ్ డయాగ్నోసిస్ లేబొరేటరీకి ఈనెల 6వ తేదీన పంపించారు.చనిపోయిన కోళ్లల్లో బర్డ్‌ఫ్లూ (వైరస్ ఏవియన్ ఇన్‌ఫ్లుయెంజ - హెచ్5ఎన్1) నిర్ధరణ అయినట్టు నివేదిక వచ్చింది.

**10 కిలోమీటర్ల వరకు అలర్ట్ జోన్**

బర్డ్‌ఫ్లూపై నివేదిక వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం రెండు జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేసింది. కలెక్టర్ల ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లోని పశు సంవర్ధకశాఖ, వైద్య ఆరోగ్యశాఖ,రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకున్నారు.ముందుగా ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం బర్డ్ ఫ్లూ నిర్ధరణ అయిన పౌల్ట్రీల నుంచి కిలోమీటరు పరిధి వరకు పరిధి రెడ్ జోన్‌గా, అక్కడి నుంచి పది కిలోమీటర్ల వరకు అలర్ట్ జోన్‌గా ప్రకటించారు.రెడ్ జోన్ పరిధిలోని కోళ్ల పారాల్లోని అన్ని



కోళ్లనూ, గుడ్లనూ పూడ్చిపెట్టాలని ఆదేశించారు.మూడు నెలల వరకు ఈ పౌల్ట్రీలు, చికెన్ షాపులు తెరుచుకోవు.కోడిమాంసం, గుడ్లపై అమ్మకాలపై మూడు నెలలపాటు నిషేధం ఉంటుంది.అలర్ట్ జోన్ పరిధిలోని కోళ్ల ఫారాలు, చికెన్ షాపులను కూడా మూడు వారాలపాటు మూసివేస్తారు.బర్డ్ ఫ్లూ వైరస్ ప్రస్తుతం అదుపులో ఉందని, మనుషులకు సోకే అవకాశం లేదని పశు సంవర్ధకశాఖ డైరెక్టర్ డాక్టర్ దామోదర్ బీబీసీకి తెలిపారు."కోడి మాంసం, గుడ్లు బాగా ఉడికించి తినడం వల్ల ఈ వైరస్ సోకే ప్రమాదం ఉండదు. ఈ వైరస్ 70 డిగ్రీల సెంటీగ్రేట్ వద్ద పూర్తిగా నాశనం అవుతుంది. భారతీయ ఆహారపు అలవాట్లలో భాగంగా ఆహారాన్ని ఉడికించి తినడం వల్ల ప్రజలకు ఎలాంటి అనారోగ్యం కానీ, బర్డ్ ఫ్లూ సోకడం గానీ జరగదు. బర్డ్ ఫ్లూ వల్ల మనుషులు చనిపోయిన దాఖలాలు లేవు కాబట్టి ప్రజలెవరూ భయపడాల్సిన అవసరం లేదు." అని ఆయన బీబీసీతో చెప్పారు.

**కోళ్ల ఫారాలను మూసేస్తే రైతుల పరిస్థితేంటి ?**

రెడ్‌జోన్ పరిధిలో అన్ని కోళ్లఫారాలను మూసివేయడం, చికెన్ గుడ్ల అమ్మకాలపై నిషేధం విధించడంపై పౌల్ట్రీ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."పౌల్ట్రీ పరిశ్రమ బర్డ్ ఫ్లూ ప్రచారంతో ఇబ్బందుల్లోకి వెళ్లిపోయింది. కొద్ది రోజులుగా వివిధ కారణాలతో కోళ్ల పరిశ్రమ ఇబ్బందుల్లో ఉంది. దాణా ధర పెరిగి గుడ్డు ధర కూడా గిట్టుబాటు కావడం లేదు.. ఇప్పటికే చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. పరిశ్రమను గాడిలో పెట్టే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. లేదంటే రైతుకు చాలా నష్టం వస్తుంది. ఓ పౌల్ట్రీలో కోళ్లకు వైరస్ సోకితే కిలోమీటరు పరిధిలో ఉన్న ఫారాలన్నీ మూసివేయడం అన్యాయం.. " అని ప్రస్తుతం రెడ్‌జోన్‌గా ప్రకటించిన పశ్చిమగోదావరి జిల్లా వేల్పూరులోని ఓ పౌల్ట్రీ యజమాని అయిన పెనుమర్తి మోహన్ బీబీసీతో అన్నారు.అదే రెడ్ జోన్ పరిధిలోనే ఉన్న వేల్పూరుకు చెందిన మరో పౌల్ట్రీ యజమాని జీవీఆర్ఎస్ కుమార్ బీబీసీతో మాట్లాడుతూ ఆవేదన వ్యక్తం చేశారు." మా ఫారంలో 30వేల కోళ్లు ఉన్నాయి. వాటిల్లో ఏ ఒక్క దానికి కూడా బర్డ్ ఫ్లూ ఎటాక్ కాలేదు.. అయితే పక్క ఫారం ఎఫెక్ట్ వల్ల మేం కూడా బలైపోయాం., మమ్మల్ని ఆదుకోవాల్సిందిగా గవర్నమెంట్ వారిని కోరుతున్నాం." అన్నారు.

**ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ ఆందోళన**

మూడు రోజులుగా గోదావరి జిల్లాల్లో కలకలం రేపుతున్న బర్డ్ ఫ్లూ బుధవారం నుంచి ఏలూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోనూ ఆందోళన కలిగిస్తోంది. ఎన్టీఆర్ జిల్లా గంపలగూడెం మండలం అనుమ్మోలంకలోని ఓ పౌల్ట్రీ ఫామ్‌లో మూడు రోజుల్లో 11 వేల కోళ్లు మృతి చెందాయి. దీంతో చనిపోయిన కోళ్లను పరిశీలించి శాంపిల్స్ ను ల్యాబ్ కు పంపించారు.పౌల్ట్రీల వద్ద బయో సెక్యూరిటీ మెజర్స్ అమలు చేస్తున్నారు, ఇప్పటికే పశు వైద్యాధికారుల పర్యవేక్షణలో యన్.టి.ఆర్.జిల్లాలో 19 ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్స్ కోళ్ల ఫారాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాయని ఎన్టీఆర్ జిల్లా పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ హనుమంతరావు మీడియాకు తెలిపారు.మరోవైపు ఏలూరు జిల్లా బాదంపూడి సమీపంలోని ఓ పౌల్ట్రీలో బుధవారం పెద్దసంఖ్యలో కోళ్లు చనిపోవడంతో శాంపిల్స్ తీసి పరీక్షకు పంపారు.

**ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లు రాకుండా చెక్ పోస్టులు**

రాష్ట్రంతో సరిహద్దు ఉన్న ఎన్టీఆర్ జిల్లా బోర్డర్ వద్ద ఇతర రాష్ట్రాల నుంచి కోళ్లు, కోళ్ల ఉత్పత్తులు రాకుండా 12 చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశామని పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ హనుమంతరావు తెలిపారు.జిల్లాలో మృతి చెందిన కోళ్లను భూమిలో పూడ్చిపెడుతున్నామని తెలిపారు.ఏలూరు జిల్లా ఉంగుటూరుకి చెందిన ఓ వ్యక్తికి బర్డ్ ఫ్లూ సోకిందంటూ వస్తోన్న వార్తలను ఏలూరు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాలిని ఖండించారు.అదంతా తప్పుడు ప్రచారమని ఆమె బీబీసీతో చెప్పారు."బాదంపూడిలో కోళ్లు పెద్ద సంఖ్యలో చనిపోవడంతో శాంపిల్స్ తీసి పంపించాం, అంతే కానీ అక్కడ మనుషులెవరికీ బర్డ్ ఫ్లూ సోకలేదు. వైద్యశాఖ అధికారులు ఎక్కడికక్కడ మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలను పరీక్షిస్తున్నారు" అని ఆమె చెప్పారు.

**రెడ్ జోన్ పరిధిలోని ఓ కోళ్ల ఫారంలో చనిపోయిన కోళ్లు**

రాష్ట్రంలో బర్డ్ ఫ్లూ వల్ల దాదాపు 5 లక్షల కోళ్లు మరణించినట్లు సమాచారం ఉందని ఏపీ పశు సంవర్ధక, వ్యవసాయ శాఖల మంత్రి కె. అచ్చెన్నాయుడు వివరించారు.40 లక్షల కోళ్లు మరణించినట్లు జరుగుతున్న ప్రచారం అవాస్తవమని ఆయన మీడియాతో మాట్లాడుతూ చెప్పారు.స్వల్ప ఉష్ణోగ్రతల వల్ల ఇలాంటి పరిస్థితి వచ్చిందని, ఉష్ణోగ్రతలు ఎంత వేగంగా పెరిగితే అంతే వేగంగా ఈ వ్యాధి తగ్గుతుందని చెప్పారు.

# ఒక ఇంజినీర్ ట్రైన్ మిస్ కావడం వల్ల ఇంత పెద్ద ఆవిష్కరణ సాధ్యమైందని తెలుసా?



రైలు మార్గాలు వేయడం అనేది భూతల ప్రయాణంలో కొత్త శకానికి నాంది పలికింది. అంతేకాదు, మనుషులు కాలాన్ని చూసే విధానాన్ని కూడా శాశ్వతంగా మార్చివేసింది.అమెరికా, కెనడా దేశాలలోని రైల్ రోడ్ కంపెనీలు 1883లో అక్కడి వేళల్లో చేసిన మార్పులు ప్రపంచవ్యాప్తంగా టైమ్ జోన్ అనే భావనకు దారితీసింది.అంతకుముందు వేల ఏళ్లుగా సమయాన్ని కొలవడానికి సూర్యుడినే ఆధారంగా చేసుకునేవారు.గడియారం కనిపెట్టే వరకు సమయాన్ని తెలుసుకోవడానికి సూర్యుడి గమనాన్నే పరిశీలించేవారు. సూర్యుడు నడినెత్తికి వస్తే మధ్యాహ్నం అయిందని అనుకునేవారు.మధ్య యుగాల నాటి సన్ డయల్స్ స్థానంలో మెకానికల్ క్లాక్స్ వచ్చాయి.అయితే, పట్టణాల్లోని ఇలాంటి మెకానికల్ క్లాక్స్‌లో సమయాన్ని కూడా మళ్లీ సూర్యుడి గమనం ఆధారంగానే సరిచేసేవారు.దీంతో ఒక్కో పట్టణంలో ఒక్కో సమయం ఉండేది.1800 కాలం వరకు దాదాపు ఇలాంటి పరిస్థితి కొనసాగింది. అప్పట్లో ఉత్తర అమెరికాలో ఏకంగా 144 టైమ్ జోన్స్ ఉండేవి.చరిత్రను పరిశీలిస్తే చాలామంది ప్రజలు తమ ఇళ్ల నుంచి ఎక్కువ దూరాలు ప్రయాణించేవారు కాదు. గుర్రాలు, ఒంటెలు, ఎడ్ల బళ్లు వంటివే అప్పట్లో ప్రయాణ సాధనాలు. దీంతో సుదూర ప్రయాణాలు ఉండేవి కాదు.దీంతో సమయపాలన అవసరం అంతగా ఉండేది కాదు.కానీ, రైలు మార్గాలు వచ్చాక ఈ సమస్య మొదలైంది.1800ల మధ్యకాలంలో అమెరికా, కెనడాల్లో రైలు ప్రయాణాలు పెరిగాయని మేరీల్యాండ్‌లోని బాల్టిమోర్ బీఅండ్‌ఓ రైల్‌రోడ్ మ్యూజియం చీఫ్ క్యూరేటర్ జాన్ గోల్డ్‌మాన్ చెప్పారు.ఉత్తర అమెరికా ఖండం అంతటా రైళ్ల సరకు రవాణా, ప్రయాణికుల రవాణా చేస్తుండేవని చెప్పారు.దీంతో రైళ్ల సమయాల నిర్వహణలో సమస్యలు మొదలయ్యాయని గోల్డ్‌మాన్ చెప్పారు.'వేర్వేరు స్థానిక టైమ్ జోన్‌ల రైళ్ల నిర్వహణకు పెద్ద సమస్యలే తెచ్చిపెట్టింది. ప్రజలు తమ రైళ్లను మిస్ కావడం నుంచి, ఒకే ట్రాక్‌ను ఉపయోగిస్తున్నప్పుడు రైళ్లు ఢీకొనే అవకాశం కూడా ఉంది." అని గోల్డ్‌మాన్ అన్నారు.ఇలా, అమెరికా, కెనడాలోని రైళ్ల నిర్వహణ కంపెనీలు టైమ్ జోన్‌ల విధానానికి నాంది పలికాయి.1825లో ఆధునిక రైల్వే వ్యవస్థ పుట్టిన బ్రిటన్‌లో కూడా ఇలాంటి సమస్యే ఎదురైంది.రైళ్లు నగరాలను, పట్టణాలను ఒకదానికొకటి అనుసంధానం చేయడం ప్రారంభించడంతో స్థానిక టైమ్ జోన్‌ల ఆధారంగా ప్రతి రైలుకు వేర్వేరుగా రాకపోకల సమయాల జాబితాను తయారు చేయడం కష్టంగా మారింది.1847 నాటికి, అన్ని బ్రిటిష్ రైల్వే కంపెనీలు తమ నెట్‌వర్క్‌లలో ఒకే ప్రామాణిక 'రైల్వే టైమ్' ను అనుసరించాయి.కొత్త సమయపాలన పద్ధతి 1880లో ఆ దేశమంతటా అమలైంది. ఇలా సమయాన్ని ప్రామాణీకరించిన మొదటి దేశంగా బ్రిటన్ చరిత్రకెక్కింది.ప్రస్తుతం దీన్నే గ్రీన్‌విచ్ మీన్ టైమ్ అని పిలుస్తారు.సమయాన్నిప్రామాణీకరించడం వల్ల రైళ్ల సామర్థ్యం మెరుగుపడింది. రైలు ప్రమాదాలు తగ్గాయి.ఇదే ఆలోచన ఉత్తర అమెరికా వరకు వ్యాపించడానికి ఎక్కువ కాలం పట్టలేదు. కానీ అమెరికా, కెనడా విషయానికొచ్చేసరికి ఏకంగా ఒక ఖండం అంతటా సమయాన్ని ప్రామాణీకరించడానికి మార్గాన్ని కనిపెట్టాల్సి వచ్చింది.1879లో సర్ శాన్‌ఫోర్డ్ ఫ్లెమింగ్ రైలును మిస్ అయ్యారు. కెనడాలో రైలు ఇంజినీర్ అయిన ఫ్లెమింగ్‌కు ఒక ఆలోచన వచ్చింది. అదే టైమ్ జోన్.1883 నవంబర్ 18న అమెరికా, కెనడాల్లోని రైలు పరిశ్రమలు ఫ్లెమింగ్ ప్రతిపాదనను ఆమోదించాయి.అయితే, ఉత్తర అమెరికా ఖండం పెద్దది కావడంతో నాలుగు ప్రధాన టైమ్ జోన్‌లు రూపొందించాలని నిర్ణయించారు. అవి ఈస్ట్, సెంట్రల్, మౌంటెయిన్, పసిఫిక్ ప్రామాణిక సమయాలు. ఇప్పటికీ ఇవి మారలేదు.

# ఆర్బిట్రేజ్ ఫండ్స్‌తో మెరుగైన రాబడులు




వేగంగా మారిపోయే పెట్టుబడుల ప్రపంచంలో సాధారణంగా మనం ఊహించని సందర్భాల్లో అవకాశాలు వస్తుంటాయి. ధరలపరంగా ఉండే వ్యత్యాసాలను ఉపయోగించుకుని, లబ్ధిని పొందే వ్యూహమే ఆర్బిట్రేజ్. మార్కెట్లో ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకుని, మెరుగైన రాబడులను అందించే లక్ష్యంతో ఏర్పడ్డ కొత్త తరహా మ్యూచువల్ ఫండ్సే 'ఆర్బిట్రేజ్ ఫండ్స్'. వీటితో ఇన్వెస్టర్లకు ప్రయోజనం ఏమిటి, ఇవి ప్రాచుర్యంలోకి పొందడం వెనుక కారణాలేంటి, ప్రస్తుతం భారత మార్కెట్లో నెలకొన్న పరిస్థితుల్లో ఆదరణ ఎందుకు పెరుగుతోంది అనే ప్రశ్నలన్నింటికీ సమాధానం తెలుసుకునేందుకు ఒకసారి ఆర్బిట్రేజ్ ఫండ్స్ కాన్సెప్ట్, పని తీరు, సామర్థ్యాల గురించి తెలుసుకుందాం.

**ఆర్బిట్రేజ్ ఫండ్స్ ఇలా..**

'అ' అనే కంపెనీ ఈక్విటీ షేర్లు, క్యాష్ మార్కెట్లో రూ.100 వద్ద, ఫ్యూచర్ మార్కెట్లో రూ.102 వద్ద (ధర ప్రీమియంలో వ్యత్యాసాల వల్ల) ట్రేడవుతున్నాయనుకుందాం. ఫండ్ మేనేజరు 'అ' కంపెనీ షేర్లను క్యాష్ మార్కెట్లో రూ.100కు కొని, వాటిని ఫ్యూచర్స్ మార్కెట్లో రూ.102కు అమ్మాలని అనుకున్నారనుకుందాం. సాధారణంగా నెలాఖరున, ఫ్యూచర్ కాంట్రాక్టు ఎక్స్‌పైర్ అయిపోయే సమయానికి క్యాష్ మార్కెట్, అటు ఫ్యూచర్స్ మార్కెట్ ధరలు ఒకే స్థాయికి సర్దుబాటు అవుతాయి. అప్పుడు ఫండ్ మేనేజరు తన ట్రేడింగ్ లావాదేవీని రివర్స్ చేసి, రెండు ధరల మధ్య వ్యత్యాసమైన రూ.2 మొత్తాన్ని రాబడిగా పొందుతారు.

స్టాక్స్, డెరివేటివ్స్ మార్కెట్లలో ఇలాంటి వ్యూహాన్ని అమలు చేసే మ్యూచువల్ ఫండ్స్‌ను ఆర్బిట్రేజ్ ఫండ్స్‌గా పరిగణిస్తారు. మరింత సరళంగా చెప్పాలంటే ఒక అసెట్ స్పాట్ ధర (స్టాక్ మార్కెట్లో), దాని ఫ్యూచర్ ధర (డెరివేటివ్స్ మార్కెట్లో) మధ్య ఉండే వ్యత్యాసాన్ని ఉపయోగించుకుని ఈ ఫండ్స్ లబ్ధిని పొందుతాయి. అల్గోరిథమ్‌లు, నిపుణులైన ఫండ్ మేనేజర్ల సహాయంతో స్పాట్, ఫ్యూచర్స్ మార్కెట్లలో ధరల వ్యత్యాసాన్ని ఈ ఫండ్స్ నిరంతరం పరిశీలిస్తూ ఉంటాయి. అయితే, అవకాశాలు క్షణాల్లో ఆవిరైపోతాయి కాబట్టి, ఈ వ్యూహాన్ని అమలు చేయడమనేది చెప్పినంత సులువైన వ్యవహారం కాదు. ధరపరంగా వ్యత్యాసం చాలా తక్కువ పర్సెంటేజీ పాయింట్లలోనే ఉండొచ్చు, కానీ మార్కెట్లోని మిగతా వారు కూడా ఆ అవకాశాన్ని గుర్తించే ఆస్కారం ఉంది, కాబట్టి ఆ వ్యత్యాసం చాలా వేగంగా మాయమైపోవచ్చు. కనుక మిగతావారికన్నా వేగంగా స్పందించాల్సి ఉంటుంది.

**ఆర్బిట్రేజ్ ఫండ్స్ ఆకర్షణీయం**

ఫ్యూచర్స్ అండ్ ఆప్షన్స్ (ఎఫ్అండ్ఓ) సెగ్మెంట్‌ను ప్రోత్సహించే విధంగా సెబీ ఇటీవలే కొన్ని చర్యలు ప్రకటించింది. 2024 నవంబర్ 29 నుంచి అదనంగా 45 సెక్యూరిటీల్లో ఎఫ్అండ్ఓ కాంట్రాక్టులను అనుమతించింది. అలాగే, మార్కెట్ వృద్ధికి అనుగుణంగా ఉండేలా 2024 నవంబర్ 20 నుంచి ఇండెక్స్ డెరివేటివ్స్ కాంట్రాక్టు సైజును రూ.15 లక్షలకు పెంచింది. ఈ చర్యలన్నీ, దేశీయంగా డెరివేటివ్స్ మార్కెట్‌ను విస్తరించేందుకు, వైవిధ్యభరితంగా మార్చేందుకు, మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు, రిటైల్ ఇన్వెస్టర్లు మరింతగా పాలుపంచుకునేలా ప్రోత్సహించేందుకు దోహద పడతాయి. కొత్త ఫ్యూచర్స్ అందుబాటులోకి రావడం వల్ల ఫండ్లు వివిధ రంగాలు, కంపెనీలు, మార్కెట్ క్యాప్‌లవ్యాప్తంగా తమ వ్యూహాలను మరింత వైవిధ్యంగా అమలు చేసేందుకు ఆస్కారం ఉంటుంది.

**పెట్టుబడులతో ప్రయోజనాలు**

మిగతావాటితో పోలిస్తే తక్కువ రిస్క్ మార్కెట్ గమనంతో పట్టింపు లేకుండా ఈ విధానం చాలా సింపుల్‌గా ఉంటుంది. మార్కెట్లో స్ప్రెడ్లను గుర్తించి, తదుపరి ఎక్స్‌పైరీ వరకు 'లాకిన్' చేయడంపైనే ఫండ్ దృష్టి పెడుతుంది.

**ఒడిదుడుకుల మార్కెట్లలో అనుకూలం :** మార్కెట్లు ఒడిదుడుకులకు లోనవుతున్నప్పుడు రాబడులను అంచనా వేయడమనేది చాలా మటుకు మ్యూచువల్ ఫండ్ స్కీములకు కష్టమైన వ్యవహారంగా ఉంటుంది. మరోవైపు, మార్కెట్లు స్థిరంగా ఉన్నప్పుడైనా, ఒడిదుడుకుల్లో ఉన్నప్పుడైనా తక్కువ రిస్క్?తో కూడుకున్న వ్యూహాలుగా ఆర్బిట్రేజ్ ఫండ్లు మెరుగ్గా రాణించగలుగుతాయి. మార్కెట్ ఒడిదుడుకుల్లో షేర్ల ధరలు గణనీయంగా హెచ్చుతగ్గులకు లోనవుతుంటాయి కాబట్టి, వివిధ మార్కెట్లలో వాటిని అప్పటికప్పుడు కొని అమ్మేయడం ద్వారా, ఆ పరిస్థితిని ఆర్బిట్రేజ్ ఫండ్స్ తమకు అనువైనదిగా మార్చుకుంటాయి.

**పన్ను ప్రయోజనాలు :** ఈ ఫండ్స్ స్వభావరీత్యా హైబ్రిడ్ ఫండ్సే అయినప్పటికీ ఈక్విటీ ట్యాక్సేషన్‌కి అర్హత ఉంటుంది. ఫండ్ మొత్తం అసెట్స్‌లో కనీసం 65 శాతాన్ని ఈక్విటీల్లో పెట్టుబడులు పెట్టడమే ఇందుకు కారణం. ఆర్బిట్రేజ్ ఫండ్‌ను ఏడాదికన్నా ఎక్కువ కాలం అట్టే పెట్టుకుంటే దీర్ఘకాలిక క్యాపిటల్ గెయిన్స్ (ఎల్‌టీసీజీ) కింద 12.5 శాతం పన్ను రేటే వర్తిస్తుంది (రూ. 1.25 లక్షల మినహాయింపునకు లోబడి). పన్ను ఆదా చేస్తూ, స్థిరమైన రాబడులను అందించే సాధనాలను కోరుకునే ఇన్వెస్టర్లకు, ఆర్బిట్రేజ్ ఫండ్‌లు ఆకర్షణీయమైన ఆప్షన్‌గా ఉండగలవు.మార్కెట్లో ఒడిదుడు కులను అవకాశాలుగా మల్చుకునే అధునాతన వ్యూహాలతో ఆర్బిట్రేజ్ ఫండ్స్ పనిచేస్తాయి. హెచ్చుతగ్గులు, లిక్విడిటీ, నియంత్రణపరంగా స్థిరత్వం నెలకొన్న భారత మార్కెట్లో, పెట్టుబడిని కాపాడుకుంటూ స్థిరమైన వృద్ధి కోరుకునే ఇన్వెస్టర్లకు ఈ ఫండ్‌లు ఆకర్షణీ యమైన ఆప్షన్. మార్కెట్ ఒడిదుడుకుల నుంచి రక్షణ కోసం హెడ్జింగ్ కోరుకునే ఇన్వెస్టర్లు, ఆర్బిట్రేజ్ ఫండ్‌లను తప్పక పరిశీలించవచ్చు.

# అంకెలు మారాయి కానీ.. ప్రశ్న మారలేదు




మూడు బడ్జెట్ల నుంచి ఇదే ప్రశ్న.. పాత పన్ను విధానమా? కొత్త పన్ను విధానమా? ఏది మంచిది. ఏది ఎక్కువ ఉపయోగకరం. ఏది ఎవరికి ఎక్కువ ప్రయోజనకరం. ఏది మంచిదని ప్రశ్నించే బదులు ఏది ఉపయోగం అనేది సరైన ప్రశ్న. మళ్లీ పాత ప్రశ్నే. ఇరవై ఏళ్లు లేదా అంతకన్నా ముందు నుంచి అస్సెస్సీలతో సేవింగ్స్ చేయించి, అలా చేసినందుకు ఆ మేరకు మినహాయింపును ఇస్తూ వచ్చేవారు. ఏయే సెక్షన్ల ప్రకారం సేవ్ చేస్తే మినహాయింపు వస్తుంది.. అని ఆలోచించి అడుగేసేవాళ్లు.ఉద్యోగస్తులకు కంపల్సరీగా పీఎఫ్ తప్పదు. అంతేకాకుండా, ట్యాక్స్ విధానంలో 'మినహాయింపు'ను అతిగా వాడారు. డిపాజిట్ చేస్తే మినహాయింపు, విత్‌డ్రా చేస్తే మినహాయింపు, దాని మీద వడ్డీకి కూడా మినహాయింపు. సంక్షేమం అనుకోండి, పొదుపు అనుకోండి, అలవాటు అనుకోండి, ఆకర్షణీయం అనుకోండి.. పీఎఫ్‌ను అతిగా ఆశ్రయించారు. ఇలాగే ఎన్నో పథకాలు. 80సీని ప్రోత్సహిస్తూ ఇరవై పైచిలుకు పథకాలను ప్రవేశపెట్టారు. లిమిట్‌ని పెంచుతూ, 10 సంవత్సరాల పాటు రూ.1,50,000 గరిష్ట పరిమితిగా ఉంచారు. ప్రతి సంవత్సరం ఆ రూ.1,50,000 పరిమితి పెరుగుతుందని అందరూ ఎదురుచూస్తూ వచ్చారు. కానీ నిరాశే. ఎటువంటి మార్పూ లేదు. కనీసం ద్రవ్యోల్బణానికి అనుగుణంగా కూడా మార్పులు తేలేదు. ఇది. అన్యాయమే. అలాగే ఉద్యోగస్తులకు ప్రత్యేకంగా ఇచ్చే వెసులుబాటైన స్టాండర్డ్ డిడక్షన్ మినహాయింపులో పెంపుదల.. రద్దు.. పునరుద్ధరణ .. పెంపుదల ఇలా మార్పులు తెచ్చారు. ఈ మినహాయింపుని అలాగే కొనసాగిస్తూ ద్రవ్యోల్బణానికి అనుగుణంగా మారిస్తే బాగుండేది. ఇలాంటివి ఎన్నో మినహాయింపులు ఉన్నాయి.పాతకాలం నాటి అంకెలు.. ఆంక్షలు.. వీటిని ఏమీ మార్చకపోవడాన్ని 'పాలసీ' అని సరిపెట్టుకోలేము. ప్రభుత్వపు అనిశ్చితి వైఖరి ఇది అనే చెప్పాలి. గత నెలలో ట్రంప్ గెలుపు, తీసుకురాబోయే విప్లవాత్మక మార్పులు, వాటి తీవ్ర ప్రభావం మన ప్రజల మీద ఉంటుంది అని తెలిసినా స్పష్టత లేదు. అలాంటి పరిస్థితుల్లో వచ్చింది మన సీతమ్మగారి పద్దు. ఒక ప్రశ్న మాత్రం మారలేదు. అదేమిటంటే ఏది బెటర్? పాత విధానమా లేక కొత్త విధానమా? అయితే, నిస్సందేహంగా ప్రభుత్వ జోరు, హోరు, వైఖరి, ధోరణి అంతా కొత్త విధానం వైపే మొగ్గు చూపుతోంది. 'పొమ్మనలేక పొగబెట్టినట్లు' పాత విధానాన్ని ప్రోత్సహించలేదు. అది ఉంటుందా అని అడిగితే కొనసాగిస్తున్నాం అని అన్నారు ఆర్థిక మంత్రి. అయితే, కొన్ని తేడాలు, సలహాలు, సూచనలను తెలుసుకోవాలి. అవేమిటంటే..భారీగా మినహాయింపు పొందాలనుకునే వారికి పాతది మంచిది. వినియోగం వైపు మొగ్గు చూపించే వారికి కొత్త విధానం ఆకర్షణీయంగా ఉంటుంది. నిలకడగా, నిర్దిష్టంగా, నిశ్చింతగా ఆలోచించే వారికి పాతదే బెటరేమో? స్వతంత్రంగా వ్యవహరించాలి. సులువుగా ఉండాలి. అనువుగా ఉండాలి. కమిట్మెంట్ వద్దనే వారికి కొత్త విధానం బెటరు. మీ ఆదాయాన్ని లెక్కించండి. కంపల్సరీ సేవింగ్స్‌ని పరిగణనలోకి తీసుకుని ఆలోచించండి. ఇప్పుడు మార్కెట్లో ఎన్నో రెడీమేడ్ కాల్క్యులేటర్స్ ఉన్నాయి. అప్పుడు సరైన విధానాన్ని ఎంచుకోండి.

# ప్రపంచంలోనే అధిక బంగారు నిల్వలున్న దేశాలు

ప్రపంచ వ్యాప్తంగా బంగారానికి ఉన్న క్రేజ్ అంతాఇంతా కాదు. మన దేశంలో అయితే దీన్ని మరింత విలువైన లోహంగా భావిస్తారు. కొందరు బంగారాన్ని తమ గౌరవానికి సూచికగా భావిస్తే.. ఇంకొందరు దీన్నో పెట్టుబడి సాధనంగా చూస్తున్నారు. దాంతో దేశంతోపాటు ప్రపంచ వ్యాప్తంగా పసిడికి డిమాండ్ పెరుగుతూనే ఉంది. ఇటీవల దీని తులంధర ఏకంగా రూ.88 వేలు దాటిపోయింది. త్వరలో బంగారం రేటు రూ.ఒక లక్ష కూడా చేరే అవకాశం ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు. ఇదిలాఉండగా, ప్రపంచవ్యాప్తంగా ఏయే దేశాల్లో అధికంగా బంగారం నిల్వలున్నాయో కింద తెలుసుకుందాం.



యునైటెడ్ స్టేట్స్ 8,133.46 టన్నులు
జర్మనీ 3,351.53 టన్నులు
ఇటలీ 2,451.84 టన్నులు
ఫ్రాన్స్ 2,436.94 టన్నులు
చైనా 2,264.32 టన్నులు
స్విట్జర్లాండ్ 1,039.94 టన్నులు
భారతదేశం 853.63 టన్నులు
జపాన్ 845.97 టన్నులు
తైవాన్, చైనా 422.69 టన్నులు
పోలాండ్ 419.70 టన్నులు

**చైనాలో భారీ బంగారు గని**

చైనాలోని హునాన్ ప్రావిన్స్‌లోని పింగ్ జియాంగ్ కౌంటీలో ఇటీవల సుమారు రూ.7,09,577,16,96,000 విలువైన ప్రపంచంలోనే అతిపెద్ద బంగారు నిల్వల గనిని కనుగొన్నారు. ఈ నిక్షేపం వాంగు గోల్డ్‌ఫీల్డ్స్‌లో బయటపడినట్లు తెలియజేస్తున్నారు. ఇక్కడ భూగర్భ శాస్త్రవేత్తలు 2,000 మీటర్ల లోతు వరకు విస్తరించిన 40 బంగారు నిక్షేపాలను గుర్తించారు. ప్రాథమిక అంచనాల ప్రకారం వీటిలో కనీసం 300 మెట్రిక్ టన్నుల బంగారం ఉందని తేలినట్లు సమాచారం. 3,000 మీటర్ల వరకు విస్తరించిన లోతైన ఈ గనిలో మరింత నిల్వలు ఉండవచ్చని అంచనా. దాంతో ఇందులో మొత్తంగా సుమారు 1,000 మెట్రిక్ టన్నుల వరకు బంగారం ఉంటుందని కొన్ని మీడియా సంస్థలు తెలిపాయి.

# డిజిటల్ ఇన్‌ఫ్రాపై పెట్టుబడులు పెట్టాలి


నైపుణ్యాల అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి పెట్టాలి

రిమోట్ వర్కింగ్‌పై నిపుణుల అభిప్రాయాలు

ఐటీ రంగంలో రిమోట్ పని విధానంతో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాల్లో ప్రొఫెషనల్స్‌కు అవకాశాలు పెరుగుతున్న నేపథ్యంలో డిజిటల్ మౌలిక సదుపాయాలపై మరింతగా ఇన్వెస్ట్ చేయాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడ్డారు. అలాగే, అంతర్జాతీయ ప్రాజెక్టులను కూడా అందిపుచ్చుకునేలా ప్రొఫెషనల్స్ నైపుణ్యాలను మెరుగుపర్చడంపైనా, తగిన వేదికలను ఏర్పాటు చేయడంపైనా దృష్టి పెట్టాల్సి ఉంటుందని పేర్కొన్నారు. దేశ, విదేశ మార్కెట్ల అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాల్లో శిక్షణ కల్పించేందుకు జాతీయ స్థాయిలో అయిదు సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌లను ఏర్పాటు చేయాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతించారు. రిమోట్ ఐటీ వర్క్‌తో ద్వితీయ, తృతీయ శ్రేణి నగరాల్లోని నిపుణులకు అవకాశాలు లభించడంతో ఆదాయ ఆర్జన సామర్థ్యాలు మెరుగుపడి, సమ్మిళిత వృద్ధికి దోహదపడుతుందని టెక్ మహీంద్రా సీవోవో అతుల్ సొనేజా తెలిపారు.

**సామర్థ్యాల వెలికితీతకు అవకాశం..**

చిన్న పట్టణాల్లోని ప్రతిభావంతుల సామర్థ్యాలను వెలికి తీసేందుకు డిజిటల్ ఇన్‌ఫ్రా, విశ్వసించతగిన ఇంటర్నెట్ కనెక్టివిటీ, కొత్త నైపుణ్యాల్లో శిక్షణా కార్యక్రమాలు అవసరమని జ్ఞానిడాట్‌ఏఐ సీఈవో గణేష్ గోపాలన్ చెప్పారు. సైబర్ సెక్యూరిటీ వ్యవస్థలను పటిష్టం చేయడం, పరిశ్రమలో భాగస్వామ్యాలను పెంపొందించడం మొదలైనవి చిన్న పట్టణాల్లోని ప్రొఫెషనల్స్ అంతర్జాతీయంగా పోటీపడేందుకు ఉపయోగపడగలవని వివరించారు.





# నీతా అంబానీకి అరుదైన గౌరవం



రిలయన్స్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, చైర్‌పర్సన్ నీతా అంబానీకి అమెరికాలో అరుదైన గౌరవం లభించింది. ఆమె దార్శనిక నాయకత్వం, సమాజానికి చేసిన అసాధారణ సేవకు గుర్తింపుగా మసాచుసెట్స్ విశిష్ట గవర్నర్ ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేసింది. మసాచుసెట్స్ గవర్నర్ మౌరా హీలే చేతుల మీదుగా నీతా అంబానీ ఈ ప్రశస్తిని అందుకున్నారు.మసాచుసెట్స్ విశిష్ట గవర్నర్ ప్రశంసాపత్రం గురించి తెలియజేస్తూ భారత్‌తోపాటు ప్రపంచవ్యాప్తంగా విద్య, ఆరోగ్య సంరక్షణ, క్రీడలు, కళలు, సంస్కృతి, మహిళా సాధికారత వంటి వివిధ రంగాలలో నీతా అంబానీ గణనీయమైన ప్రభావాన్ని చూపారంటూ రిలయన్స్ ఫౌండేషన్ సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా తెలిపింది."మా వ్యవస్థాపక చైర్‌పర్సన్ నీతా అంబానీని దార్శనిక నాయకురాలిగా, వితరణశీలిగా, అసలైన గ్లోబల్ గేమ్‌ఛేంజర్‌గా గుర్తిస్తూ మసాచుసెట్స్ గవర్నర్ మౌరా హీలే ప్రతిష్టాత్మక గవర్నర్ ప్రశంసాపత్రాన్ని ప్రదానం చేశారు" అని రిలయన్స్ ఫౌండేషన్ పోస్ట్‌లో వివరించింది.ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో నీతా అంబానీ చేతితో నేసిన అద్భుతమైన శికార్గా బనారసి చీర ధరించి పాల్గొన్నారు. భారతీయ కళా నైపుణ్యానికి ఉదాహరణగా నిలిచే ఈ చీర అధునాతన కడ్వా నేత నైపుణ్యం, సాంప్రదాయ కోన్యాహంగులను సంతరించుకుంది. నీతా అంబానీ ఈ చీరను ధరించడం ద్వారా భారతదేశ కళాత్మక వారసత్వ వైభవాన్ని మరోసారి అంతర్జాతీయంగా చాటారు.

# జీతాల పెంపుపై టీసీఎస్ ప్రకటన : ఈ సారి ఎంతంటే





టెక్ పరిశ్రమలో కొంత కాలంగా అనిశ్చితి పరిస్థితులు నెలకొన్నాయి. దిగ్గజ కంపెనీలు సైతం తమ ఉద్యోగులను తొలగించేస్తున్నాయి. ఈ తరుణంలో భారతదేశంలో అతిపెద్ద ఐటీ సేవల సంస్థ 'టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్' కొత్తగా ఉద్యోగులను నియమించుకోవడం మాత్రమే కాకుండా.. వేతనాల పెంపుకు సంబంధించి కూడా ఒక కీలక ప్రకటన చేసింది.2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వేతనాల పెంపుకు సంబంధించిన లెటర్లను.. మార్చి చివరి నాటికి ఉద్యోగులకు అందించనుంది. ఏప్రిల్ నుంచి పెరిగిన జీతాలతో.. చెల్లింపులు మొదలవుతాయి. అయితే వేతన పెంపు 4 శాతం నుంచి 8 శాతం వరకు ఉండే అవకాశం ఉందని అంచనా.వేతనాలు 2023-24 ఆర్థిక సంవత్సరం 7.9 శాతం, 2022-23లో 10.5 శాతం పెరిగాయి. అయితే ఈ సారి మాత్రం ఎంత పెరుగుతుంది అనే విషయం అధికారికంగా వెల్లడి కాలేదు. అక్టోబర్ - డిసెంబర్ కాలానికి ఫిబ్రవరిలో కంపెనీ విడుదల చేసిన త్రైమాసిక వేరియబుల్ పే తర్వాత.. దానికి అర్హతగల ఉద్యోగులకు వస్తుంది. సీనియర్ స్థాయి ఉద్యోగులు 20 శాతం నుంచి 40 శాతం వరకు తక్కువ చెల్లింపులను పొందుతూనే ఉన్నారు.టీసీఎస్ కంపెనీలో గ్రేడ్స్ వరకు వివిధ కేటగిరీలలో ఉద్యోగులు ఉన్నారు.ఉన్న ఉద్యోగులు, ఆపైన బ్యాండ్‌లో ఉన్న వారిని సీనియర్ కేటగిరీగా పరిగణిస్తారు. ఇటీవల విడుదల చేసిన వేరియబుల్ పేలో 70 శాతం మంది ఉద్యోగులు 100 శాతం అందుకున్నట్లు తెలుస్తోంది. దీని వల్ల సీ3, కింది స్థాయిలో ఉన్న వారికి ఎక్కువ ప్రయోజనం చేకూరినట్లు తెలుస్తోంది.

# తొమ్మిది సెషన్‌ల నుంచి నష్టాలే



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం నష్టాల్లో ట్రేడవుతున్నాయి. దాంతో సూచీలు వరుసగా తొమ్మిది సెషన్‌లుగా నష్టాల్లో ట్రేడవుతున్నట్లు తెలుస్తుంది. ఉదయం 9:30 సమయానికి నిఫ్టీ103 పాయింట్లు నష్టపోయి 22,835కు చేరింది. సెన్సెక్స్ 309 పాయింట్లు దిగజారి 75,621 వద్ద ట్రేడవుతోంది. అమెరికా డాలర్ ఇండెక్స్ 106.67 పాయింట్ల వద్దకు చేరింది. బ్రెంట్ క్రూడ్‌ఆయిల్ బ్యారెల్ ధర 74.81 అమెరికన్ డాలర్ల వద్ద ఉంది. యూఎస్ 10 ఏళ్ల బాండ్ ఈల్డ్‌లు 4.47 శాతానికి చేరాయి. అమెరికా మార్కెట్లు గడిచిన సెషన్‌లో లాభాలతో ముగిశాయి. ఎస్ అండ్ పీ గత సెషన్‌తో పోలిస్తే 0.01 శాతం నష్టపోయింది. నాస్‌డాక్ 0.41 శాతం పెరిగింది.డిసెంబర్ త్రైమాసికం ఫలితాలు ముగిసిపోయాయి. డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య విధానాలతో నెలకొన్న అనిశ్చితుల మధ్య చోటుచేసుకునే అంతర్జాతీయ పరిణామాలపైకి ఇన్వెస్టర్ల దృష్టి మళ్లొచ్చని మార్కెట్ నిపుణులు అంచనా వేస్తున్నారు. వీటికి అదనంగా డాలర్‌తో రూపాయి తీరు, బ్రెంట్ క్రూడ్ ధరలు సైతం ప్రభావం చూపించొచ్చని భావిస్తున్నారు. విదేశీ ఇన్వెస్టర్ల పెట్టుబడుల తీరు, కరెన్సీ మారకంపై మార్కెట్ దృష్టి సారించొచ్చని అభిప్రాయపడ్డారు. దేశీయంగా ఎలాంటి ముఖ్యమైన సంకేతాలు లేకపోవడంతో అంతర్జాతీయ పరిణామాలు దేశీయ మార్కెట్ తీరును నిర్ణయించొచ్చని చెబుతున్నారు.

# ఈ వారం 2 ఐపీవోలు.. 10 లిస్టింగ్‌లు




ఈ వారం రెండు కొత్త ఐపీవోలు ప్రారంభం కానుండగా, మెయిన్‌బోర్డ్, ఎస్ఎంఈ విభాగంలో కలిపి 10 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజ్‌ల్లో లిస్ట్ కానున్నాయి. మెయిన్ బోర్డ్‌లో 17న అజాక్స్ ఇంజనీరింగ్, 19న హెక్సావేర్ టెక్నాలజీస్, 21న క్వాలిటీ పవర్ లిస్ట్ కానున్నాయి. ఎస్ఎంఈ కంపెనీ హెచ్‌పీ టెలికామ్ ఐపీవో 20న ప్రారంభం కానుంది. ఒక్కో షేరు ధర రూ.108. ప్రమోటర్లే 34.28 కోట్ల షేర్లను ఆఫర్ చేస్తున్నారు. మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, యూపీ, గుజరాత్ తదితర రాష్ట్రాల్లో యాపిల్ ఉత్పత్తులను ఈ సంస్థ పంపిణీ చేస్తుంటుంది. సివిల్ కన్‌స్ట్రక్షన్ కార్యకలాపాల్లోని బీజాసాన్ ఎక్స్‌ప్లోటెక్ అనే మరో ఎస్ఎంఈ ఐపీవో 21న మొదలు కానుంది. 34.24 లక్షల తాజా ఈక్విటీ షేర్ల జారీ రూపంలో కంపెనీ రూ.60 కోట్లు సమీకరించాలనుకుంటోంది.

Editor, printed and owned by Bommarboyina Venkanna, Associate Editor K Rajendra Prasad "office: Amber Nagar, Parshigutta, Secundrabad, Cell.no: 099592 36324, 9912824332